అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

ఆదివారం 6-8-2017

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 3 సంచిక : 219 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar, Mahaboobnagar, Warangal | www.navatelangana.com | 12 + 16 పేజీలు + సోపతి వెల: 6.00

పదోన్నతుల్లో రిజర్వేషన్లు రాజ్యాంగ విరుద్ధం

బాంబే హైకోర్టు వెల్లడి

2లో

లైంగిక వేధింపుల్లో ఫిర్యాదులకు దూరం

జాతీయ మహిళా కమిషన్ సభ్య కార్యదర్శి సత్బీర్‌బేడీ



9లో

ఉపరాష్ట్రపతి వెంకయ్య

11న ప్రమాణ స్వీకారం

98 శాతం పోలింగ్

- 785 ఓట్లకు గాను పోలైనవి 771
- వెంకయ్యనాయుడుకు 516, గోపాలకృష్ణ గాంధీకి 244
- 14 మంది ఓటు హక్కు వినియోగించుకోలేదు: రాజ్యసభ సెక్రటరీ జనరల్ షరీఫ్



వెంకయ్యకు స్వీట్ తినిపిస్తున్న ప్రధాని మోడీ

న్యూఢిల్లీ : భారత నూతన (13వ)ఉప రాష్ట్రపతిగా ఎం. వెంకయ్యనాయుడు ఎన్నికయ్యారు. ప్రతిపక్షాల ఉమ్మడి అభ్యర్థి, గాంధీజీ మనవడు గోపాలకష్ణ గాంధీపై విజయం సాధించారు. ఈ ఎన్నికలో మొత్తం రాజ్యసభ, లోక్‌సభ సభ్యులు, నామినేటేడ్ సభ్యులతో కలిపి 785 మంది ఓటర్లు కాగా, అందులో 14 మంది ఓట్లు హక్కును వినియోగించుకోలేదు. 771 ఓట్లు పోలవ్వగా, అందులో 760 చెల్లిన ఓట్లు, 11 ఓట్లు చెల్లనవిగా ఎన్నికల రిటర్నింగ్ అధికారి, రాజ్యసభ సెక్రటరీ జనరల్ షంషేర్ షరీఫ్ వెల్లడించారు. మొత్తం 98.2 శాతం పోలింగ్ జరిగిందని తెలిపారు. శనివారం ఉదయం 10 గంటలకు పార్లమెంట్ ఆవరణలోని రూమ్ నెంబర్ 62లో మొదలైన ఈ ఓటింగ్ ప్రక్రియ, సాయంత్రం 5 గంటలకు ముగిసింది. దీంతో వెంటనే పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభించారు. ఓట్లు లెక్కింపు అనంతరం షరీఫ్ మీడియా సమావేశంలో 760 ఓట్లలో వెంకయ్యకు 516 రాగా, ప్రతిపక్షాల ఉమ్మడి అభ్యర్థి గోపాలకష్ణ గాంధీకి 244 ఓట్లు వచ్చాయని, గోపాలకష్ణ గాంధీపై 272 ఓట్ల తేడాతో వెంకయ్య గెలిచినట్లు ఆయన వెల్లడించారు. ఒకే బ్యాలెట్ బ్యాక్స్ ద్వారా పోలింగ్‌ను నిర్వహించామని తెలిపారు. పోలింగ్ అనంతరం పోటీలో ఉన్న అభ్యర్థులు, పోలింగ్ పరిశీలకుల సమక్షంలో బ్యాలెట్ బాక్స్ షీల్ వేశామని, సాయంత్రం 6 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభించామని వివరించారు. అంతకు ముందు అందరి సమక్షంలోనే బ్యాలెట్ బాక్సు షీల్ విప్పామన్నారు. మొదటిగా చెల్లిన, చెల్లని ఓట్లును వేరు చేశామని, అనంతరం మొదటి ప్రాధన్యత ఓట్లు వేరు చేశామని చెప్పారు. 381 మ్యాజిక్ ఫిగర్ కాగా, 516 ఓట్లతో వెంకయ్య నాయుడు విజయం సాధించారని వెల్లడించారు. ప్రస్తుత ఉప రాష్ట్రపతి హమీద్ అన్సారీ పదవీ కాలం ఈ నెల 10తో ముగియనుంది. దీంతో ఆగస్టు 11న వెంకయ్య 13వ ఉప రాష్ట్రపతిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

ఉద్యోగాల్లో తగ్గుతున్న మహిళలు

ఇటీవలి కాలంలో దేశంలో మహిళా ఉద్యోగుల సంఖ్య బాగా క్షీణిస్తున్నట్టుగా మేధోమథన సంస్థయైన భారత ఆర్థిక పర్యవేక్షణ కేంద్రం(సీఎంఐఈ) అధ్యయనంలో వెల్లడైంది.

ఈ ఏడాది మొదటి నాలుగు నెలల్లో పురుష ఉద్యోగుల సంఖ్య 9 లక్షలమేర పెరగగా, మహిళా ఉద్యోగుల సంఖ్య 24 లక్షలమేర తగ్గినట్టు తెలిపింది. దేశంలోని పలు రంగాలలో మహిళల భాగ స్వామ్యం ఈ ఏడాది పొడవునా తరుగుదల నమోదవుతోందని తాజా అధ్యయనంలో వెల్లడైంది. యాడ్ ఏజెన్సీలు, స్టార్టప్‌లు, నిర్మాణ రంగం, వ్యవసాయ క్షేత్రాలు, పని ప్రాంతాలన్నిటిలోనూ మహిళల భాగస్వామ్యం తగ్గుతోంది.

శ్రామికశక్తిలో 27 శాతమే

- నాలుగు నెలల్లో 24 లక్షలు తగ్గుదల
- 20 ఏండ్ల క్రితం 34.8 శాతం
- సీఎంఐఈ, ప్రపంచ బ్యాంక్ నివేదికల్లో వెల్లడి



న్యూఢిల్లీ: ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన మూడో నగరమైన దేశ రాజధాని ఢిల్లీలో 2004 నుంచి 2012 వరకు గణాం కాలను పరిశీలిస్తే మహిళలు అధిక సంఖ్యలో ఉద్యోగాలను వదిలేసినట్టు స్పష్టమవుతోంది. ప్రస్తుతం, భారత శ్రామిక శక్తిలో మహిళలు 27 శాతం మాత్రమే. 2017 ఏప్రిల్‌లో ప్రపంచ బ్యాంక్ విడుదల చేసిన నివేదిక ప్రకారం 2013లో దక్షిణాసి యాలో పాకిస్తాన్ తర్వాత మహిళా ఉద్యోగులు తక్కు వగా ఉన్న దేశం భారత్. రెండు దశాబ్దాల ముందు మహిళల భాగస్వామ్యం 34.8 శాతం ఉండగా, 2013కల్లా 27 శాతానికి పడిపోయింది. ప్రపంచ బ్యాంక్ నివేదిక ప్రకారం గ్రామీణ ప్రాంతాలతోపాటు పట్టణ ప్రాంతాల్లోనూ శ్రామిక శక్తిలో మహిళల భాగస్వామ్యం (ఎఫ్ఎల్ఎఫ్‌పీ) నిరక్షరాస్యులు, గ్రాడ్యు యేట్ల నుంచే అధికంగా ఉంటున్నది. వారు పని చేసే రంగాలలో వారే నైపుణ్య కార్మికులు కూడా.వీరి భాగస్వామ్యం ఇటీవల బాగా ...9లో

జీఎస్టీపై న్యాయపోరాటం

- కేంద్రం ఏకపక్షంగా వ్యవహరిస్తోంది: సీఎం కేసీఆర్

హైదరాబాద్: వస్తు సేవల పన్ను (జీఎస్టీ) అమలులో మొదటి నుంచి కేంద్ర ప్రభుత్వానికి బాస టగా నిలిచిన తెలంగాణ ముఖ్య మంత్రి కే. చంద్రశేఖర్‌రావు స్వరం మార్చారు. జీఎస్టీ విధానం అమలు విషయంలో కేంద్ర ప్రభు త్వం అనుసరిస్తున్న ఏకపక్ష వైఖ రికి వ్యతిరేకంగా న్యాయ పోరాటం చేస్తామని అన్నారు. శనివారం ఢిల్లీలో జరిగిన జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో తీసుకున్న నిర్ణయా లపై ఆ సమావేశానికి హాజరైన మంత్రి కేటీఆర్, సీనియర్ అధికా రులతో కేసీఆర్ చర్చించారు. కౌన్సిల్ నిర్ణయాలపై తీవ్ర నిరసన వ్యక్తంచేశారు. ఈ విషయంలో ప్రధానికి ఆదివారం లేఖ ...9లో

బిడ్డపై బెంగ

కేటీఆర్ రాజకీయ భవిష్యత్తుపై కేసీఆర్‌కు చింత

- కాపాడేందుకు శతవిధాలా ప్రయత్నం

నవతెలంగాణబ్యూరో - హైదరాబాద్

తనయుడు కేటీఆర్ రాజకీయ భవిష్యత్తుపై ముఖ్యమంత్రి కేసీఆర్ ఆందోళనగా ఉన్నారని తెలుస్తోంది. తన తర్వాత కేటీఆర్‌ను పార్టీలోనూ, ప్రభుత్వంలోనూ భవిష్యత్తు నేతగా చూపెట్టేందుకు ప్రయత్నిస్తున్నా, ప్రతిపక్షాలు కేటీఆర్‌ను టార్గెట్ చేయడాన్ని ఆయన తట్టుకోలేకపోతున్నారు. సిరిసిల్లలో నేరెళ్ల ఘటన, హిమాన్షు మోటర్స్ వ్యవహారం కేటీఆర్ మెడకు చుట్టుకోవడంతో, దాన్నుంచి ఆయనను బయటపడేయటానికి ముఖ్యమంత్రి కేసీఆర్ కష్టపడు తున్నారని తెలిసింది. రాష్ట్రంలో కేటీఆర్‌ను తిరుగులేని నేతగా తయారు చేయడం కోసం అనేక శాఖలను కేటాయించారు. పంచాయతీరాజ్ శాఖను తప్పించినా ముఖ్యమైన పరిశ్రమలు, పురపాలక పట్టణాభివృద్ధి, మైనింగ్, ఎన్ఆర్ఐ, ఐటీ శాఖల బాధ్యతలను అప్పగించారు. పరోక్షంగా ఆర్థికశాఖ, రవాణా శాఖ, హోంశాఖలను ఆయన చూస్తున్నారని తెలిసింది. అయితే ఐటీ, పరిశ్రమల్లో పెయిల్ కావడం, ఆశించిన రీతిలో ...9లో



(ఫైల్)

సర్కారంటే మంత్రులే కాదు

అధికారులపై దాడులు చేస్తే తీవ్ర పరిణామాలు:

టీజీవో చైర్మెన్ వి శ్రీనివాస్‌గౌడ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రభుత్వమంటే మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులే కాదని, ఉద్యోగులు, అధికారులు భాగమేనని తెలంగాణ గెజిటెడ్ అధికారులు (టీజీవో) కేంద్ర సంఘం చైర్మెన్, ఎమ్మెల్యే వి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి వెళ్లాలంటే అధికారులు, ఉద్యోగులు కీలక పాత్ర పోషిస్తారని చెప్పారు. అధికారులపై కలెక్టర్లు, ఐఏఎస్‌లు దాడులు చేయడాన్ని ఖండించారు. భవిష్యత్తులో ఇలాంటివి జరిగితే తీవ్ర పరిణామాలుంటాయని, చర్యకు ప్రతి చర్య ఉంటుందని హెచ్చరించారు. శనివారం హైదరాబాద్‌లో టీజీవో కేంద్ర సంఘం కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మీడియాతో మాట్లాడుతూ తెలంగాణలో ఆంధ్ర అధికారుల పెత్తనం సహించబోమన్నారు. విభజన చట్టంలో లొసుగుల కారణంగా 6 నుంచి పదో తరగతి వరకు ...9లో



మాట్లాడుతున్న శ్రీనివాస్ గౌడ్

పస్తులుంచారు

బియ్యం రాలేదు..అన్నం వండలేదు

నవతెలంగాణ-గండిపేట్

రంగారెడ్డి జిల్లా గండిపేట్ మండలంలో సర్కారు పాఠశాలల్లో మధ్యాహ్న భోజనానికి కేసీఆర్ సర్కారు పంగనామంపెట్టింది. మండలంలోని 20 పాఠశాలలకు వారం నుంచి బియ్యం సరఫరాను నిలిపేసింది. తమ వద్ద స్టాక్ ఉన్నంత వరకు మధ్యాహ్న భోజన కార్మికులు వండిపెట్టారు. నాలుగైదు రోజులుగా ఆయా గ్రామాల్లో సర్పంచులు, పక్క హాస్టళ్ల సహకారంతో మధ్యాహ్న భోజనం వండిపెట్టారు. శనివారం వారు కూడా ముందుకు రాకపోవటంతో మండలంలోని 9 పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం నిలిచిపోయింది. ఎప్పట్లాగే బెల్లు కొట్టగానే ప్లేట్లు పట్టుకుని వచ్చిన విద్యార్థులు అన్నం లేకపోవటంతో అలమటించారు. కాలే కడుపులతో పొద్దుందాక అట్లాగే ఉన్నారు. ఏజెన్సీలకు మధ్యాహ్నభోజనాన్ని అప్పగించటంలో భాగంగానే ఈ తతంగం అన్న విమర్శ వస్తున్నది.

గండిపేట్ మండలంలో 15 ఉన్నత పాఠశాలలు, 5 ప్రాథమిక పాఠశాలలున్నాయి. మొత్తం మండలంలో 6వేలు పైగా విద్యార్థులు సర్కారు బడుల్లో చదువుతున్నారు. మండలంలోని పాఠశాలలకు కొన్ని రోజులుగా బియ్యం సరఫరాను సర్కారు నిలిపివేసింది. దీంతో పక్క స్కూళ్ల నుంచి, హాస్టళ్లనుంచి రెండు, మూడు రోజులు తెచ్చిపెట్టారు. అక్కడా బియ్యం సమస్య తలెత్తింది. దీంతో స్టాక్ ఉన్న చోట మాత్రమే భోజనం వండిపెడుతున్నారు. స్టాక్ పూరైన చోట ఉపాధ్యాయులు చేతులెత్తేశారు. కొన్ని గ్రామాల్లో సర్పంచులు, టీచర్లు ఒకట్రెండు రోజులు మధ్యాహ్న భోజనం పెట్టించేందుకు సహకరించారు. ఆ తర్వాత వారు కూడా ముఖం చాటే శారు. నార్సింగ్ పాఠశాలలో 400 మంది విద్యార్థులు న్నారు. ఈ పాఠశాలలో ఎస్‌సీ సంక్షేమ హాస్టల్ నుంచి తెప్పించిన బియ్యంతో వండిపెట్టారు. అక్కడా బియ్యం అయి పోతుండటంతో ఆ హాస్టల్ సిబ్బంది బియ్యం ఇచ్చేందుకు ముందుకు రాలేదు. అంత మంది విద్యార్థులకు భోజన సౌకర్యం కల్పించేందుకు ఎవరూ చొరవ చూపలేదు. దీంతో ...9లో



ఆకలితో అలమటించిన విద్యార్థులు

గండిపేటలో నిలిచిన భోజనం

మొక్కల పేర దళితుల భూములకు ఎసరు

9లో



సార్..! తమరికి తుగ్లక్ నవాబులు, రాజులు ఎవరైనా పూనారేమో.. మంత్రించి తాయిత్తు కంటించుకోండి.. మాట్లాడేప్పుడు భద్రంగా మాట్లాడండీ..!!

నిర్మాణ దశలోనే...

కూలిన డబుల్ బెడ్ రూం పిల్లర్లు

- నాసిరకం ఇసుక, సిమెంట్‌తో నిర్మాణ పనులు
- 20 ఇండ్ల కోసం.. రూ.1.10కోట్లు కేటాయింపు

నవతెలంగాణ-కల్లూరు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణంలో నాసిరకం ఇసుక, సిమెంట్ వాడుతుండటంతో పిల్లర్లు మెట్ల స్లాబ్ నిర్మాణ దశలోనే కుప్పకూలాయి. ఖమ్మం జిల్లా కల్లూరు మండల పరిధిలోని చిన్నకోరుకొండిలో తొలివిడతలో 20ఇండ్లు మంజూరు కాగా ఒక్కో ఇంటికి రూ.5.50లక్షల చొప్పున రూ.1.10కోట్ల వరకు ప్రభుత్వం కేటాయించింది. ఇండ్ల నిర్మాణ పనులను అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడు కాంట్రాక్టు తీసుకున్నాడు. 20ఇండ్లలో ఒకటి పూర్తవగా మిగతా వాటికి పిల్లర్ లెవల్ పూర్తైంది. ప్రస్తుతం స్లాబ్ పనులు నడుస్తున్నాయి. కాగా ఈ నెల 3న కూలీలు పనిచేస్తుండగా పిల్లర్, మెట్ల స్లాబ్ కూలుతుండడం గమనించి పక్కకు పరిగెత్తడంతో ప్రాణాలతో బయటపడ్డారు. ఒకరిద్దరికి స్వల్ప గాయాలు కాగా వారిని తక్షణమే అక్కడున్నంచి పంపించారు. ఇది గమనించిన స్థానికులు నాసిరకంగా ఇండ్లు నిర్మిస్తే మేం బతికేదెలా? అని ప్రశ్నించారు. అనంతరం స్థానికులు విలేకరుల దృష్టికి తీసుకురాగా శనివారం ఆ ఇండ్లను 'నవతెలంగాణ' పరిశీలించింది. ఈ సందర్భంగా అనేక విషయాలు వెలుగులోకొచ్చాయి.



నాణ్యతా ప్రమాణాలు డొల్ల

ఇసుకలో మట్టి శాతం ఎక్కువ ఉండటం వల్ల పిల్లర్లు కూలినట్టు తెలుస్తోంది. ఓ ఇంటికి స్లాబ్ వేసిన తర్వాత పరిశీలించగా పిల్లర్లకు క్రాక్ వచ్చి కూలిపోయే దశకు చేరుకున్నాయి. ప్రతి ఇంటికీ ఆరు పిల్లర్లు ఉండాల్సి ఉండగా మధ్యలో వేసిన పిల్లర్‌ను భూమిలో నుంచి కాకుండా బేస్‌మెంట్ పైనే నిర్మించారు. ఇటీవల పడిన వర్షాలకు కింద మట్టి కొట్టుకుపోయి బీమ్ కుంగి పోవడంతో ఇటుకలు పేర్చి అమర్చారు. అంతేగాకుండా స్లాబ్ వేయడానికి 55నుంచి 60 కట్టల సిమెంట్ ...9లో

నిటి ఆయోగ్ వైస్ చైర్మెన్‌గా రాజీవ్‌కుమార్



న్యూఢిల్లీ: నిటి ఆయోగ్ వైస్ చెర్మెన్‌గా ప్రముఖ ఆర్థికవేత్త రాజీవ్ కుమార్, సభ్యుడిగా డాక్టర్ వినోద్ పాల్ శనివారం నియమితుల య్యారు. రాజీవ్‌కుమార్.. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ నుంచి అర్థశాస్త్ర విభాగంలో డీఫిల్, లక్నో యూని వర్సిటీలో పీహెచ్‌డీ పూర్తి చేశారు. ప్రస్తుతం ఆయన సెంట్రల్ ...9లో

ఒకే హోదా- ఒకే పింఛన్ కోసం
9న నిరసనలకు పిలుపు

న్యూఢిల్లీ : మాజీ సైనికోద్యోగులకు 'ఒకే హోదా- ఒకే పింఛన్' అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 9న ఢిల్లీలోని రాజ్‌ఘాట్ వద్ద నిరసనలు తెలపనున్నట్టు మాజీ సైనికోద్యోగుల సంఘం ముఖ్య కార్యదర్శి రణబీర్ సింగ్ తెలిపారు. 'ఒకే హోదా- ఒకే పింఛన్', పాత పింఛన్ విధానాలు అమలు వంటి వివిధ డిమాండ్లతో ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నట్టు చెప్పారు. విశ్రాంత ఆర్మీ ఉద్యోగులందరూ జంతర్ మంతర్ వద్ద జరిగే నిరసన కార్యక్రమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

రాహుల్‌పై దాడి ఘటనలో బీజేపీ నేత అరెస్టు

అహ్మదాబాద్ : గుజరాత్‌లో కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రాహుల్‌గాంధీ వాహనంపై శుక్రవారం రాళ్లదాడి జరిగిన ఘటనలో బీజేపీ నేతను పోలీసులు అరెస్టు చేశారు. బనాస్కంత జిల్లాకు చెందిన బీజేపీ నేత జయేశ్ దర్జీతో పాటు మరో ముగ్గురిని శనివారం అదుపులోకి తీసుకున్నట్టు పోలీసు ఉన్నతాధికారి ఒకరు వెల్లడించారు. బనాస్కంత జిల్లాలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో రాహుల్ పర్యటిస్తుండగా.. ఆయన కాన్వాయ్‌పై కొందరు వ్యక్తులు రాళ్లదాడికి పాల్పడిన సంగతి తెలిసిందే. బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ మనుషులే రాళ్లదాడికి పాల్పడ్డారని రాహుల్ ఆరోపించారు. అయితే.. దాడిపై ఆందోళనలు చేపట్టి సమయం వృథా చేయొద్దని, వరద బాధితులకు సాయం అందించాలని పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. దాడిపై ప్రధాని మోడీ ఎందుకు మౌనంగా ఉంటున్నారని ఆయన ప్రశ్నించారు.


పదోన్నతుల్లో రిజర్వేషన్లు రాజ్యాంగ విరుద్ధం

- బాంబే హైకోర్టు

ముంబయి : మహారాష్ట్రలో ఉద్యోగుల పదోన్నతుల్లో రిజర్వేషన్లను అమలు చేయడాన్ని బాంబే హైకోర్టు తీవ్రంగా తప్పుబట్టింది. ఇది రాజ్యాంగ విరుద్ధమని అభిప్రాయపడింది. ఈ మేరకు రాష్ట్రప్రభుత్వం తీసుకొచ్చిన ముసాయిదాను న్యాయమూర్తులు అనూప్ మెహతా, అమ్‌జాద్ సయద్‌లతో కూడిన ధర్మాసనం శుక్రవారం కొట్టివేసింది. ఎస్సీ, ఎస్టీ, ప్రత్యేక వెనుకబడిన తరగతులు, మరికొన్ని కులాలకు చెందిన ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లను కల్పిస్తూ ప్రభుత్వం 2004లో తీర్మానం చేసింది. ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా హైకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. కాగా.. పదోన్నతుల్లో రిజర్వేషన్లు కల్పించడం సరికాదని జడ్జి మనోజ్ సోనక్ గతవారంలో చేసిన వ్యాఖ్యలను ధర్మాసనం సమర్థించింది. మరోవైపు.. ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టులో సవాల్ చేసేందుకు ప్రభుత్వానికి ధర్మాసనం 12 వారాల గడువు ఇచ్చింది. ఈ నేపథ్యంలోనే తీర్పును అక్టోబర్ 27 వరకు నిలిపి ఉంచేందుకు అనుమతి తెలిపింది. పదోన్నతుల్లో రిజర్వేషన్లు రద్దు చేస్తే ఆ ప్రభావం వేలాది మందిపై పడనున్నది. కొందరు ఉద్యోగులు 2004 నాటి మార్గదర్శకాల ప్రకారం.. పదోన్నతులు పొంది, రిటైర్డ్ కూడా అయ్యారు. ఒకవేళ హైకోర్టు తీర్పు అమల్లోకొస్తే.. వారు పెన్షన్ సదుపాయాన్ని కోల్పోవాల్సి వస్తుంది. అంతేకాదు.. రిజర్వేషన్ కింద పదోన్నతి పొంది ఇప్పటివరకు ఎక్కువ మొత్తంలో తీసుకున్న పెన్షన్‌ను కూడా తిరిగి ప్రభుత్వానికి ఇవ్వాల్సి ఉంటుంది. అయితే.. దీనిపై సుప్రీంకోర్టు ఎలా స్పందిస్తుందేమోనని రిటైర్డ్, ప్రస్తుత ఉద్యోగులు ఆత్రుతగా ఉన్నారు.

రేపు పాక్షిక చంద్రగ్రహణం

- రాత్రి 10.52 గంటలకు ప్రారంభం



కోల్‌కతా : ఆకాశంలో అద్భుతం.. సోమవారం పాక్షికంగా చంద్ర గ్రహణం ఏర్పడనున్నదని కోల్‌కతాలోని బిర్లా ప్లానెటేరియం రీసెర్చ్, అకడమిక్ డైరెక్టర్ దేబిప్రసాద్ దువారీ వెల్లడించారు. సోమవారం రాత్రి 10.52 గంటలకు చంద్రగ్రహణం ప్రారంభమై మంగళవారం 0.48 గంటల వరకు(116 నిమిషాలు) కొనసాగుతుం దన్నారు. ఇది ఆసియా, ఆస్ట్రేలియాలోని అన్ని ప్రాంతాల్లో, యూరప్, ఆఫ్రికాలోని చాలా చోట్ల కనపడుతుందని తెలిపారు. దక్షిణ, ఉత్తర అమెరికాలో దీన్ని చూసేందుకు అవకాశం లేదన్నారు. చంద్రగ్రహణం ఏర్పడే సమయంలో అక్కడ పగలు కావడంతో కనిపించదని అన్నారు. ఆకాశం మేఘావృతమైతే తప్ప.. దేశంలోని అన్ని ప్రాంతాల్లో చంద్రగ్రహణాన్ని వీక్షించవచ్చని ఆయన వివరించారు. చంద్రగ్రహణాన్ని కంటితో చూడవచ్చని, ఎలాంటి టెలిస్కోపులూ, ఇతర పరికరాలూ ఉపయోగించాల్సిన అవసరం లేదని తెలిపారు(సూర్య గ్రహణాన్ని వీక్షించే సమయంలో టెలిస్కోపులు వినియోగిస్తుంటారు). సూర్యుడు, భూమి, చంద్రుడు ఒకే సరళ రేఖ పైకి వచ్చినప్పుడు(భూమి మధ్యలో..) చంద్రగ్రహణం ఏర్పడుతుంది.

లైంగిక వేధింపుల కేసులో హర్యానా బీజేపీ నేత తనయుడి అరెస్ట్

చండీగఢ్ : లైంగిక వేధింపుల కేసులో హర్యానా బీజేపీ నేత సుభాష్ బరలా తనయుడు వికాస్‌ను పోలీసులు శనివారం అదుపులోకి తీసుకున్నారు. చండీగఢ్‌లోని సెక్టార్ 26లో వికాస్‌తోపాటు, ఇతని స్నేహితుడు ఆశీష్‌ను కూడా అరెస్టు చేసినట్టు పోలీసులు తెలిపారు.కారులో వెళుతున్న ఒక ప్రభుత్వాధికారి కుమార్తెను వెంబడించి, తీవ్రంగా వేధించారని, దాదాపు కిడ్నాప్ చేసినంత పనిచేశారని ఆమె సెక్టార్ 26 పోలీస్ స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. వెంటనే స్పందించి నిందితులను అరెస్టుచేసిన పోలీసులను సామాజిక మాధ్యమంలో ఆమె ప్రశంసించారు. శుక్రవారం రాత్రి ఆమె కారులో ఇంటికి వెళుతుండగా.. తప్పతాగిన వారు కారును వెంబడించారు. కారును ఆపాలని ఆమెను హెచ్చరిస్తూ వేధించారు. కారు నడుపుతూ ఆమె పోలీస్ హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేసింది. ఆమె వేగాన్ని పెంచి ముందుకు సాగింది. అయినా వారు ఆగకుండా ఛేజ్ చేసి... కారును అడ్డుకున్నారు. కారులోంచి ఆమెను బయటకు లాగేందుకు ప్రయత్నించారు. అంతలో అక్కడకు చేరుకున్న పోలీసులు ఇద్దరినీ అదుపులోకి తీసుకున్నారు.

టాయిలెట్లు లేక చెరువు గట్టుకు.. చెరువులో పడి ఇద్దరు చిన్నారుల మృతి


చెన్నై : తమిళనాడులోని తిరువన్నమలై సమీపంలోగల పయ్యూరు గ్రామంలో ఘోరం జరిగింది. ఇంట్లో టాయిలెట్లు లేక చెరువు గట్టుకు వెళ్ళిన చిన్నారులు ప్రమాదవశత్తూ అందులో పడి మరణించారు. గత రాత్రి 8.30 గంటల ప్రాంతంలో శరణ్య, దర్శిని బహిర్భూమికి వెళ్ళారు. చీకట్లో నడుచుకుంటూ వస్తూ ప్రమాదవశాత్తూ దర్శిని (10) చెరువులో పడిపోయింది. ఆమెను కాపాడేందుకు శరణ్య (13) అందులో దూకింది. ఇద్దరూ నదిలో ప్రాణాలు విడిచారు. బయటకు వెళ్ళిన పిల్లలు ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు వారి కోసం వెతుకులాట ప్రారంభించారు. శనివారం ఉదయం చెరువులో వారి మృతదేహాలు కనిపించడంతో గ్రామంలో విషాద చాయలు అలుముకున్నాయి. మరుగుదొడ్లు కట్టించాలని అధికారులను పలుసార్లు వేడుకున్నా పట్టించుకోలేదని గ్రామస్థులు వాపోతున్నారు.

కర్ణాటక మంత్రి @ రూ. 11 కోట్లు..

బెంగళూరు : కర్ణాటక మంత్రి డికె శివకుమార్ ఇంటిపై ఆదాయ పన్ను శాఖ నాలుగు రోజుల పాటు సాగిన దాడులు శనివారం ఉదయంతో ముగిసాయి. బుధవారం ఈ దాడులు ప్రారంభమైన విషయం తెలిసిందే. ఈ నాలుగు రోజుల వ్యవధిలో కర్ణాటక, ఢిల్లీలో వున్న 60 ప్రదేశాల్లో ఈ దాడులు జరిగాయి. రాజ్యసభ ఎన్నికల నేపథ్యంలో గుజరాత్‌కు చెందిన 43 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు అత్యంత విలాసవంతమైన రిసార్ట్‌లో డికె శివకుమార్ ఆతిథ్యం ఇచ్చాడు. ఈ నేపథ్యంలో మంత్రిని ఆధికారులు విచారిస్తున్నారు. మంత్రికి చెందిన 60 ప్రదేశాల్లో సుమారు 11 కోట్లకు పైగా రూపాయిలను స్వాధీనం చేసుకున్నట్టు అధికారులు తెలిపారు. తాను చట్టాలను, రాజ్యాంగాన్ని ఉల్లంఘించేవాడిని కాదని, నిజాలు త్వరలోనే బయటకు వస్తాయని మీడియాతో మాట్లాడుతూ మంత్రి తెలిపారు.

కేరళలో బీజేపీ కొత్త వ్యూహం

- నేడు రాష్ట్రానికి అరుణ్‌జైట్లీ



తిరువనంతపురం : దుష్ప్రచారమే లక్ష్యంగా కేరళలో అధికార సీపీఐ(ఎం)ను ఎదుర్కొవడానికి బీజేపీ కొత్త ఎత్తుగడలు వేస్తోంది. ఆదివారం తిరువనంతపురంలో ఒక రోజు పర్యటనకు కేంద్ర మంత్రి, సీనియర్ నేత అరుణ్‌జైట్లీని ఇదే లక్ష్యంతో తీసుకునివస్తోంది. కేరళలోని బీజేపీ నాయకులపై మోడీ - షా నేతృత్వంలోని జాతీయ నాయకత్వం సంతృప్తిగా లేదు. పినరయి విజయన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా మరింత తీవ్రంగా పనిచేయాలని వత్తిడి పెంచుతోంది. ఈ నేపథ్యంలోనే రాజకీయ హింసాకాండతో పినరయి విజయన్‌కు సంబంధం వుందని ఆరోపిస్తూ రాష్ట్ర గవర్నర్ పి సదాశివంకు బీజేపీ నాయకులు ఇటీవల మెమోరాండం కూడా అందచేశారు. కాగా, ఆదివారం ఉదయమే తిరువనంతపురానికి అరుణ్‌జైట్లీ చేరుకుని, హత్యకు గురైన ఆర్‌ఎస్‌ఎస్ నేత ఇంటిని సందర్శిస్తారు. తరువాత ఆర్‌ఎస్‌ఎస్-బీజేపీ కార్యకర్తలు, కుటుంబ సభ్యులతో సమావేశంలో మంత్రి పాల్గొంటారు. కాగా, తమ కార్యకర్తలపై దాడులు జరుగుతున్నాయని బీజేపీ చేస్తున్న ప్రచారాన్ని సీపీఐ(ఎం) తీవ్రంగా ఖండిస్తోంది. సీపీఐ(ఎం) ఎలాంటి దాడులను చేయడం లేదని తెలిపింది. గత కొంతకాలంగా బీజేపీ -ఆర్‌ఎస్‌ఎస్ కొనసాగిస్తున్న హింసాకాండలో పదుల సంఖ్యలో సీపీఐ(ఎం) కార్యకర్తలు ప్రాణాలు కోల్పోగా, వందలమంది తీవ్రంగా గాయపడ్డారని పార్టీ పొలిట్ బ్యూరో తెలిపింది. ఏదిఏమైనా ఇటీవల జరిగిన ఆర్‌ఎస్‌ఎస్ నేత హత్యను రాజకీయ ఆయుధంగా ఉపయోగించుకోవాలని బీజేపీ భావిస్తోంది. కేరళలోనూ, పార్లమెంట్‌లోనూ దీన్ని భారీగా ప్రచారం చేయాలని బీజేపీ వ్యూహాలు పన్నుతోంది.

సోషల్

కేరళలో ఆర్‌ఎస్‌ఎస్ ఎత్తుగడ



వెంకయ్యకు పలువురి అభినందనలు

న్యూఢిల్లీ :13వ ఉప రాష్ట్రపతిగా ఎన్నికైన వెంకయ్య నాయుడుకు ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ శుభాకాంక్షలు తెలిపారు. ఆయన పదవీ కాలం ఆదర్శవంతంగా ఉంటుందని ఆకాంక్షిస్తున్నట్టు పేర్కొన్నారు. జాతి నిర్మాణ లక్ష్యానికి కట్టుబడి, కర్తవ్యం, అంకితభావం గల ఉప రాష్ట్రపతిగా సేవలందించగలరన్న నమ్మకం తనకు ఉందని పేర్కొన్నారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే మోడీ ట్వీట్ చేశారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా, కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ తదితరులు వెంకయ్యకు ట్విట్టర్ ద్వారా అభినందనలు తెలిపారు.

ఏచూరి అభినందనలు

ఉపరాష్ట్రపతిగా ఎన్నికైన వెంకయ్య నాయుడుకు సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అభినంద నలు తెలిపారు. ఆయనతో పాటు కాంగ్రెస్ నేత గులాం నబీ ఆజాద్ కూడా వెంకయ్యకు అభినందనలు తెలిపారు.

రాజ్యాంగ విలువలకు కట్టుబడి ఉంటా: వెంకయ్య

తనను ఉపరాష్ట్రపతిగా గెలిపించిన అందరికి దన్యవాదాలని, రాజ్యాంగ విలువలకు కట్టుబడి ఉంటానని వెంకయ్య నాయుడు పేర్కొన్నారు. ఉన్నత విలువలకు కట్టుబడి, రాజ్యాంగానుసారం నడుచుకుంటానని హామీ ఇస్తున్నానని అన్నారు.

వెంకయ్యకు గోపాలకృష్ణ గాంధీ అభినందనలు

ఉపరాష్ట్రపతిగా విజయం సాధించిన వెంకయ్య నాయుడుకు పలువురు అభినందనలు చెబుతున్నారు. ఫలితం వెలువడిన వెంటనే గోపాలకష్ణ గాంధీ మీడియాతో మాట్లాడారు. వెంకయ్యనాయుడుకు అభినందనలు చెప్పారు. తనకు మద్దతు పలికిన అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు చెప్పారు.

వెంకయ్య గురించి...

నెల్లూరు జిల్లా చవటపాలెం మండలంలో 1949 జులై 1న వెంకయ్యనాయుడు జన్మించారు. వెంకయ్య తల్లి దండ్రులు రమణమ్మ, రంగయ్య నాయుడు. నెల్లూరులోని వెంకటగిరి రాజా హైస్కూలులో పదో తరగతి వరకూ, వి.ఆర్.కాలేజీలో పొలిటికల్ సైన్స్‌లో డిగ్రీ వరకూ చదివారు. ఆ తర్వాత ఆంధ్ర విశ్వవిద్యాలయంలో న్యాయవిద్యను అభ్యసించారు. చిన్నప్పటి నుంచి రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆరెస్సెస్)కార్యకర్తగా ఉన్నారు. కళాశాల విద్యార్థిగా ఉన్నప్పుడు ఏబీవీపీలో పనిచేశారు. ఆంధ్ర లా కాలేజీ తరపున ఏబీవీపీ అధ్యక్షుడిగా ఎన్నికైయ్యారు. 1972లో వచ్చి జై ఆంధ్ర ఉద్యమంలో వెంకయ్య పాల్గొన్నారు. కాకాని వెంకట రత్నం పంతులు వంటి ప్రముఖులతో కలిసి పనిచేశారు. నెల్లూరు కేంద్రంగా జై ఆంధ్రా ఉద్యమానికి సారథ్యం వహించారు. 1977లో అత్యయిక స్థితి సమయంలో జరిగిన ఆందోళనల్లో పాల్గొన్నారు. జైలుకు కూడా వెళ్లారు. అప్పట్లో బిజెపి యువజన విభాగానికి అధ్యక్షుడిగా ఉన్నారు.



1978లో జరిగిన సాధారణ ఎన్నికల్లో ఉదయగిరి నుంచి పోటీ చేసి అసెంబ్లీకి ఎన్నికయ్యారు. 1983 ఎన్నికల్లో వెంకయ్యనాయుడు రెండోసారి ఎమ్మెల్యేగా గెలిచారు. అప్పట్లో ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీకి వెంకయ్యనాయుడు పెద్దదిక్కుగా మారారు. ఆ తర్వాత జాతీయ రాజకీయాల్లోకి వెళ్లాలని భావించారు. పార్టీలో అనేక కీలక పదవుల్లో ఆయన పనిచేశారు. 1996నుంచి 2000 వరకూ బీజేపీ జాతీయ అధికార ప్రతినిధిగా పనిచేశారు. ఈ క్రమంలో 1998లో కర్నాటక నుంచి రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికయ్యారు. ఆ తర్వాత 2004, 2010లోనూ వరుసగా ఎంపీ అయ్యారు. దక్షిణాది రాష్ట్రాల్లో పార్టీకి పెద్దదిక్కుగా మారారు. 2002లో బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. మూడేళ్లపాటు ఆ పదవిలో కొనసాగారు. 2004లో బీజేపీ ఓటమి అనంతరం ఆ పదవికి రాజీనామా చేశారు. 2014 సాధారణ ఎన్నికల్లో బీజేపీ గెలిపొందడంతో మోడీ ప్రధాని అయ్యారు. వెంకయ్యనాయుడును తన మంత్రివర్గంలో చేర్చుకుని పట్ట ణాభివద్ధిశాఖ, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ బాధ్యతలు అప్పగించారు. అయితే పార్లమెంటరీ వ్యవహా రాల మంత్రిత్వ శాఖలో అనుకున్నంత స్థాయిలో రాణిం చకపోవడంతో 2016లో జరిగిన మంత్రివర్గ విస్తరణలో ఆయనను ఆ పదవి నుంచి తీసేసి, సమాచార శాఖకు బదిలీ చేశారు. 2014లో ఆంధ్రప్రదేశ్ విభజన చట్టం పార్లమెం టులో ప్రవేశపెట్టిన సమయంలో వెంకయ్య ఉన్నారు. ఈయన ఆరోజు చేసిన డిమాండ్లను, బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత నెరవేర్చకపోవడంతోపాటు, కొంటె సాకులు చెబుతున్నారని విమర్శ ఉంది. బీజేపీ నిబంధనవళి ప్రకారం ఏవ్యక్తికైన మూడు సార్లు మాత్రమే రాజ్యసభకు ఎన్నికైయ్యే అవకాశముంది. కానీ ఆ పార్టీ నిబంధనవళికి విరుద్ధంగా 2016లో అరుణ్‌జైట్లీ, వెంకయ్య నాయుడుకు నాలుగో సారి కూడా రాజ్యసభకు అవకాశం కల్పించారు.

వెంకయ్య మూడో తెలుగు వ్యక్తి

భారత ఉపరాష్ట్రపతిగా బాధ్యతలు నిర్వహించిన వారిలో ఇప్పటికే ఇద్దరు తెలుగు వారు ఉన్నారు. వెంకయ్య నాయుడు ఆ పదవి పొందిన మూడో తెలుగు వ్యక్తిగా పేరొందారు. 1952లో ఉపరాష్ట్రపతి పదవిని తొలిసారిగా తెలుగు వారైన సర్వేపల్లి రాధాకష్ణన్ అధిష్టించారు. భారత తొలి ఉపరాష్ట్రపతి ఆయనే కావడం విశేషం. రెండు పర్యాయాలు ఉపరాష్ట్రపతిగా బాధ్యతలు నిర్వహించిన అనంతరం భారత రాష్ట్రపతిగా ఎన్నికయ్యారు. 1967లో తెలుగు ప్రముఖుడు వరాహగిరి వెంకటగిరి కూడా ఉపరాష్ట్రపతిగా విజయం సాధించారు. వివి గిరిగా పేర్కొనే ఆయన అనంతరం రాష్ట్రపతి పదవికి జరిగిన ఎన్నికల్లో గెలుపొంది రాష్ట్రపతిగా పనిచేశారు. ఇప్పటి వరకు ఉప రాష్ట్రపతులుగా పనిచేసిన ఇద్దరు తెలుగు ప్రముఖులు సర్వేపల్లి రాధాకష్ణన్, వివి గిరిలు అనంతరం రాష్ట్రపతి పదవికి ఎన్నిక కావడం విశేషం. 1977లో మరో తెలుగు ప్రముఖుడు నీలం సంజీవరెడ్డి ఏకగ్రీవంగా రాష్ట్రపతి పదవికి ఎంపికయ్యారు.

ఓటింగ్‌కు గైర్హాజరైన ఎంపీలు

భారత ఉప రాష్ట్రపతి ఎన్నికల ఓటింగ్‌కు 14 మంది పార్లమెంటు సభ్యులు గైర్హాజరయ్యారు. ఓటింగ్‌లో పాల్గొనని ఎంపీలలో బీజేపీ, కాంగ్రెస్ చెందిన చెరో ఇద్దరున్నారు. ఇండియన్ యూనియన్ ముస్లింలీగ్ (ఐయూఎంఎల్) నుంచి ఇద్దరు, టీఎంసీ నుంచి నలుగురు, ఎన్‌పీసీ, పీఎంకే నుంచి ఒక్కొక్కరు, ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులు ఉన్నారు. వీరిలో విజయ్ గోయల్, సన్వర్ లాల్ జాట్ (బీజేపీ), మౌసమ్ నూర్, రాణీ నరా (కాంగ్రెస్), అను ఆఘా, నబా కుమార్ సరానియా (ఇండ పెండెంట్లు), అబ్దుల్ వహబ్, పికె కున్హల్లి కుట్టీ (ఐయూ ఎంఎల్), కున్వల్ కుమార్ ఘోష్, తపస్ పాల్, ప్రతిమా మోండల్, అభిషేక్ బెనర్జీ (తణమూల్ కాంగ్రెస్), ఉద్యానరాజే భోంస్లే (ఎన్‌సీపీ), అన్బుమణి రామ్‌దాస్ (పీఎంకే) ఉన్నారు.

పోలింగ్ బూత్‌ల వద్ద అభ్యర్థుల ఆస్తులు, కేసుల వివరాల హోర్డింగ్‌లు

- మధ్యప్రదేశ్ ఈసీ నిర్ణయం
- స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రయోగాత్మకంగా..



భోపాల్ : మధ్యప్రదేశ్‌లో ఈ నెల 11న జరగున్న 37 స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి రాష్ట్ర ఈసీ వినూత్న నిర్ణయం తీసుకుంది. ఓటర్లు ఓటు హక్కు వినియోగిం చుకునే ముందు ఒక మంచి నిర్ణయం తీసుకోవడానికి వీలుగా అభ్యర్థుల ఆస్తులు, వారిపై ఉన్న క్రిమినల్ కేసుల వివరాలను పోలీంగ్ బూత్‌ల వెలుపల ప్రదర్శించాలని మధ్యప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల కమిషన్ (ఎస్ఈసీ) నిర్ణయిం చింది. ఎన్నికల ప్రక్రియ పనుల్లో ఉన్న అధికారులకు ఈ మేరకు ఎస్ఈసీ ఆదేశాలను జారీచేసింది. అభ్యర్థులు తమ తమ అఫిడవిట్లలో నమోదుచేసిన ఆస్తులు-అప్పులు, విద్య, క్రిమినల్ కేసుల వివరాలను పేర్కొంటూ పెద్ద పెద్ద ఫ్లెక్సీలను తయారుచేయించాల్సిందిగా ఆదేశించింది. ప్రతి పోలింగ్ బూత్ వెలుపల ఈ హోర్డింగ్స్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు ప్రజా సంబంధాల శాఖ అధికారి చెప్పారు. 37 స్థానిక సంస్థలు, 23 నగర పంజాయితీల ఎన్నికల్లో ప్రయోగాత్మకంగా దీనిని అమలుచేయనున్నట్టు చెప్పారు. ఈ నిర్ణయాన్ని ఓటర్ల హక్కుల పోరాట కార్యకర్తలు స్వాగతించారు. 'ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం. దీనివల్ల ఓటర్లు పోలింగ్ కేంద్రానికి వెళ్లేందుకు అభ్యర్థుల పూర్వాపరాలను అర్థం చేసుకుంటారు' అని అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫామ్స్ (ఏడీఆర్) మధ్యప్రదేశ్ కన్వీనర్ రోలి శివహరే వ్యాఖ్యానించారు. ఇందుకు సంబంధించి తాము గతంలో ఎన్నికల కమిషనన్‌కు వినతిపత్రం సమర్పించామని, ఇప్పుడు అమలులోకి రావడం హర్షణీయమని అన్నారు. లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఇది అమలుచేయాలని డిమాండ్ చేశారు.

ఇప్పుడు మేం సర్కార్‌లో ఉన్నాం..

- బీహార్ 'బీఫ్' దాడిపై బీజేపీ నేత

పాట్నా : బీహార్‌లోని బోజ్‌పూర్ జిల్లాలో బీఫ్ తరలిస్తున్నారన్న అనుమానంతో ట్రక్కును ఆపి అందులోని ముగ్గురు వ్యక్తులను చితకబాదిన ఘటన బీజేపీ, భజరంగదళ్ కార్యకర్తలు ముందస్తు ప్రణాళిక ప్రకారం చేసిందేనని తేలింది.

ఈ దాడిపై స్పందిస్తూ.. తాము ఇప్పుడు ప్రభుత్వ భాగస్వామ్యంలో ఉన్నామని బీజేపీ రాష్ట్ర నేత ఒకరు వ్యాఖ్యానించారు. "అక్రమ" మాంసం వ్యాపారులకు సంబంధించిన 'ప్రూఫ్'ను పోలీసులకు సమర్పించాని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరినట్టు చెప్పారు. 'రాణీసాగర్ ప్రాంతంలోని అక్రమ అక్రమ కబేళాల గురించి మేము గతంలో కూడా పోలీసులకు ఫిర్యాదుచేశాం. కానీ, వారు మా ఫిర్యాదులను పట్టించులేదు. ఇప్పుడు బీజేపీ ప్రభుత్వ భాగస్వామ్యంలో ఉంది. మాలో ఉత్సాహం పెరిగింది' అని బీఫ్ దాడిపై స్పందిస్తూ బీజేపీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు భువర్ ఓజా అన్నారు. షాపూర్ అసెంబ్లీ నియోజకవర్గంలో రాణీసాగర్, భగాహీ ప్రాంతాలు ముస్లిం ప్రాబల్యం కలిగినవి. 'అక్రమ కబేళాలపై ఈ రోజు మేము ఎలాంటి ఆందోళనా కార్యక్రమాలకు దిగడంలేదు. ఎందుకంటే పోలీసులు చర్య తీసుకుంటారన్న ఆశాభావంతో ఉన్నాం. మా సొంత ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఇప్పుడు ఆందోళనకు దిగదలుచుకోలేదు' అని ఓజా అన్నారు. బీహార్‌లో కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత.. తొలి 'బీఫ్ దాడి' ఘటన గురువారం చోటుచేసుకున్న విషయం తెలిసిందే.

అనంతరం అక్రమ కబేళాలపై 'పోలీసుల పట్టించుకోవడంలేద'ని నిరసిస్తూ బీజేపీ కార్యకర్తలు ఆందోళన కూడా చేశారు. ఈ నేపథ్యంలో అక్రమ కబేళాను నడుపుతున్న యజమాని, బీజేపీ కార్యకర్తలు దాడికి పాల్పడిన ట్రక్కుకు సంబంధించి డ్రైవర్ సహా ముగ్గురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ట్రక్కులోని మాంసాన్ని పరీక్ష నిమిత్తం ఫోరెన్సిక్ ల్యాబ్‌కు తరలించారు.

ఉస్మానియాలో పదవుల పందేరం!

ఓ కులానికే అడ్మినిస్ట్రేటివ్ పోస్టుల్లో ప్రాధాన్యత

- లోపించిన సామాజిక సమతుల్యత
- ప్రతిభ, అనుభవం, అర్హత ఉన్నా గుర్తింపు సున్నా
- కుంటుపడుతున్న బోధన, పరిశోధన
- పాలక మండలి లేక పాలన గాలికి
- ఇష్టారాజ్యంగా వీసీ నిర్ణయాలు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్/ఉస్మానియా విశ్వవిద్యాలయం

రాష్ట్రంలోనే ప్రతిష్టాత్మకమైన ఉస్మానియా విశ్వవిద్యాలయం (ఓయూ)లో అడ్మినిస్ట్రేటివ్ పోస్టుల్లో ఓ కులానికే ప్రాధాన్యత ఇస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వీసీ సామాజిక వర్గానికే పదవులు కట్టబెడుతున్నారని సీనియర్ అధ్యాపకులు, విద్యార్థులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో వీసీగా రామచంద్రం బాధ్యతలు చేపట్టాక ఆయన సామాజిక వర్గానికి చెందిన ఏడుగురిని అడ్మినిస్ట్రేటివ్ పదవుల్లో నియమించారు. సీఎఫ్ఆర్‌డీ డైరెక్టర్, సోషియాలజీ విభాగాధిపతిని దూరవిద్య కేంద్రం డైరెక్టర్‌గా, షాప్ కోఆర్డినేటర్‌గా, అకడమిక్ స్టాఫ్ కాలేజ్ డైరెక్టర్‌గా ఉన్న వారికే ఇండియన్ ఓషన్ సర్వీస్ డైరెక్టర్, బషీర్‌బాగ్ లా కాలేజీ ప్రిన్సిపాల్‌గా వ్యవహరిస్తున్న వారికే (వీసీ బంధువు) లాగల్ సెల్ ఇంచార్జీ డైరెక్టర్, ఎస్టేట్స్ జాయింట్ డైరెక్టర్, ఐక్యూఏసీ డైరెక్టర్‌గా ఉన్న వారికే ఓయూ గెస్ట్‌హౌజ్ డైరెక్టర్, కామర్స్, ఎంబీఏ కాలేజీ ప్రిన్సిపాల్, అకడమిక్ ఆడిట్ సెల్ జాయింట్ డైరెక్టర్, పరీక్షల విభాగం అదనపు నియంత్రణాధికారి వంటి పదవులను వీసీ కట్టబెట్టారు. ప్రతిభ, అనుభవం, అర్హతలను పరిగణనలోకి తీసుకోకుండా సామాజికవర్గం ప్రాతిపదికన నియమించడం ఉస్మానియాలో చర్చనీయాంశమైంది. ఇంకోవైపు ఒక్కొక్కరికీ రెండు, మూడు పదవులను కట్టబెడుతున్నారు. ఒక సామాజికవర్గం ఆధిపత్యంలో ఓయూ బందీగా మారిందని కొందరు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సీనియర్లను విస్మరించడం, జూనియర్లను పదవుల్లో నియమించడం దేనికి సంకేతమని కొందరు ప్రశ్నిస్తున్నారు. ఓయూలో సామాజిక సమతుల్యత లోపించిందని వీసీ నిర్ణయాలను బట్టి అర్థమవుతున్నది. ఉస్మానియాలో పదవుల పందేరం... సాగుతున్నది. వీసీ వైఖరిని సీనియర్ ప్రొఫెసర్లు తప్పుపడుతున్నారు. దీంతో బోధన, పరిశోధన కుంటుపడుతున్నది. అడ్మినిస్ట్రేటివ్ పదవులు జూనియర్లకు కట్టబెట్టడంతో వారు బోధనపై దృష్టి సారించడం లేదు. తమను విస్మరించారని సీనియర్లూ బోధించడం లేదు. ఏదేమైనా బోధన, పరిశోధనలకు ఎవరూ ప్రాధాన్యత ఇవ్వకపోవడంతో విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారు.

ఓయూ ప్రతిష్టకే మచ్చ...


తెలంగాణలో ఉస్మానియా విశ్వవిద్యాలయం అంటేనే ఉద్యమాలకు కేంద్రం. చదువుల నిలయం. ఇంకోవైపు 2017, ఏప్రిల్ 26,27,28 తేదీల్లో ఉస్మానియా శతాబ్ది ఉత్సవాలు జరిగాయి. ఏడాది పొడవునా ఈ ఉత్సవాలు కొనసాగనున్నాయి. ఇంకోవైపు 2018, జనవరి 5 నుంచి 105వ సైన్స్ కాంగ్రెస్ జరగనుంది. ప్రధాని ప్రారంభిస్తారు. ఓయూ కీర్తి ప్రతిష్టలు మరింత పెరగాల్సిన సమయమిది. కానీ సామాజిక వర్గాల ఆధారంగా వీసీ పక్షపాత ధోరణితో చూడడాన్ని సీనియర్ ప్రొఫెసర్లు ప్రశ్నిస్తున్నారు. వీసీ ఇలా వ్యవహరించడం ఓయూ ప్రతిష్టకే మచ్చ తెస్తుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. అందరినీ కలుపుకొని, సామాజికి వర్గాల ప్రాతిపదిక కాకుండా ప్రతిభ, అనుభవం, అర్హతలను బట్టి అడ్మినిస్ట్రేటివ్ పదవులు కట్టబెట్టాలని సూచిస్తున్నారు. ఇంకోవైపు ఓయూ పాలక మండలి (ఈసీ)ని 2011, నవంబర్ 15న నియమించారు. పాలక మండలి మూడేండ్లపాటు కొనసాగుతుంది. అంటే 2014, నవంబర్ 14వ తేదీ నాటికి ఓయూ పాలక మండలి పదవీకాలం గడువు ముగిసింది. మూడేండ్లు అవుతున్నా పాలక మండలిని ప్రభుత్వం నియమించలేదు. పాలక మండలి లేక ఓయూ పాలనను ప్రభుత్వం గాలికొదిలేసింది. పాలక మండలి లేకపోవడంతో అడ్మినిస్ట్రేటివ్ పదవులను వీసీ ఇష్టానుసారంగా నియమిస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. రామచంద్రం వీసీగా బాధ్యతలు చేపట్టడం వర్సిటీ శ్రేయస్సు కోసమా? లేక సామాజిక వర్గ అభివృద్ధి కోసమా? అని పలువురు చర్చించుకుంటున్నారు. వీసీ నిర్ణయాలతో విద్యా ప్రమాణాలు దిగజారుతున్నాయి. విశ్వవిద్యాలయాల్లో చదు వుతున్న విద్యార్థులు నాణ్యమైన విద్య అందుకోలేకపో తున్నారు.

ఒక వక్తికి ఒక పోస్టు : భట్టు సత్యనారాయణ



ఓయూలో ఒక వ్యక్తికి ఒక పోస్టు ఇవ్వాలని ఓయూ టీచర్స్ అసోసి యేషన్ అధ్యక్షుడు భట్టు సత్యనారా యణ నవతెలంగాణతో చెప్పారు. బోధన కోసం నియమించుకున్న వారిని అడ్మినిస్ట్రేటివ్ పదవుల్లో నియమించడం వల్ల ప్రాథమిక విధులకు న్యాయం చేయడం లేదన్నారు. వృత్తికి న్యాయం చేయాలంటే ఒకరికి ఒక పోస్టే ఉండాలని సూచించారు. పదవుల్లో సామాజిక సమతుల్యత పాటించినప్పుడే వీసీపై గౌరవం పెరుగుతుందని చెప్పారు.

అనుభవజ్ఞుల సేవలను వినియోగించాలి : ప్రొఫెసర్ జగదీశ్వర్‌రావు



అడ్మినిస్ట్రేటివ్ పదవుల్లో అనుభవజ్ఞులు, అర్హత ఉన్న వారి సేవలను వినియోగించాలని ఓయూ ప్రొఫెసర్ వి జగదీశ్వర్‌రావు అన్నారు. బోధన, పరిశోధనలను విస్మరించి సచివాలయం చుట్టూ తిరుగుతూ పైరవీలు చేసి వీసీపై ఒత్తిడి పెంచి పదవులు పొందుతున్నారని చెప్పారు.

అనుభవం ఉన్న వారికి ఇస్తేనే అభివృద్ధి : మూర్తి



అనుభవం ఉన్న వారికి పదవులు ఇవ్వడంలో ప్రాధా న్యత ఇస్తేనే ఓయూ అభివృద్ధి అవుతుందని ఎస్ఎఫ్ఐ ఓయూ కార్యదర్శి మూర్తి అన్నారు. శతాబ్ది ఉత్సవాలు, సైన్స్ కాంగ్రెస్ ఉన్న దృష్ట్యా సామాజిక సమతుల్యం పాటించి అందరికీ పదవులివ్వాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీల్లో ఉపకులాలకు న్యాయం చేయాలని కోరారు. లేనిపక్షంలో ఉద్యమిస్తామన్నారు.

ప్రతిభ కొలమానం కావాలి : మానవతారాయ్




అడ్మినిస్ట్రేటివ్ పదవుల నియామకాలకు ప్రతిభ, అనుభవం కొలమానం కావాలని నిరుద్యోగ జేఏసీ నేత కోటూరి మానవతారాయ్ అన్నారు. పదవుల్లో ఒక సామాజిక వర్గానికి ప్రాధాన్యత ఇవ్వడం బాధాకరమని చెప్పారు. ఒక్కొక్కరికీ రెండు, మూడు పదవులు ఇవ్వడం సరికాదని, తక్షణమే ఒక పదవికి పరిమితం చేయాలని కోరారు. ఇతర సామాజిక వర్గాలకు ఆ పదవులను కట్టబెట్టాలని సూచించారు.

పక్షపాత వైఖరి సరికాదు : కడియం రాజు



అడ్మినిస్ట్రేటివ్ పదవుల నియామకంలో వీసీపక్షపాత వైఖరి అవలంబించడం సరికాదని ఏబీవీపీ జాతీ య నాయకుడు కడియం రాజు అన్నారు. పదవి ఇచ్చేటపుడు సా మాజిక నేపథ్యం, సీనియార్టీ, అకడమి క్ ఎక్స్‌లెన్సీ చూసి ఇవ్వాలని సూచించారు. కులం, మతం ఇతర పక్షపాత ధోరణితో పదవులు ఇవ్వకూడదని అన్నారు.

ఏ సామాజిక వర్గానికీ ప్రాధాన్యత ఇవ్వడం లేదు : రామచంద్రం, వీసీ



సామాజిక దృక్పథం ఆధారంగా ఎవరికీ అడ్మినిస్ట్రేటివ్ పోస్టులు ఇవ్వడం లేదని ఓయూ వీసీ ఎస్ రామచంద్రం నవతెలంగాణతో చెప్పారు. సీనియార్టీ, అర్హతలున్న వారికే పదవులు ఇస్తున్నామని అన్నారు. న్యాక్ బృందం పర్యటన తర్వాత అన్ని సామాజిక వర్గాల ప్రొఫెసర్ల సేవలనూ వినియోగించుకుంటామని చెప్పారు. అందరికీ పెద్దపీట వేస్తామన్నారు.

ఏడాది లోపే మూసేశారు

రాత్రికి రాత్రే బిచాణా ఎత్తేసిన డేటావిండ్ కంపెనీ

- రోడ్డున పడ్డ 300 మంది కార్మికులు
- బెడిసి కొట్టిన నయా పారిశ్రామిక విధానం



మూత పడిన కంపెనీ

నవతెలంగాణ-శంషాబాద్

రాష్ట్రంలో తీసుకొచ్చిన నయా పారిశ్రామిక విధానం కింద...శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో నవంబర్ 18న రాష్ట్ర మంత్రి కేటీఆర్ అట్టహాసంగా డేటా విండ్ ఇన్నోవేషన్స్ ప్రయివేట్ లిమిటెడ్ కంపెనీ ప్రారంభించారు. అందులో ఉద్యోగం రావటంతో 500 మంది కార్మికులు సంబరపడ్డారు. నవంబర్... డిసెంబర్... జనవరి... ఫిబ్రవరి...మార్చి...ఇలా కాలం గిర్రున తిరిగింది. నాలుగైదు నెలలు గడిచిందో లేదో వారానికి కొందరు ఉద్యోగులను కంపెనీ యాజమాన్యం పీకేయటం మొదలుపెట్టింది. ఇలా 200 మంది అకారణంగా తీసేసింది. ఎనిమిది నెలల్లోనే కంపెనీ మూసేసింది. రాత్రికి రాత్రే యాజమాన్యం బిచాణా ఎత్తేసింది. సీఎం నయా పారిశ్రామిక విధానం బెడిసికొట్టి...300 మంది కార్మికులు రోడ్డున పడ్డారు.



హైదరాబాద్‌లో గల శంషాబాద్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలో కెనడాలోని ఓంటారియోకు చెందిన డేటా విండ్ ఇన్నోవేషన్స్ ప్రయివేట్ లిమిటెడ్ కంపెనీకి పంజాబ్‌లోని అమృత్‌సర్‌లో ఓ బ్రాంచీ ఉంది. వంద కోట్ల పెట్టుబడితో హైదరాబాద్‌లో రెండో బ్రాంచిని నెలకొల్పింది. మొబైల్స్, ట్యాబ్‌లెట్లు తయారీ రంగంలో తమ ఉత్పత్తులను మరింత విస్తరించేందుకు కంపెనీ ఏర్పాటు చేసినట్టు యాజమాన్యం ప్రకటించింది. మొదటి సంవత్సరం 20 లక్షల యూనిట్ల ఉత్పత్తి, తర్వాత సంవత్సరానికి 50లక్షల యూనిట్ల ఉత్పత్తిని లక్ష్యంగా పెట్టుకున్నట్టు కంపెనీ యాజమాన్యం తెలిపింది. మొబైల్స్, ట్యాబ్‌లెట్స్ ఉత్పత్తితో పాటు కాల్‌సెంటర్ ఏర్పాటు చేశారు. మొదటి విడతగా ఐదు వందల మంది ఉద్యోగులను తీసుకున్నారు. మరో ఆరునెలల్లో ఉద్యోగాల సంఖ్య వెయ్యికి పెరుగుతుందని ఆ సందర్భంగా మంత్రి చెప్పారు. కానీ, వాస్తవానికి ఆ కంపెనీకి ఎలాంటి అనుమతి లేదు. లేబర్ కమిషన్‌లో రిజిస్టర్ కాలేదు. అమృత్‌సర్ నుంచే తమ కార్యకలాపాలను యాజమాన్యం నడిపింది.

నాలుగు నెలల తర్వాత నెమ్మదిగా ఒక్కో కార్మికున్ని తొలగించటం మొదలుపెట్టింది. అలా 200 మందిని తీసేసింది. తోటి కార్మికులకు జరుగుతున్న అన్యాయంపై కొందరు కార్మికులు లేబర్ కమిషన్‌కు వెళ్లారు. తీరా అక్కడికి పోతే కంపెనీ రిజిస్టర్ కూడా కాలేదు. తమకు న్యాయం చేయాలని కంపెనీ ఎదుట ధర్నా చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో జులై 13న లేబర్ కమిషన్‌లో కార్మికులు ఫిర్యాదు చేశారు. లేబర్ కమిషనర్ చంద్రశేఖర్ కనీసం ఇప్పటి వరకు కంపెనీ యాజమాన్యంతో మాట్లాడలేదు. ఉన్న ఫలానా జులై 25న కంపెనీ లాకౌట్ చేస్తున్నట్టు యాజమాన్యం ప్రకటించింది. రాత్రికి రాత్రే కొన్ని వస్తువులను యాజమాన్యం తరలించుకుపోయింది. దీంతో 300కి పైగా కార్మికులు ఒక్కసారిగా రోడ్డున పడ్డారు. వారంతా 20 నుంచి 35 సంవత్సరాల్లోపు వారే. ఆ కార్మికులు బతుకులు దయనీయంగా మారాయి. ఈ క్రమంలో కార్మికులు యంత్రాల తరలింపును అడ్డుకున్నారు. కంపెనీలు ఏర్పాటు చేస్తూ ఇతర దేశాలకు తలమానికంగా మారిందని ఊకదంపుడు ఉపన్యాసాలు చెప్పిన మంత్రి కేటీఆర్ డేటావిండ్ కంపెనీ మూత పడితే కనీసం ఆరా తీయలేదు. కంపెనీ మూత పడితే కార్మికులు వారి హక్కుల కోసం ఆందోళనలు చేయడం సహజం. కానీ, కంపెనీ ఎదుట ఆందోళనలు చేయొద్దంటూ పోలీసులను ఉసిగొల్పారు. ఇక్కడ లా అండ్ ఆర్డర్ సమస్యలు సృష్టిస్తే కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని బెదిరించారు. కంపెనీ మూసివేతకు గల కారణాలను మాత్రం యాజమాన్యం కార్మికులకు ఇంతవరకు తెలపలేదు. ఇలాగే గగన్ పహాడ్ పారిశ్రామికవాడలో సుమారు 25 ఏండ్ల నుంచి నడుస్తున్న పిలికాన్ రబ్బర్ కంపెనీ రెండు నెలల కింద లాకౌట్ చేసింది. దీంతో కంపెనీలో పనిచేస్తున్న సుమారు 250 కార్మికులు రోడ్డున పడ్డారు. సాతంరాయి పారిశ్రామిక వాడలోని సిల్క్ కంపెనీ మూత పడింది. అలాగే స్వస్తిక్ మిర్చి కంపెనీ మూసివేతకు రంగం సిద్ధమైంది.

యాజమాన్యంతో మంత్రి కేటీఆర్ కుమ్మక్కు



నూతన పారిశ్రామిక విధానంలో దూసుకు పోతున్నామని చెప్తున్న మాటలు వాస్తవ విరుద్ధం. పరిశ్రమల పేరుతో బోగస్ కంపెనీలకు వేలాది ఎకరాల భూములు అప్పగిస్తూ కమీషన్ల పర్వానికి తెరలేపారు. లేబర్ కమిషన్ కార్యాలయంలో రిజిస్టర్ కూడా చేయించుకోని డేటా విండ్ కంపెనీని మంత్రి ఎట్ల ప్రారంభించారు? ఇది దుర్మార్గం. కంపెనీ యాజమాన్యంతో మంత్రి కేటీఆర్ కుమ్మక్కైయ్యారు. ఉన్నట్టుండి కార్మికులను తొలగిస్తే వారికి అండగా నిలవాల్సిన లేబర్ కమిషన్ యాజమాన్యాలకు తొత్తుగా మారింది. డేటావిండ్‌లో పనిచేస్తున్న కార్మికులం దరికీ న్యాయం చేయాలనీ సీఐటీయూ ఆధ్వర్యంలో లేబర్ కమిషన్ ముందు ఆందోళన చేశాం. ఐటీ మంత్రి కేటీఆర్‌పై, డేటావిండ్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి. కార్మికులకు న్యాయం జరిగే వరకూ సీఐటీయూ అండగా ఉంటుంది.

భూపాల్, సీఐటీయూ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు

లేబర్ కమిషనర్‌కు మొరపెట్టుకున్నా న్యాయం జరగలేదు



మంచి ఉద్యోగం వచ్చిందని సంబరపడ్డాం. మంచి వేతనాలుంటయనుకున్నం. నెమ్మదిగా పనిచేసే కొద్దీ డేటా విండ్ యాజమాన్యం మమ్మల్ని మోసం చేసిందని అర్థమైంది. లేబర్ కమిషనర్‌కు మొరపెట్టుకున్నా లాభం జరగలేదు. రాష్ట్ర ప్రభుత్వం మాకు ఉద్యోగాలు కల్పించాలి.

- జి.వీరన్న కార్మికుడు

ఉద్యోగ భద్రత కల్పించాలి



కంపెనీ ఏర్పడి ఏడాది తిరగకముందే మూసేశారు. కార్మిక శాఖ పట్టించుకోవట్లేదు. మంత్రి కేటీఆర్ ఇటువైపు చూడట్లేదు ఇదెక్కడి న్యాయం? ఉన్నట్టుండి గెంటేస్తే ఎట్ల? ఏం చేయాలే? మాకు ఉద్యోగ భద్రత కల్పించాలి.

- గోపాల్, కార్మికుడు

యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి



కంపెనీ మూసివేతకు ఆరు నెలల నుంచే యాజమాన్యం కుట్రలు చేసింది. అకారణంగా వారానికి 20 మందికి పైగా కార్మికులను తీసివేస్తూ వచ్చింది. కంపెనీలోని వస్తువులను అర్ధరాత్రి దొంగచాటున తీసుకుపోయారు. తోటి కార్మికులతో కలిసి యంత్రాలను తరలించడాన్ని అడ్డుకున్నాం. లేబర్ కమిషనర్ వద్దకు వచ్చి న్యాయం చేస్తామని మేనేజ్‌మెంట్ చెప్పింది. ఇప్పటిదాకా న్యాయం జరగలేదు. కుట్రపూరితంగా కార్మికులను తొలగించిన యాజమాన్యంపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలి.

-నరేందర్ చారి, టెక్నీషియన్

న్యాయం చేయాలి



మల్టీనేషనల్ కంపెనీలో ఉద్యోగమని మురిసి పోయినం. బతుకులు బాగుపడుతాయని సంబరపడ్డాం. అంతా అడియాశైంది. ఉన్న ఫలాన కంపెనీ మూసేశారు. ప్రభుత్వం లేబర్ కమిషన్ జోక్యం చేసుకుని మూడు నెలల అడ్వాన్సు శాలరీ, ఇఎస్ఐ, పీఎఫ్ ఒకేసారి ఇవ్వాలి. కేవలం 45మందికి మాత్రమే న్యాయం చేశారు. మిగతా వారికి కూడా న్యాయం చేయాలి. అనుభవం సర్టిఫికెట్లు ఇవ్వాలి.

జి. సత్యనారాయణ, కార్మికుడు

విద్యుత్‌రంగ సమస్యలు పరిష్కరించండి

- ఆంధ్రా ఉద్యోగుల్ని కూర్చోబెట్టి వేతనాలు ఇవ్వడం సరికాదు: టీఎస్‌జెన్‌కో సీఎమ్‌డీతో కిషన్‌రెడ్డి భేటీ

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

విద్యుత్‌రంగ సమస్యల్ని తక్షణం పరిష్కరించాలని బీజేపీ శాసనసభాపక్షనేత జి కిషన్‌రెడ్డి కోరారు. శనివారంనాడాయన టీఎస్‌జెన్‌కో సీఎమ్‌డీ దేవులపల్లి ప్రభాకరరావుతో భేటీ అయ్యారు. వ్యవసాయదారులకు పంపుసెట్లపై విధిస్తున్న సర్‌ఛార్జీని రద్దు చేస్తామని గతంలో ప్రకటించారని, ఇప్పటి వరకు అమల్లోకి రాలేదని చెప్పారు. భద్రాద్రి, యాదాద్రి, కెటిపిఎస్ 7వ దశ, జయపూర్ 2వ దశ పవర్‌ప్లాంట్ల నిర్మాణాలను త్వరగా పూర్తిచేయాలని కోరారు. రాష్ట్రంలోని విద్యుత్ సంస్థల్లో 1170 మంది ఆంధ్రా స్థానికత ఉద్యోగుల్ని విధుల నుంచి రిలీవ్ చేసి, ప్రతినెలా రూ.20 కోట్లను వారికి వేతనాలుగా చెల్లిస్తున్నారని, ఈ విధంగా రెండేండ్లలో రూ.500 కోట్ల ప్రజాధనం దుర్వినియోగం అయ్యిందని చెప్పారు. వారి సేవల్ని వినియోగించుకోవాలని లేకుంటే వారిని ఆంధ్రప్రదేశ్‌కు పంపాలని విజ్ఞప్తి చేశారు. కెటిపిఎస్5, 6 యూనిట్లలోని ఓ అండ్ ఎమ్ కార్మికులకు ఇప్పటి వరకు ఎలాంటి పదోన్నతులు ఇవ్వలేదని, వారికి ఫోర్‌మెన్ గ్రేడ్-1 పోస్టుల్ని ఇవ్వాలని డిమాండ్ చేశారు. డిప్లొమా విద్యార్హత ఉన్నవారికి సబ్‌ఇంజనీర్స్‌గా పదోన్నతులు ఇవ్వాలని కోరారు. విద్యుత్‌సంస్థల్లో పనిచేస్తున్న 24వేల మంది కాంట్రాక్ట్ కార్మికుల్లో 20,903 మందికి పర్మినెంట్ ఉద్యోగులతో సమానంగా వేతనాలు, సౌకర్యాలు కల్పిస్తామని సీఎం కేసీఆర్ వెల్లడించారని, అయితే జెన్‌కో నిర్మాణదశ మరియు ఓ అండ్ ఎమ్ విభాగాల్లో పనిచేస్తున్న నాన్ ఇయర్లీ మెయింటెనెన్స్‌లో పనిచేస్తున్న 4వేల మంది ఉద్యోగులకు కూడా సీఎం హామీ ఇచ్చిన మేరకు సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

ఎయిర్‌పోర్టులో ఎక్స్‌ప్రెస్ సెక్యూరిటీ చెకింగ్

- ప్రారంభించిన సీఐఎస్ఎఫ్ డైరెక్టర్ జనరల్ ఒపి సింగ్



నవతెలంగాణ శంషాబాద్

ప్రయాణికుల సమయం వృథా కాకుండా వారి బ్యాగులను క్షుణ్ణంగా తనిఖీ చేసే సులువైన పద్ధతిని శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ప్రవేశపెట్టారు. హైదరాబాద్‌లోని రాజీవ్‌గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టులోని డొమెస్టిక్ డిపార్చర్‌లో ఫస్ట్ ఎక్స్‌ప్రెస్ సెక్యూరిటీ చెక్ ఫెసిలిటిని ఎయిర్‌పోర్టు సీఈఓ కిషోర్‌తో కలిసి సీఐఎస్ఎఫ్ డైరెక్టర్ జనరల్ ఓపీ సింగ్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఓపీ సింగ్ మాట్లాడుతూ.. ప్రయాణికుల రక్షణ విషయంలో సీఐఎస్ఎఫ్ రాజీపడబోదని స్పష్టం చేశారు. 'ప్యాసింజర్ ఇస్ ప్రైమ్'లో సీఐఎస్ఎఫ్ భాగస్వామిగా ఉంటుందని తెలిపారు. మారుతున్న కాలానికి అనుణంగా సాంకేతికతను వాడుతూ ప్రయాణికులకు మెరుగైన సేవలను అందిస్తున్నామన్నారు. పది సెల్ఫ్ చెక్ ఇన్ మిషన్లు ప్రవేశపెట్టామని చెప్పారు. ఎయిర్‌పోర్టు సీఈఓ కిషోర్ మాట్లాడుతూ ప్రయాణికుల వద్ద బ్యాగులను చెక్ చేసే పద్ధతి బదులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ద్వారా ప్రత్యేక మిషన్లతో లగేజి చెక్‌ఇన్ ఉంటుందని, ఇది దేశంలోని అంతర్జాతీయ విమానాశ్రాయాల్లో కంటే ముందే ఇక్కడ ప్రారంభించామని చెప్పారు. హైదరాబాద్ ఎయిర్‌పోర్టు ప్రయాణికుల భద్రత, సౌకర్యం కోసం అధిక ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు.

ఉద్యాన విద్యార్థుల సమ్మె విరమణ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

33రోజులుగా సమ్మె చేస్తున్న ఉద్యాన విద్యార్థుల సమ్మె శనివారం ఉపసంహరించుకున్నారు. ఉద్యాన అధికారి, ఉద్యాన విస్తరణ అధికారుల పోస్టులు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ రాజేం ద్రనగర్‌లోని శ్రీకొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవి ద్యాలయంలో సమ్మెకు దిగిన విషయం విదితమే. సమ్మె ఉపసం హరించుకుంటున్నట్టు వర్సిటీ ఉప కులపతికి విద్యార్థులు లిఖిత పూర్వ వంగా ఇచ్చారు. విద్యార్థుల డిమాండ్లను పరిశీలించి ప్రభుత్వం, ఉద్యాన, వ్యవసాయ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి, వర్సిటీ ఉపకులపతి, వ్యవ సాయ శాఖ ముఖ్య కార్యదర్శి సి. పార్థసారథి సానుకూలంగా స్పందించ డంతో సమ్మె విరమిస్తున్నట్టు విద్యార్థులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

సమగ్రంగా అధ్యయనం చేసేవారు

- బోడెపూడి 20వ వర్ధంతి సభలో వక్తలు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రజలు ఎదుర్కొనే సమస్యలను పరిష్కరించేందుకు బోడెపూడి వెంకటేశ్వరరావు సమగ్రంగా అధ్యయనం చేసేవారని పలువురు వక్తలు కొనియాడారు. తెలంగాణ రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో శనివారం బోడెపూడి వెంకటేశ్వరరావు 20 వర్ధంతి సభను రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించారు. ఈ సభకు తెలంగాణ రైతు సంఘం కార్యదర్శి టి. సాగర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా అఖిల భారత కిసాన్ సభ ఉపాధ్యక్షులు సారంపల్లి మల్లారెడ్డి, రైతు సంఘం ఉపాధ్యక్షులు నంద్యాల నర్సింహ్మారెడ్డి మాట్లాడారు. బోడెపూడి చేసిన విజ్ఞప్తులను ముఖ్యమంత్రి నుంచి మొదలుకొని కింది స్థాయి అధికారి వరకు పరిష్కరించేందుకు కృషి చేసేవారని గుర్తు చేశారు. రైతు, వ్యవసాయ కార్మిక పోరాటాల్లో ప్రత్యక్షంగా పాల్గొన్నారని చెప్పారు. ఎంత పెద్ద కష్టం వచ్చినా అధైర్యపడేవారు కాదని, కార్యకర్తలకు ఉత్సాహం నింపే విధంగా ప్రయత్నించేవారని అన్నారు. కరువు ప్రాంతాలను విముక్తి చేసేందుకు రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టుల అవశ్యకతను గుర్తించి, నిరంతరం వాటిని పర్యవేక్షిస్తూ పూర్తి చేసేందుకు ప్రయత్నించేవారన్నారు. ఈ సభలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పి. జంగారెడ్డి, ఉపాధ్యక్షులు బొంతల చంద్రారెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు బి.ప్రసాద్, రైతు నాయకులు సంజీవరెడ్డి, ఎండి. జబ్బార్, బండి దత్తాత్రి, ఆర్. ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామసీమల్ని ఒడిసిపడదాం...

రైతాంగ సమస్యలపై మరింత అధ్యయనం: బోడెపూడి వర్ధంతి సభలో రాఘవులు

- ప్రజా సంబంధాలే కీలకం : తమ్మినేని



బోడెపూడి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రాఘవులు,తమ్మినేని, బి.వెంకట్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కమ్యూనిస్టు పార్టీ నాయకులు, కార్యకర్తలుగా గ్రామసీమల్లోని సమస్యలను ఒడిసిపట్టాలని సీపీఐ (ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు సూచించారు. వచ్చే ఏడాది పార్టీ అఖిల భారత మహాసభలు, రాష్ట్ర మహాసభలు జరగనున్న నేపథ్యంలో రైతులు, వ్యవసాయ కార్మికుల సమస్యలపై మరింత లోతైన అధ్యయనం చేయాలని కోరారు. తద్వారా వాటి పరిష్కారానికి పోరాటాల రూపకల్పన చేయాలని పిలుపునిచ్చారు.

ప్రముఖ రైతు నాయకులు, సీపీఐ (ఎం) శాసనసభాపక్షం మాజీ నేత బోడెపూడి వెంకటేశ్వరరావు 20వ వర్ధంతి సభ శనివారం హైదరాబాద్‌లోని ఎంబీ భవన్‌లో జరిగింది. పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.వెంకట్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాఘవులుతోపాటు పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, కేంద్ర కమిటీ సభ్యులు ఎస్.వీరయ్య తదితరులు బోడెపూడి చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు.

రాఘవులు మాట్లాడుతూ... ప్రజా నాయకుడిగాను, ప్రజా ప్రతినిధిగానూ బోడెపూడి రాష్ట్రానికి విశేష సేవలందించారని చెప్పారు. రైతు సమస్యలనేవి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట సమయంలో ఒక విధంగాను, స్వాతంత్ర్య అనంతరకాలంలో మరో విధంగాను, సరళీకృత విధానాల తర్వాత ఇంకో విధంగానూ రూపాంతరం చెందాయని తెలిపారు. అయితే బోడెపూడిలాంటి నాయకులు సందర్భానికి తగ్గట్టుగా రైతులు, వ్యవసాయ కార్మికులను సంఘటితపరిచి ఉద్యమాలకు రూపకల్పన చేశారని చెప్పారు. ఆయన జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకుని ఇప్పటి నాయకులు గ్రామ సీమల్లో నెలకొన్న వివిధ సమస్యలపై సమగ్ర అధ్యయనం చేయాలని సూచించారు.

సీపీఐ (ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ... కమ్యూనిస్టు అనేవాడికి ప్రజలతో సంబంధాలే కీలకమని చెప్పారు. అది లేనప్పుడు పదవులు, వివిధ స్థాయిల్లో ఉన్నా అతడు యాంత్రికంగా తయారవుతాడని అన్నారు. బోడెపూడిలాంటి నాయకులు ఇంట్లోను, ఆఫీసులోనూ ఉండటంకంటే ప్రజలతోనే ఎక్కువ సమయం గడిపేవారని గుర్తుచేశారు. అందుకే బోడెపూడి, మంచికంటిలాంటి నాయకులు ప్రజా నాయకులయ్యారని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు నంద్యాల నర్సింహారెడ్డి, టి.జ్యోతి కూడా ప్రసంగించారు.

మీరివ్వకుంటే మేమిస్తాం

రాజకీయ జన్మనిచ్చిన జిల్లాను విస్మరించిన కేసీఆర్

- గ్రామ గ్రామాన రిలే దీక్షలు చేపట్టాలి: కాంగ్రెస్ శాసనసభాపక్ష నేత జానారెడ్డి
- మెడికల్ కాలేజీ కోసం పొన్నం దీక్ష


దీక్షలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-కరీంనగర్ టౌన్

ఈ ఆమరణ దీక్షతోనైనా ప్రభుత్వానికి కనువిప్పు కలగకుంటే రాబోయే రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వమే మెడికల్ కళాశాలను ఏర్పాటు చేస్తుందని ఆ పార్టీ శాసన సభాపక్ష నేత జానారెడ్డి హామీఇచ్చారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని మంకమ్మతోటలోని తన నివాసం ఎదుట మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ ఆమరణ నిరాహార దీక్ష శనివారం ఉదయం ప్రారంభించారు. ఆయనకు జానారెడ్డి సంఘీభావం తెలిపి మాట్లాడారు. ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడం, సమస్యల పరిష్కరించడంలో కేసీఆర్ విఫలమవుతున్నారని ఆరోపించారు. ఈ దీక్షతో మెడికల్ కళాశాల మంజూరు చేస్తుందని తాను భావించడం లేదన్నారు. జిల్లాలోని అన్ని గ్రామాల్లో రిలే దీక్షలు చేపట్టి ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని కోరారు. మూడుమార్లు ఇక్కడి ప్రజలు ఆదరించి రాజకీయ జన్మనిచ్చిన కేసీఆర్ ఈ ప్రాంతాన్ని విస్మరించడం శోచనీయమన్నారు. సిద్దిపేట జిల్లా కంటే ముందే ఈ ప్రాంతంలో మెడికల్ కళాశాల ఏర్పాటు చేయాల్సిన అవసరాన్ని గుర్తు చేశారు. తెలంగాణ ఏర్పాటు ఒక్కరితో సాధ్యం కాదన్న కేసీ ఆర్ తన ఇంటికి వచ్చి జేఏసీలో కలసిరావాలని బతిమాలిన విషయం గుర్తుచేశారు. ఆ తర్వాత పోరాటం ఉధృతమై ప్రత్యేక రాష్ట్రం సాధించుకున్నామన్నారు. తెలంగాణ ఉద్యమంలోనూ ఇంత అణిచివేతకు ప్రజలు గురి కాలేదని ఆందోళన వ్యక్తం చేశారు. డబుల్ బెడ్ రూం ఇండ్లు, మూడెకరాల సాగు భూమి..ఇలా అనేక వాగ్దానాలు చేసిన కేసీఆర్ అమలులో ఎలా ఉందో ప్రజలే గమనిస్తున్నారని అన్నారు.

సిద్దిపేటలో సాధ్యం..ఇక్కడ అసాధ్యమా..?

సిద్దిపేటలో ప్రయివేటు, ప్రభుత్వ మెడికల్ కళాశాల ఎలా సాధ్యమవుతుందని శాసనసభాపక్ష ఉప నేత టి. జీవన్‌రెడ్డి, రాష్ట్ర మంత్రి ఈటల రాజేందర్‌ను ప్రశ్నించారు. ఆ ప్రాంతంలో ప్రయివేటు మెడికల్ కళాశాలలో వాటాలు పొంది లాభాలు గడిస్తున్నారని ఆరోపించారు. పదవులు శాశ్వతం కాదని, ప్రభుత్వ మెడికల్ కళాశాల ఏర్పాటు చేసి ప్రజల రుణం తీర్చుకోవాలని ఈటలకు సూచించారు.

దీక్ష భగ్నానికి పోలీసుల యత్నం..

మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ ఆమరణ దీక్ష భగ్నానికి పోలీసులు రెండుమార్లు యత్నించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోందని ఉదయం ట్రాఫిక్ సీఐ ఆధ్వర్యంలో దీక్ష భగ్నానికి పూనుకోగా కార్యకర్తలు అడ్డుకున్నారు. అనంతరం టూటౌన్ సీఐ మహేశ్ గౌడ్ చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. దీక్షకు మద్దతుగా డీసీసీ అధ్యక్షులు కటకం మృత్యుంజయం, రాష్ట్ర నాయకులు బొమ్మ వెంకన్న, సుద్దాల దేవయ్య, కోడూరి సత్యనారాయణ గౌడ్, ఆరెపల్లి మోహన్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ప్రవీణ్‌రెడ్డి, లక్ష్మినర్సింహారావు ఉన్నారు. దీక్షకు బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి బండి సంజయ్ మద్దతు ప్రకటించారు.

పేదల దుకాణాలు కూల్చివేత

అడ్డుకున్న సీపీఐ(ఎం) నాయకుల అరెస్టు



నవతెలంగాణ-ఖమ్మంప్రతినిధి

ఏండ్ల తరబడి ఖమ్మం వన్‌టౌన్ ప్రాంతంలో చిన్నచిన్న దుకాణాలు నిర్మించుకుని జీవనం సాగిస్తున్న చిరుకార్మికుల దుకాణాలను శనివారం మున్సిపాల్టీ అధికారులు కూల్చేశారు. తాము అనేక ఏండ్లుగా ఇక్కడే చెప్పులు, బ్యాగులు, పాత సంచులు కుట్టుకుంటూ జీవనం సాగిస్తున్నామని మొత్తుకుంటున్నా వినకుండా ఆక్రమణలో ఉన్నాయంటూ ఖమ్మం మున్సిపల్ అధికారులు జేసీబీతో కూల్చేశారు. ఇదేం న్యాయమని సీపీఐ(ఎం) కార్పొరేటర్ సమీనా అఫ్రోజ్, నాయకులు ఎంఏ ఖయ్యూం, మైనారిటీ నాయకులు జహీర్‌అలీలు ప్రశ్నించగా పోలీసులు వారిని అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. అనంతరం దుకాణాలను జేసీబీతో ధ్వంసం చేసి వెళ్లారు. ఇదే క్రమంలో ప్రయివేటు స్థలంలో నిర్మించిన మసీదుకు చెందిన ప్రహరీ కూడా ధ్వంసమవడంతో ముస్లిం మతపెద్దలు నిరసనకు దిగారు. కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది.ఖమ్మం పట్టణంలోని వన్‌టౌన్ ప్రాంతంలో సుమారు 70 ఏండ్లుగా చిరు దుకాణాలు నిర్మించుకుని కార్మికులు కుటుంబాలను పోషించుకుంటున్నారు. కాగా ఈ దుకాణాలు ప్రభుత్వ స్థలంలో ఉన్నాయని కొందరు రాజకీయ, అధికార పార్టీ నాయకులు అధికారులపై ఒత్తిడి తెచ్చినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ కారణంగానే దుకాణాల కూల్చివేతకు నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. ఏండ్లుగా ఇక్కడే వ్యాపారాలు చేసుకుంటున్నామని, అన్ని అధారాలున్నాయని చెప్పినా వినకుండా మార్కింగ్ చేశారు. జేసీబీతో దుకాణాలు కూల్చేందుకు సిద్ధం కాగా విషయం తెలుసుకున్న సీపీఐ(ఎం) నేతలు సమీనా అఫ్రోజ్, ఖయ్యూం, మైనారిటీ నాయకులు జహీర్‌అలీ వచ్చి అడ్డుకున్నారు. దీంతో పోలీసులు వారిని దౌర్జన్యంగా అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ముగ్గురు సీఐలు, ఎస్సైలు, భారీగా పోలీసులు మొహరించి దుకాణాలు కూల్చేశారు.

ఇది దుర్మార్గమైన చర్య.: సమీనా అఫ్రోజ్, కార్పొరేటర్, సీపీఐ(ఎం)

అనేక ఏండ్లుగా ఇక్కడ దుకాణాలు ఏర్పాటు చేసుకుని పొట్టపోసుకుంటున్న చిన్న వ్యాపారులపై కక్షగట్టి రాజకీయ నాయకులు అధికార దర్పంతో దుకాణాలు కూల్చివేయించారు. అధికారులు సైతం వారికి తొత్తులుగా మారారు. దుకాణాలు కూల్చి చిరు వ్యాపారులను రోడ్డున పడేశారు. బాధితులకు న్యాయం జరిగేంత వరకూ పోరాడుతాం.

సంపాదకీయం

అందాల బంధాలు

సోదర బంధం, స్నేహబంధం రెండూ గొప్పవే. రెండూ జీవితానికి అవసరమే. బతుకుని పరిమళింపజేసే అందాల బంధాలే. పాపం, పుణ్యం తెలియని లేలేత ప్రాయం చిందే బాల్యంలోనే కాదు, పెరిగి పెద్దయ్యే క్రమంలోనూ నిలిచి వున్నప్పుడే ఆ బంధాలకు సార్ధకత. డబ్బు చొరబడనంతవరకు, అవసరాల కోసం ఆధారపడే స్థితి రానంతవరకు ఈ బంధాలు వాటికవే అందమూ, అలంకారమూ. చెప్పా పెట్టకుండా అన్న ఇంటికో, అక్క ఇంటికో వెళ్ళి అన్నం పెట్టమని అడగ్గలిగే మమతలుంటే అదే గొప్ప అనురాగ బంధం. అర్ధరాత్రి అపరాత్రి అనకుండా ఎవరి ఇంటికయితే వెళ్ళి తలుపు కొట్టగలవో అతనే నీకు నిజమైన స్నేహితుడు. ఏ ఇద్దరి నడుమయితే అలా చొరవగా వెళ్ళగల సాన్నిహిత్యముందో వారే సిసలైన స్నేహితులు. స్నేహమంటే ఇలా ఉండాలనే కొన్నేళ్ళ కిందటి ఊహల విహాయాసాల వైనమిది.

అన్నీ బాగున్న వేళ అందరూ కబుర్లు ఒలకబోసేవారే. కానీ ఎక్కడో, ఎప్పుడో ఏమరుపాటున ఓ మెట్టు జారినప్పుడో, ఉన్న స్థితి నించి కొంచెం పక్కకు జరిగినప్పుడో పలకరించేవారే నిజమైన ఆప్తులు. అసలైన ఆత్మీయులు. కాలం తాకిడికి నిలబడే స్నేహితులు. ఇలా ఒక్కరయినా మిగిలితే అదే జీవితానికి ధన్యత.

స్నేహం ఒక్కరోజు కలాపం కాదని, జీవితాంతం పరిఢవిల్లే బంధమని గొప్పగా చెప్పుకునే రోజులు మన దేశంలోనూ గతించాయి. అందుకే ఫ్రెండ్‌షిప్ డే ఇక్కడికి చొరబడింది. ఈ చొరబాటు మన బతుకుల్లోని డొల్లతనాన్ని చెప్పకనే చెబుతోంది. ఫేస్‌బుక్‌లో వందలమంది ఫ్రెండ్స్ లిస్ట్ ఉన్నప్పటికీ, దిగులు పడ్డ క్షణం, అర్ధరాత్రి నిదురలో కలవరపడ్డ నిమిషం మాట్లాడటానికి మనిషి దొరకడు. లోలోపల కదిపి కుదిపే బాధను చెప్పుకోడానికి ఆప్తులొకరు కనిపించరు. అన్నీ బాగున్న వేళ అందరూ కబుర్లు ఒలకబోసేవారే. కానీ ఎక్కడో, ఎప్పుడో ఏమరుపాటున ఓ మెట్టు జారినప్పుడో, ఉన్న స్థితి నించి కొంచెం పక్కకు జరిగినప్పుడో పలకరించేవారే నిజమైన ఆప్తులు. అసలైన ఆత్మీయులు. కాలం తాకిడికి నిలబడే స్నేహితులు. ఇలా ఒక్కరయినా మిగిలితే అదే జీవితానికి ధన్యత.



మనిషికేం కావాలి కాసింత దయ, ప్రేమ అంటారు ప్రముఖ రచయిత బుచ్చిబాబు. ఆ దయ, ప్రేమ చూపగలిగిన ఒక్కరయిన లేకపోవడమే బతుకును ఆవరించిన ఎడారితనం. చదువులతో, హోదాలతో, సంపాదనతో సంబంధం లేకుండా స్నేహించే స్వభావం ఎక్కడ? ఎవరి జీవితంలో వాళ్ళు బందీలుగా మారి పక్కవారిని పలకరించే తీరిక లేనంతగా కాలాన్ని దొర్లించడం విషాదం. ఇక స్నేహానికీ, ప్రేమకీ, దయకీ తావెక్కడ? ఏ కారణమూ, ఏ అక్కరా లేకుండా అక్కాచెల్లెళ్ళనూ, అన్నదమ్ములనూ కలుసుకోడమే అరుదయింది. ఎలాంటి ఎజెండా లేకుండా మిత్రులను పలకరించడమూ, కలవడమూ మాయమైంది.

మానవీయ బంధాల్ని ఇంతటి హీనస్థితిలోకి నెట్టివేసిన అవసరాల, అనవసర స్వార్థాల, అత్యాశల విలాసాలదే ఈ తప్పిదం. మనిషిని ముట్టడించిన మార్కెట్ బేహారుల కుటిల వ్యూహాలే ఈ దుర్మార్గాలకి మూలం. కొన్నిచోట్ల గుంపులు గుంపులుగా కనిపిస్తారు. ఏ పెళ్ళిలోనో, మరేదో ఫంక్షన్‌లోనో ఒక్కసారిగా కూడినట్టే ఉంటారు. కానీ ఆ కలయికల వెనుక లెక్కలుంటాయి. వాటి ప్రాతిపదికనే స్నేహబృందాలు ఒక్కచోట కూడుతాయి. ఇలాంటి సన్నివేశాల్లో స్నేహం అనే మాట అష్టవంకర్లు పోతుంది. తన అర్థాన్నీ, సారాన్నీ కోల్పోయి విషాదస్మృతిగా మిగులుతుంది. ఇలా మిగిలిన స్మృతుల పలవరింతే స్నేహం. జీవితం పొడుగునా తన ప్రయాణాన్ని తను తరచి చూసుకుంటే ఒక్కరంటే ఒక్కరు లేకపోవడం ఎంతటి పెను విషాదం! పేదరికం, ఆకలి కన్నా భయంకరంగా మానవాళిని వెంటాడే బీభత్స దృశ్యం!

సోదరబంధం గురించీ అందమైన కథలూ పాటలూ ఎన్నెన్నో. అమ్మానాన్నల తర్వాత సోదరీ సోదరుల బంధం అత్యంత రమణీయమైంది. గాఢమైంది. గంపెడు పిల్లలుండే కుటుంబాల కాలం కాదిది. కాలం గడుస్తున్న కొద్దీ కుటుంబాలు చిన్నవయ్యాయి. ఇద్దరు లేక ముగ్గురి నుంచి మేమిద్దరం మాకిద్దరు అనే స్థితి వచ్చింది. ఆడిపాడే వయసులో అన్నాచెల్లెళ్ళ, అక్కా తమ్ముళ్ళ ఆప్యాయతలు చెప్పనలవి కాదు. ఎవరి జీవితాల్లో వాళ్ళు స్థిరపడ్డాక కొలతలు మొదలవుతాయి. ఎవరు ఏ స్థాయిలో సంపాదించారన్నదే బంధాలకు ప్రాతిపదికవుతుంది. అనురాగాలకు వడ్డీల లెక్కలు చుట్టుకుంటాయి. ఆసరాగా ఉండాల్సివస్తే ఆమడదూరానికి విసిరికొడతాయి. ఎక్కడికక్కడ డబ్బుసర్పాలు కనిపించకనే బుస కొడుతుంటాయి. వీటి మధ్య కునారిల్లే అనురాగబంధం గాలిలో దీపంలా కొట్టుకులాడుతుంటుంది.

రక్తసంబంధాలు సైతం ఇంతటి విపత్తుకు లోను కావడం ఒక్కరోజునే తటస్థించిన పరిణామం కాదు. మనుషుల్లోని మమతల్ని, మానవీయ బంధాల్ని విచ్ఛిన్నం చేస్తున్న పరిణామాల మూలాలు ప్రపంచీకరణలో ఉన్నాయని కవులు కవిత్వీకరిస్తారు. నిజమే, కానీ అంతకుముందుగానే పక్కవాడి నెత్తిగొట్టి పైకెగబాకాలన్న ఆర్థికనీతికి ఆమోదం లభించడంలోనే అసలు దోషం ఇమిడివుంది. ప్రపంచీకరణ ముసుగున విస్తరించిన మార్కెట్ గుత్తాధిపత్యం సర్వరంగాలనే కాదు, సకల మానవీయ పార్శ్వాల్ని క్రూరమైన వ్యాపారంగా మార్చివేసింది. దీని తాకిడికి సోదర బంధాలే కకావికలమయ్యాయి. స్నేహబంధాలు కొనప్రాణంతో కొట్టుమిట్టాడుతున్నాయి. వీటిని పున:ప్రతిష్ఠ చేయాలంటే మనిషి సాటి మనిషిని బతకనిచ్చే ఔదార్యాన్ని సంతరించుకోవాలి. మార్కెట్ వ్యూహాల్ని తలదన్నే చైతన్యాన్ని పాదుకొల్పాలి. సాటివారిని మనుషులుగా చూడగల కరుణాంతరంగాన్ని సృజించాలి. ఈ దిశగా మనం వేసే అడుగులే అనురాగ బంధాలకు బాసట.



కోప్ర

తెగబడే గుణమే తెలంగాణ బలం

ఈ మట్టికే ఆ మనస్తత్వముంది. ఈ గడ్డకే ఆ గుండె ధైర్యముంది. గుప్పెడు మెతుకుల కోసమే కాదు, పిడికెడు న్యాయం కోసమూ వెట్టికి వ్యతిరేకంగా పోరాడిన నేలకదా ఇది. దేశ్‌ముఖ్‌ల దౌర్జన్యాలను ఎదిరించటంలో, సాటి మనిషిని ఆదరించడంలో, ఆదుకోవడంలో, తోటి మనిషికి జరిగిన అన్యాయాన్ని అడ్డుకోవడంలో ఆదర్శంగా నిలిచిన నేలకదా ఇది. కాబట్టి జులై నాల్గవ తేదీ రాత్రి నేరెళ్ల గ్రామ పరిసరాల్లో రోడ్డు పక్కన నిలుచున్న బదనపురం భూమయ్య (55) అనే గిరిజన ఎరుకల కులస్తుడిని అన్యాయంగా గుద్ది చంపిన ఇసుక మాఫియాపై నేరెళ్ల ఊరిజనం అగ్గి మండింది. శ్రమలేని డబ్బులో దౌర్జన్యముంటుంది. పెట్టుబడి లేని ఆదాయంలో అరాచకముంటుంది. ఆ దౌర్జన్యానికీ, ఆ అరాచకానికీ అధికారపు అండ ఉంటుంది. కాబట్టి ప్రకృతి సంపద పెట్టుబడిలేని ఆదాయంగా మారిన సిరిసిల్ల ప్రాంతంలో ఇసుకరేణువు సైతం విషపు గుళికై బడుగుజనం ప్రాణాలను తీస్తోంది.

రోగ లక్షణం డాక్టరు కన్నా ముందుగా రోగికే తెలుస్తుంది. రోగిగా మారిన అధినాయకత్వం తన రోగ లక్షణాలను ఇప్పుడు పసిగట్టింది. పైకి మాత్రం తనది సంపూర్ణ ఆరోగ్యమని నిర్రనీల్గుతోంది. అయినా శరీరంలో జీర్ణించుకుపోయిన రోగ లక్షణాలు నోటి ద్వారా వీధిన పడుతున్నాయి. అధినేతను అభాసుపాలు చేస్తున్నాయి. ఈ రోగం స్వయంకృతాపరాధం. మందు కూడా అధినేత చేతుల్లోనే పదిలం. ఆ స్వయంకృతం రోగాన్ని నయం చేసుకుని నాలుగు కాలాలపాటు నిలు స్తారో, లేదా కాల గర్భంలో కలుస్తారో ఇక వారి యిష్టం.

స్వయానా ముఖ్యమంత్రి తనయుడూ రాష్ట్ర మంత్రి కూడా అయిన సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ అండదండలతో ఆ ప్రాంతంలో ఇసుక మాఫిమా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నది. అధికారం అండచూసుకుని అనధికారికంగా, అతివేగంతో దాదాపు 1500 లారీలు నిత్యం ఇసుకను ఆ ప్రాంతం నుండి తోడేసి అక్కడి నుంచి రవాణా చేస్తూ ప్రజలకు నరకం చూపిస్తున్నాయి. ఇసుక రేణువులు ఇండ్లలోకి, కండ్లలోకి ఈటెల్లా దూసుకువస్తూ ప్రజలను తీవ్ర అనారోగ్యంపాలు చేస్తున్నాయి. మరోవైపు మితిమీరిన వేగంతో నడిచే లారీలు ఇప్పటికే దాదాపు 65మందిని గాయపరిచాయి. దీంతో చైతన్యవంతమైన ఆ ప్రాంతం ప్రజలలో ఇసుక మాఫియాపై ఆగ్రహం గూడుకట్టుకుని ఉంది. అది ఎప్పుడైనా బద్దలయ్యే స్థితిలో ఉన్న నేపథ్యంలో భూమయ్యను ఇసుకలారీ దుర్మార్గంగా బలిగొనడాన్ని జనం జీర్ణించుకోలేక పోయారు. ఆగ్రహం కట్టలు తెంచుకున్న జనం ఆ రాత్రి కొన్ని లారీలను తగుల బెట్టారు.

అంతే... రాజ్యం కన్నెర్ర జేసింది. తక్షణం ఖాకీ గణం రంగంలోకి దిగింది. నాల్గవతేదీ నడిరాత్రి నేరెళ్ల గ్రామం మీద పడి పెంట బానయ్య, కోల హరీశ్, చెప్యాల బాలరాజు, పసుల ఈశ్వర కుమార్, గంధం గోపాల్, బత్తుల మహేశ్‌ను పట్టుకెళ్లిపోయారు పోలీసులు. మూడురోజుల పాటు వారెక్కడున్నారో ఎవరికీ తెలియదు. తమవారి జాడకోసం కనిపించిన పోలీసునల్లా కాళ్ళావేళ్లాపడిన బంధువులకు బెదిరింపులే మిగిలాయి. 'మీ వారి మీద గంజాయి స్మగ్లింగ్ కేసులు పెడతాం. మీ మీద వ్యభిచార నేరం మోపుతాం' అని పోలీసు ఉన్నతాధికారులే బెదిరించారు. మూడు రోజుల పాటు తీవ్రాతి తీవ్రంగా హింసించి విషయం బైటకు పొక్కడంతో గతిలేని స్థితిలో ఏడవ తేదీ కోర్టుకు హాజరు పరిచారు. ఆ మూడు రోజులూ బాధితులకు స్వయానా జిల్లా ఎస్పీ విశ్వజిత్ కాంపాటి సారథ్యంలోనే నరకం చూపించారు. కరెంట్ షాక్ ఇచ్చారు, రోకలి బండలు ఎక్కించారు, కర్రలు విరిగేలా కొట్టారు... ఒక్కమాటలో చెప్పాలంటే పోలీసు చిత్రహింసలన్నీ చవిచూపించారు. "నా జీవితంలో పోలీసు దెబ్బలు తిన్న ఎంతోమందిని చూశాను. వారిని పరిశీలించాను. ఇంత పాశవికంగా, దుర్మార్గంగా పోలీసులు కొట్టిన వారిని మాత్రం చూడలేదు" అని హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ అన్నారంటే పరిస్థితి ఎంత ఘోరంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. బాధితుల వొంటిమీది గాయాలను చూసి భీతిల్లిపోయిన కరీంనగర్ జైలు అధికారి వారిని జైలు లోపలికి అనుమతించేందుకు 8వ తేదీ అంగీకరించలేదు. తిరిగి వారిని స్టేషనుకు తీసుకు వచ్చిన పోలీసులు డాక్టర్ చేత వారి ఆరోగ్యాలు బాగానే ఉన్నాయని సర్టిఫికెట్ తీసుకుని సమర్పిస్తే తప్ప జైలు ప్రవేశం దొరకలేదు.

నిజానికి లారీల దగ్ధం వ్యవహారంలో బాధితులపై ఎవ్వరూ ఫిర్యాదు చేయలేదు. 'నేరస్తులు ఫలానా వారు... అరెస్టు చేయండీ...' అని బాధితులు ఫిర్యాదు చేసిన హత్య కేసుల్లో సైతం నేరస్తులను అరెస్టు చేసేందుకు ముందుకు రాని ఈ పోలీసులు.. ఇక్కడ కేవలం లారీలు దగ్ధమైన సంఘటనలో తమకై తాము ఎందుకంతగా ప్రతిస్పందించారు? పశువుల్లా ప్రవర్తించారు?... ఇందులోనే రాజ్య స్వభావం ఇమిడి ఉంది. ప్రజలను రక్షించాల్సిన రాజ్యం (పాలకులు) ఆ ప్రజలనుంచే తాను రక్షణ పొందాల్సిన దుస్థితికి దిగజారినప్పుడు పూర్తిగా సాయుధ (పోలీసు) యంత్రాంగం మీదే ఆధారపడుతుంది. పాలకులే తమ శరణుజొచ్చిన తరువాత పోలీసు యంత్రాంగానికి చట్టంతో పనేముంటుంది!? ఒక వైపు స్వామి భక్తి ప్రదర్శించేందుకు, మరోవైపు తన మానసిక ప్రవృత్తిని సంతృప్తి పరచుకునేందుకు అది మానవత్వాన్ని ఫణం పెడుతుంది. సరిగ్గా నేరెళ్ల సంఘటనలో కూడా ఇదే జరిగింది.

నేరెళ్ల సంఘటనలో లారీల దగ్ధం ద్వారా సంభవించిన ఆర్థిక నష్టం గురించి కాదు పోలీసు, పాలకుల ఆగ్రహం. ఆ ఆర్థిక నష్టం వారికి పెద్ద లెక్కలోనిది కాదు. వారికి ఆగ్రహం తెప్పించింది చట్టవ్యతిరేక చర్యల పట్ల ప్రజలలో పెల్లుబికిన చలనం. అంతకు మించి, సాటి మనిషి కష్టం పట్ల కష్టజీవులలో ఉప్పొంగిన సంఘీభావం. ఎవ్వరూ చైతన్య పరచకుండా, ఎవ్వరూ సమీకరించకుండా, ఎవ్వరూ సంఘటిత పరచకుండా సాధారణ జనమే వారికై వారే మూకుమ్మడిగా కదిలితే పాలకుల మెడలు ఎలా వంచబడతాయో, గద్దెలెలా గజగజలాడుతాయో నేడు తెలంగాణను పాలిస్తున్న నాటి ఉద్యమనేతలకు మాబాగా తెలుసు. అందుకనే జన కదలిక జరంతైనా జాగు చేయడం బాగు కాదని బరితెగిస్తున్నారు. 'దళితులు రోడ్ల మీదకు వస్తే నల్లుల్లా నలిపేస్తా'మని స్వయంగా ఆ జిల్లా పోలీసు బాసు నోటిద్వారా హెచ్చరికలు జారీ చేస్తున్నరు. '9, 10 లారీలను కాల్చి గూండాయిజం చేస్తే 10 మందిని పట్టుకుపోయారు. అందులో నలుగురే దళితులు. దళితవాడ మీదకు పోయి కొట్టలేదు' అంటూ స్వయంగా ముఖ్యమంత్రే తన తత్వాన్ని జనాలకు బోధపరుస్తున్నరు. అంటే, ముఖ్యమంత్రి దృష్టిలో దళితవాడ మీదకు పోయి కొట్టడం తప్పుగానీ, దళితులను కొట్టడం తప్పు కాదు. దళితవాడ మీదకు పోయి దళితులను కొట్టడం తప్పుగాని, ఊరు మీదికి పోయి ఊరోళ్లను చావ కొట్టడం తప్పు కాదు. మొత్తానికి ముఖ్యమంత్రి జనాలను కొట్టడం తప్పుకాదు, అది మా హక్కని ధైర్యంగా దండోరా వేస్తున్నారు.




'మీరు తినండి అయితే మా చెంత బిచ్చమెత్తుకుని మాత్రమే తినండి. మీరు బతకండి అయితే మా దయతో మాత్రమే బతకండి. మీ కోర్కెలు తీర్చుకోండి అయితే మా కాల్మొక్కితే మాత్రమే అవి తీరుతాయని తెలుసుకోండి' అన్నది, ఫ్యూడల్ ప్రభువుల, దొరల మనస్తత్వం తప్ప పాలకుల మనస్తత్వం కాదు. కాకూడదు. అంగన్‌వాడీల విషయంలో, ఆశా వర్కర్ల విషయంలో, ఆర్టీసీ కార్మికుల విషయంలో, రైతులు, విద్యార్థులు, ఉద్యోగుల విషయంలో, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఎంబీసీ, మైనారిటీ... మొత్తం సబ్బండ సామాన్య జనం విషయంలో ముఖ్యమంత్రి తమ దొరల మనస్తత్వాన్నే దర్జాగా ప్రదర్శిస్తున్నడు.

గొంతు లేనోళ్ల గొంతుకగా ఉండాల్సిన మేధావుల విషయంలోనూ ఇదే జరుగుతున్నది. సాగిలపడిన వారికి చిల్లర విదుల్చుతున్నడు. సవాల్ చేసిన వారి సడుగులు విరుస్తున్నడు. అడగని వారికి సైతం అభయమిస్తున్నడు. అవసరమున్నవారి ఎడల మాత్రం ఆగ్రహం ప్రదర్శిస్తున్నడు. తన చెవికి జిందాబాద్‌లు తప్ప ముర్దాబాద్‌లు వినిపించకూడదని, తన కంటికి పాలాభిషేకాలు తప్ప ప్లకార్డులు కనిపించ కూడదని ధర్నాచౌక్‌ను సైతం పొలిమేర దాటిస్తున్నడు. పొలిమేరలో ఉండాల్సిన చెత్తను నడివీధిలో పోగేయిస్తున్నడు. తానాడిందే ఆటగా, పాడిందే పాటగా పాలన సాగిస్తున్నడు. అయినా ఎక్కడో అపనమ్మకం. జనంలో తనపై నమ్మకం సడలి పోతున్నదేమోనన్న అనుమానం. తానింక జనాలను నమ్మించలేనేమోనన్న బెరుకుతనం. ఆ అపకమ్మకం నుంచి, ఆ అనుమానం నుంచి, ఆ బెరుకుతనం నుంచి బద్దలైపోతున్నడు. తన స్థాయి మరచి నోరు జారేస్తున్నడు.

అధికారం ఉన్నచోట అహంకారం, అసహనమూ మాత్రమే కాదు అపనమ్మకమూ ప్రదర్శితం కాకూడదు.. అహంకారం ప్రజల నుంచి అధినేతను దూరం చేస్తే, అసహనం అధినేత నుంచి ప్రజలను దూరం చేస్తుంది. అధినేత మాటలో ప్రదర్శితమయ్యే అపనమ్మకం ప్రజల్లో ఆ నాయకుని ఎడల ఉన్న నమ్మకాన్ని చెరిపేస్తుంది. ఒక్కసారి పాలకులనిపై ఉన్న నమ్మకం చెరిగిపోయిన తరువాత, లేదా ప్రజలలో తనపై ఉన్న నమ్మకాన్ని తన చేతులారా తానే చెరిపేసుకున్న తరువాత ఇక చివరి అంకమే మిగిలి ఉంటుంది. ఆకలీ అవమానాలకూ ఎదురీదే ప్రజలను ఆశలలో ముంచడం తేలికే. కానీ ఆ ఆశలు అడియాశలైనపుడు ఆ అడియాశలలో తాము మునిగిపోకుండా ఉండడమే పాలకులకు కష్టం.

రోగ లక్షణం డాక్టరు కన్నా ముందుగా రోగికే తెలుస్తుంది. రోగిగా మారిన అధినాయకత్వం తన రోగ లక్షణాలను ఇప్పుడు పసిగట్టింది. పైకి మాత్రం తనది సంపూర్ణ ఆరోగ్యమని నిర్రనీల్గుతోంది. అయినా శరీరంలో జీర్ణించుకుపోయిన రోగ లక్షణాలు నోటి ద్వారా వీధిన పడుతున్నాయి. అధినేతను అభాసుపాలు చేస్తున్నాయి. ఈ రోగం స్వయంకృతాపరాధం. మందు కూడా అధినేత చేతుల్లోనే పదిలం. ఆ స్వయంకృతం రోగాన్ని నయం చేసుకుని నాలుగు కాలాలపాటు నిలు స్తారో, లేదా కాల గర్భంలో కలుస్తారో ఇక వారి యిష్టం.

రచయిత– ఎంబీసీ సిద్ధాంతకర్త.
సెల్: 8333997714



తెలిదేవర భానుమూర్తి

ఫాయిద ఉంటెనే

నడి నాత్రి. మొగులు మీద సుక్కలు మెరుస్తున్నయి. చిమ్మెటలు పాటలు బాడుతున్నయి. కుక్కలు బౌబౌ మంటున్నయి. దొంగతనం జేసెతందుకు మోక కోసం దొంగలు ఎదురు జూస్తున్నరు. అందరు పండుకున్నరు. కొందరు కల్వరిస్తున్నరు. కొందరు కలల బజార్ల దిర్గుతున్నరు. సడక్ మీద లాటితోని మోర్ గొట్టుకుంట గూర్క గస్తి దిర్గుతున్నడు. ఆడొక లారి ఈడొక మోటర్ బోతున్నయి. జిద్దు ఇడ్వని విక్రమార్కుడు సైకిల్ దీస్కోని ఇంట్ల కెల్లి ఎల్లిండు. సైకిల్ దొక్కుకుంట గాయిన బొందల గడ్డ దిక్కు బోబట్టిండు.

బొందల గడ్డ కాడ ఉన్న అర్రల బేతాలుడు ఉంటున్నడు. గాడు సుత విక్రమార్కుని లెక్కనే దినం పూట పంటడు. నాత్రి పూట డ్యూటిజేస్తడు. పొద్దుమీకినంక గానికి వొండుకోబుద్ది గాలేదు. గాడు హొటల్కు బోయిండు. బిర్యాని దిన్నడు. తిన్నంక సిగిలేట్ ముట్టిచ్చిండు. సిగిలేటు దాక్కుంట ఇంటికి వొచ్చిండు. టివి జూస్కుంట గూసున్నడు. గా దినం గాడు దినం పూట సరింగ పండుకోలేదు. టివి జూస్కుంట గూసున్న గానికి నిద్రొచ్చింది. గాడు పండుకుండు.

సరింగ నాత్రి రొండుగొట్టంగ బేతాలుని ఇంటి ముంగట విక్రమార్కుడు సైకిల్ రుకాయించిండు. రుకాయించి గంటి బజాయించిండు. సైకిల్ గంటి సప్పుడు ఇనంగనే ఇవుతలకు వొచ్చేటి బేతాలుడు ఇవుతలకు రాలేదు. గీడు పండుకున్నడు గొడ్తున్నదని అనుకోని విక్రమార్కుడు రొండు మూడు పార్లు గంటి బజాయించిండు. గప్పుడు బేతాలుడు నిద్రలేసి ఇవుతలకొచ్చిండు. సైకిలెన్క గూసున్నడు. గాడు గూసోంగనే విక్రమార్కుడు సైకిల్ దొక్కబట్టిండు.గప్పుడు సైకిలెన్క గూసున్న బేతాలుడు

"నన్ను గూసుండ బెట్టుకోని గుంతలు, ఎత్తుగడ్డలని సూడకుంట సైకిల్ దొక్కుతవు. నీకు దమ్ము రావొచ్చు. నీ కాల్లు గుంజొచ్చు. గవన్ని యాదిమర్సెతందుకు నీకొక కత జెప్త ఇను. తెలుగు రాస్ట్రాలల్ల నియోజకవర్గాలు ఎక్వ జేస్తె బాగుంటదని రొండు రాస్ట్రాల ముక్యమంత్రులు అనుకున్నరు. గందుకోసం కోషిస్ జెయ్యబట్టిండ్రు.

తెలంగాన ముక్యమంత్రి కెసిఆర్, అంద్రప్రదేస్ ముక్యమంత్రి చెంద్రబాబుకు ఫోన్ జేసిండు

"హలో"

ఫోన్ జేసింది కెసిఆర్ అని గుర్తు బట్టినా

"హలో ఎవరు మాట్లాడేది?" అని చెంద్రబాబు అడిగిండు.

"నేను కెసిఆర్‌ను"


"ఏం సంగతి" అని చెంద్రబాబు అడిగిండు.

"రొండు తెలుగు రాస్ట్రాలల్ల నియోజకవర్గాలను ఎక్వ జెయ్యమని ప్రతానిని అడిగితె బాగుంటది. నేను అడుగత. మీరు గూడ అడుగుండ్రి" అని కెసిఆర్ అన్నడు.

"డిల్లికి బోయినపుడు మా రాస్ట్రంల నియోజక వర్గాలను ఎక్వ జెయ్యమని ప్రతానిని అడుగుత" అని చెంద్రబాబు అన్నడు.

"మీకు బిజెపితోని దోస్తి ఉన్నది. మోదీ మీ మాట తప్పక ఇంటడు. మీ రాస్ట్రంల నియోజకవర్గాలను ఎక్వ జేస్తె. మా రాస్ట్రంల గూడ నియోజక వర్గాలను ఎక్వ జేస్తరు" అని కెసిఆర్ అన్నడు.

"డిల్లికి బోయినపుడు అసెంబ్లి సీట్లను ఎక్వ జెయ్యుమని ప్రతానిని మీరు గూడ అడుగుండ్రి" అని చెంద్రబాబు అన్నడు.



"తప్పక అడుగుత" అని కెసిఆర్ అన్నడు.

"ఒగాల్ల అసెంబ్లి సీట్లను ఎక్వజేసేటి సవాల్ లేదని ప్రతాని అంటె ఏం జేద్దాం" అని చెంద్రబాబు అన్నడు.

"ప్రతాని మాటను మనం ఇన్నప్పుడు మన మాటను ఎందుకినడు. గాయిన పెద్దనోట్లను బంద్ జేస్తె మనం మదద్ ఇచ్చినం. జిఎస్టికి గూడ మదద్ ఇచ్చిన. రామ్‌నాత్ కోవింద్‌ను రాస్ట్రపతిని జేసెతందుకు మనం మదద్ ఇచ్చినం. గిన్నిట్ల మనం గాయిన మాట ఇన్నంక గీ ఒక్కదాంట్ల మన మాట ఎందుకినడు" అని కెసిఆర్ అన్నడు.

"తెలుగు రాస్ట్రాలల్ల అసెంబ్లి సీట్లు ఎక్వజేస్తె కద్మ రాస్ట్రాలు గూడ అసెంబ్లి సీట్లు ఎక్వజెయ్యమని అడుగుతయని ప్రతాని అంటె ఏం జేద్దాం" అని చెంద్రబాబు అడిగిండు.

"తెలంగాన గావాలని మేము అన్నప్పుడు గూడ గిట్లే అన్నరు. గని తెలంగాన ఇయ్యకుంట ఊకున్నరా?" అని కెసిఆర్ అన్నడు.

"ఎట్లన్న జేసి అసెంబ్లి సీట్లను ఎక్వజేపిచ్చుకుంటె మంచిగుంటది" అని చెంద్రబాబు అన్నడు.

కెసిఆర్ డిల్లికి బోయినపుడు ప్రతానిని గల్సిండు.

"తెలంగానల అసెంబ్లి సీట్లు ఎక్వ జేస్తె బాగుంటది" అని అన్నడు

"మీ రాస్ట్రంల అసెంబ్లి సీట్లు ఎక్వ జేస్తె కద్మ రాస్ట్రాలు ఊకోవు. మాగ్గూడ అసెంబ్లి సీట్లు ఎక్వజెయ్యుమని అడుగతయి. అసెంబ్లి సీట్లు ఎక్వజెయ్యాలంటె రాజ్జాంగ సవరన జెయ్యాలె. గిప్పుడు రాజ్జాంగ సవరన జేసుడు మాతోని గాదు. అసెంబ్లి సీట్లను ఎక్వజేసే సవాల్ లేదు" అని ప్రతాని అన్నడు.

కెసిఆర్ పట్నం వొచ్చినంక చెంద్రబాబు గాయినకు పోన్ జేసిండు.

"అసెంబ్లి సీట్లను ఎక్వ జేసేటి సవాల్ లేదని ప్రతాని అన్నడట గదా. గిప్పుడేం జేద్దాం" అని అన్నడు.

"ఏం జెయ్యాలెనో నాకు సమజైతలేదు" అని కెసిఆర్ అన్నడు.

"నాగ్గూడ సమజైతలేదు. గోడదుంకి మా పార్టిలకు వొచ్చినోల్లకు ఎట్ల సీట్లు ఇయ్యాలె. మా పార్టివోల్లకు ఎట్ల సీట్లు ఇయ్యాలె. బిజెపితోని పవన్‌కల్యాన్‌తోని గూడ దోస్తి ఉన్నదాయె గా పార్టిలకు ఎట్ల సీట్లు ఇయ్యాలె. అసెంబ్లి సీట్లు ఎక్వ అయితె తలా ఇన్ని ఇచ్చి ఎట్లనో గాల్లు లొల్లి బెట్టకుంట సూసెటోన్ని. గిప్పుడేం జెయ్యాలె. మా వోల్లకు సీటు ఇయ్యకుంటె గాల్లు గోడ దుంకుతరు. నంద్యాల అసెంబ్లి నియోజకవర్గం కెల్లి పోటి జేసెతందుకు టికిట్ ఇయ్యలేదని శిల్పామోహన్ రెడ్డి గోడ దుంకనే దుంకె. సీటు ఇయ్యలేదనుకుంట శానమంది గోడ దుంకితె నేనేం గావాలె" అని చెంద్రబాబు అన్నడు.

"అసెంబ్లి సీట్లు ఎక్వ గాకుంటె గోడదుంకి మా పార్టిలకు వొచ్చిన తెలుగుదేసం, కాంగ్రెసోల్లకు ఎట్ల సీట్లు ఇయ్యాలె. గాల్లకు సీట్లు ఇస్తె మా పార్టివోల్లు ఊకుంటరా? గాల్లు గోడదుంకుతరు. కొంతమంది రెబల్ క్యాండిటేట్లగ పోటిజేస్తరు. గంతేగాకుంట మా పార్టిల గ్రూపు పంచాతిలు ఉండనే ఉండె. అసెంబ్లి సీట్లు ఎక్వగాకుంటె మల్ల మా సర్కార్ వొస్తదో రాదో అని బుగులైతున్నది" అని కెసిఆర్ అన్నడు.

"తెలుగు రాస్ట్రాలల్ల అసెంబ్లి సీట్లు ఎక్వజేయనని ప్రతాని ఎందుకు అన్నడు. గీ సవాల్‌కు జవాబ్ జెప్పకుంటె నీ సైకిల్ పంపుచరైతది"అని బేతాలుడు అన్నడు.

"తెలుగు రాస్ట్రాలల్ల అసెంబ్లి సీట్లు ఎక్వజేస్తె బిజెపికి పాయిద లేదు. బిజెపికి పాయిదలేని పని ప్రతాని ఎందుకు జేస్తడు" అని విక్రమార్కుడు జెప్పంగనే బేతాలుడు సైకిల్ దిగి బొందలగడ్డ దిక్కు ఉర్కిండు.

సెల్: 9959150491

రిపోర్టర్స్ డైరీ

ఏమీ సేతుర లింగా !

టీఆర్ఎస్ సర్కారుకు ముందు నుయ్యి, వెనుక గొయ్యిలా తయారయ్యాయి ఇటీవల పరిణామాలు. ఒకవైపు నేరెళ్ల ఘటన జరగ్గానే, మరోవైపు పత్రికలపై పరుష వ్యాఖ్యానాలు చేసి జర్నలిస్టులతో పెట్టుకున్నారు సీఎం కేసీఆర్. సిరిసిల్లలో దళితులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించి ఘనకార్యం చేశామని జబ్బలు చరుచుకున్న పోలీసులపై అరికాలిపై లేచినట్టు లోలోపల చెప్పుకుంటున్నా, నవతెలంగాణ పత్రికను తూలనాడి విమర్శలకు గురయ్యారు. హిమాన్షు మోటార్స్ సంగతి బయటకు పొక్కి, కొడుకు కేటీఆర్ భవిష్యత్తు ప్రశ్నార్థకమైందనే టెన్షన్‌లో, టయోటా లింకుండీ ఉపరాష్ట్రపతిగా ఎన్నికైన వెంకయ్యనాయుడు కూడా సీఎంకు ఫోన్ చేసి అసహనం వ్యక్తం చేసినట్టు మీడియావర్గాల్లో చర్చ జరుగుతున్నది. అంతేగాక వామపక్షాల విమర్శలతో కేటీఆర్ శాసనసభ్యత్వానికే ఎసరొస్తుందేమోననే ఆందోళన ఉండటం మరీ కోపం తెప్పించింది పెద్దసారుకు. కల్లుతాగిన కోతిలా చెంగడబింగడ ఎగురుతున్నారని సమాచారం. దీంతో ఏమి సేతుర లింగా అంటూ నెత్తిపట్టుకుంటున్నారట మన సీఎం !? **-బి.బసవపున్నయ్య**

సోయి లేని కాంగ్రెస్!

లోక్‌సభ మాజీ స్పీకర్ మీరాకుమార్‌పై ముఖ్యమంత్రి కేసీఆర్ అనుచిత వ్యాఖ్యల నేపథ్యంలో మరుసటిరోజే పెద్దఎత్తున నిరసన కార్యక్రమాలు జరుగుతాయని మీడియాలో పెద్ద చర్చ జరిగింది. పార్టీ నాయకత్వం కూడా పిలుపునిస్తుందని కాంగ్రెస్ కార్యకర్తలు ఊహించారు. కానీ ప్రెస్‌మీట్లకే పరిమితమై తుస్సుమనిపించడంతో నీరుగారిపోయారు. తెలంగాణ రాష్ట్ర పునర్విభజన చట్టం ఆమోదం పొందే సమయంలో మీరాకుమార్ ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొన్నారని కాంగ్రెస్ నేతలు పదే పదే చెబుతుంటారు. ఆమె గురించి ఎంతో గొప్పగా చెప్పిన కాంగ్రెస్ పెద్దలు... సీఎం చేసిన వ్యాఖ్యలపై వారు స్పందించిన తీరు చూసి సామాన్య కార్యకర్తలు ఛీ కొట్టాల్సిన పరిస్థితి వచ్చింది. మీరాకుమార్‌ను బోరాకుమార్ అని అన్నా కూడా టీఆర్ఎస్‌పార్టీని, ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేలా కార్యక్రమాలు చేపట్టకపోతే, ప్రజలకేమి సమాధానం చెబుతామని అంటున్నారు. మీరాకుమార్‌పై దాడిని ఖండిస్తున్నట్టు ప్రకటించి ఊరుకున్నారు. కేసీఆర్ సర్కారుపై కాంగ్రెస్‌కు అందివచ్చిన అవకాశాన్ని చేజేతులా పోగొట్టుకున్నారు. మహబూబాబాద్ కలెక్టర్‌తో టీఆర్ఎస్ ఎమ్మెల్యే అనుచితంగా ప్రవర్తించిన అంశంపై గగ్గోలు పెట్టిన కాంగ్రెస్ నేతలు...సొంత పార్టీ నాయకురాలైన మీరాకుమార్‌పై సీఎం అడ్డగోలుగా మాట్లాడితే నిమ్మకునీరెత్తినట్టు, తాపీగా సాయంత్రం పూట స్పందించి ఇక చాలు అన్నట్టు వ్యవహరించడం చూస్తే వీళ్లు మారరు అని ట్యాగ్‌లైన్ పెట్టాల్సి వస్తుందేమోనని ఒకటే గుసగుసలు.. **–గుడిగ రఘు**

అయిపోయిన పెండ్లికి డప్పుల సప్పుడెందుకు?

తెలంగాణ ప్రభుత్వంలో అధికార పార్టీ నేతల పైరవీలకు అడ్డూ అదుపూ లేకుండా పోయింది. వ్యవసాయ శాఖలోని 'ఫామ్ మెకనైజేషన్' స్కీంలో వ్యవసాయ పనిముట్లు, చిన్నచిన్న యంత్ర పరికరాల నుంచి మొదలుకొని ట్రాక్టర్ల వరకు సబ్సిడీ మీద అందజేస్తుంది. ప్రధానంగా ట్రాక్టర్ల పంపిణీ విషయానికొచ్చే సరికి వ్యవసాయ శాఖ మంత్రి, ఆ శాఖ ముఖ్య కార్యదర్శి, కమిషనర్, జిల్లా కలెక్టరు, ఆపైన ఎమ్మెల్యే ఇంతమంది దగ్గర పైరవీ చేసుకోగలిగితేనే ఆ ట్రాక్టరు దక్కుతుంది. ఇందులో ఎవరు మెలిక పెట్టినా ట్రాక్టర్ గోవిందే. ఎమ్మెల్యేదే తుది నిర్ణయం. ఈ విషయం తెలియని కొంతమంది రైతులు చెప్పులు అరిగేలా ఈ అధికారుల చుట్టూ తిరిగారు. అయినా పనికాలేదు. చివరికి ఈ అధికారులందరూ చెప్పింది ఏమిటంటే నేను ఓకే గానీ మీ ఎమ్మెల్యే నీకు రికమెండేషన్ చేస్తే పని అయిపోతుందనే మాట. సదరు రైతు ఎమ్మెల్యే దగ్గరకు వెళ్లాడు. ఎమ్మెల్యేను బతిమలాడితే ఎమ్మెల్యే చెప్పిందేమిటీ అంటే మొత్తం 10 ట్రాక్టర్లున్నాయి. 10 మందికి ఇవ్వాలని డిసైడ్ అయింది అని చెప్పారు. మరి ఇప్పుడు అందరినీ ఇంటర్వ్యూ చేస్తున్నారు ఎందుకని ఆరాతీస్తే తెలిందేమిటంటే ట్రాక్టర్లు ఎవరికి ఇవ్వాలనేది ఎప్పుడో డిసైడైంది. కానీ ఇంటర్వ్యూలన్నీ మొక్కుబడికే అని స్పష్టమైంది. **మొత్కూరి యాదయ్య**

డీఎస్సీనా తూచ్..తూచ్...

తెలంగాణ సర్కారుల డీఎస్సీ ఇగ వేస్తం.. అగ వేస్తం అనుడే తప్పా.. ఏసుడు లేదు. గవర్నమెంటొచ్చి మూడేండ్లు దాటినా ఇప్పటికీ బడిపంతులు కొలువొక్కటీ నింపలే. గిదే ముచ్చట రెణ్నెళ్ల కింద విద్యాశాఖ మంత్రి కడియం సారును ఓ విలేకరి 'సారూ మీ హయాంలో డీఎస్సీ వేస్తరా అని..?' జర గట్టిగనే అడిగిండు. దీనికి సార్ గరమై... టెట్ పాస్, ఫెయిల్ చెప్పిన్నాడే డీఎస్సీ కూడా వేస్తం.. ఇగ మీరేమీ మాట్లడొద్దు అని చెప్పిండు. ఇప్పటికి డీఎస్సీ వేస్తమని మస్తు సార్లు చెప్పినా, ఈసారి కడియం సార్ గట్టిగనే చెప్పిండు.. ఇగ వేసేటట్టే ఉన్నరని అందరూ అనుకున్నరు. కానీ రెండు రోజుల కింద టెట్ పాస్, ఫెయిల్ వివరాలు విద్యాశాఖోళ్లు బయటపెట్టిన్రు. అరె డీఎస్సీ ముచ్చటేంది సారూ అని ఓ విలేకరి విద్యాశాఖ పెద్దసారును అడిగిండు. అయ్యో గా పని మాదిగాదు, గీ పాస్,ఫెయిల్ చెప్పుడే మాపని.. కొలువులు నింపుడైతే గది నాపని కాదు..గది సర్కారోళ్ల పని అని సర్రున జారుకున్నడు. గిదంతా టీవీలల్ల చూసిన నిరుద్యోగులంతా ఛీ నీయవ్వ ఇగ.. గీ సర్కార్ హయాంలా టీచర్ కొలువులు కల్లా అని తిట్టుకుంటున్నరు. కడియం సార్..ఊ ఎన్ని సార్లు డీఎస్సీ ప్రకటన తూచ్.. తూచ్ మనిపిస్తరు.. జెరవేయరాదే పెద్దన్న..! **– గంద్ర నవీన్**

ఎర్రజెండా.. పులిహోర పొట్లం...

పులిహోర.. ఈ పేరు వింటేనే చాలు మన నోట్లో నోరూరుతుంది. అందుకే తెలుగు రాష్ట్రాల్లో మెగాస్టార్ చిరంజీవికున్నంత క్రేజ్ పులిహోరకుంది. పసందైన ఈ వంటకానికి పప్పూ, ఆ తర్వాత పెరుగు తోడైతే ఆ రుచే వేరు.. అందుకేనేమో ఈ మధ్య హైదరాబాద్‌లో జరిగిన ఓ మీటింగులో సభికులు పులిహోర పొట్లాలను ఆత్రంగా అందుకుని.. ఒక్క మెతుక్కూడ మిగల్చకుండా పూర్తిగా ఆరగించేశారు. ఈ క్రెడిబులిటీ అంతా సీపీఐ(ఎం) మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగన్నదే అంటూ నిర్వాహకులు అక్కడ చెప్పుకున్నారు. ఇంతకీ విషయమేమంటే.. సభఏర్పాట్ల గురించి నిర్వహించిన సన్నాహక సమావేశంలో మీటింగుకు వచ్చే వారికి భోజనం పెడితే బాగుంటుందా..? లేక పులిహోరనా..? అనే తర్జన భర్జనలు జరిగాయి. ఆ సందర్భంగా పులిహోర బావుంటుందని అందరూ అభిప్రాయపడ్డారు. మరి పులిహోర తయారు చేయించే బాధ్యత ఎవరికి అప్పజెప్పాలి...? అనే ధర్మసందేహాన్ని ఒకరు వెలిబుచ్చారు. అప్పుడు మరొకరు 'రంగన్నయితే బెటర్.. పులిహోర పర్‌ఫెక్ట్‌గా చేయించటంలో ఆయన దిట్ట...' అని ఆయన చెప్పారు. దానికి అందరూ ఓకే అనటం.. ఆ ప్రకారంగానే పులిహోర తయారీ, సప్లై జరిగిపోయాయి... **-బి.వి.యన్.పద్మరాజు**



యూనిక్ లవ్‌స్టోరీని డిఫరెంట్‌గా తెరపై చూపించి.. కథతో పాటు ప్రేక్షకులను నడిపించిన మహిళా దర్శకురాలు **శశికిరణ్ నారాయణ**. ఒక సినిమాతోనే తన తండ్రి మనసును గెలుచుకున్నారు ఆమె. ‘ నీవు రాణిస్తావంటూ’ భుజం తట్టిన ఆయన అకాల మరణం ఆమెను అచేతనంగా మార్చింది. ధైర్యం కూడదీసుకుని నిలబడేలోగా తండ్రి జ్ఞాపకాలలోనే సంవత్సరం పాటు జీవించిన తల్లి తనకు జ్ఞాపకంగా మారింది. సంవత్సరం తిరగకముందే ఇంటి మూలస్తంభాలు కూలిపోవడంతో ఇంటిబాధ్యతలు భుజాన వేసుకుని సినిమారంగానికి బ్రేక్ ఇచ్చారు. మానసికగాయలకు మందువేస్తూనే మంచి సినిమాతో నాన్న పేరు నిలబెట్టాలన్న తపనతో మళ్లీ మెగాఫోన్ పట్టారు. వెబ్ సిరీస్ డైరెక్షన్‌లో బిజీగా ఉన్న ఆమెతో మానవి..

నాన్నకోసం

ఒక్క సినిమానైనా..

ప్రశ్న : మీరు చిన్నతనం నుంచే డైరెక్షన్‌పై మక్కువ పెంచుకున్నారా?

ఊహ తెలిసే నాటికే ఇంట్లో నాటకాల రిహార్సల్స్ జరిగేవి. ఉదయం నాలుగంటల నుంచే డైలాగ్స్ వినిపించేవి. అలారం అవసరం లేకుండానే నన్ను నిద్రలేపేవి. నాన్న ఫైన్‌ఆర్ట్స్ కన్వీనర్‌గా ఉండేవారు. దాంతో మా ఇంట్లో ఎక్కువగా రిహార్సల్స్ జరిగేవి. డైలాగ్స్ రాయడం, స్క్రీన్ ప్లే, నటుల చేత డైలాగ్స్ చెప్పించడంలో నాన్న లీడర్‌షిప్ క్వాలిటీస్ బాగా నచ్చేవి. సహజంగా పిల్లలకు ఫస్ట్ ఇన్స్పిరేషన్ తల్లిదండ్రులు. అలా నాన్నే నాకు స్ఫూర్తిగా నిలిచారు.

ప్రశ్న : మీ ఇష్టాన్ని నాన్నతో చెప్పారా?

నాకు డైరెక్షన్ అంటే ఇష్టం ఉన్నా.. నాన్నతో ఎప్పుడూ చెప్పలేదు. ఆయన మమ్మల్ని పరిశ్రమకు, సినీ వాతావరణానికి చాలా దూరంగా పెంచారు. ఆయన సినిమాలు చూడటమే తప్ప.. ఎప్పుడూ షూటింగ్‌కు వెళ్లేవాళ్లం కాదు. బి.ఎస్సీ రెండో సంవత్సరం చదువుతున్నప్పుడే పెళ్లి చేశారు. ఫైనల్ ఇయర్ పరీక్షల నాటికీ పాప పుట్టింది. అదే సంవత్సరం నాన్న నటించిన ‘మా నాన్నకు పెళ్లి’ సినిమా విడుదల కావడంతో పాటు ఆయనకు నంది అవార్డు వచ్చింది.ఆ తర్వాత ఆయన వెనక్కి తిరిగి చూడలేదు. ఎన్నో పాత్రల్లో జీవించారు. పాపకు ఆయనే ‘నైరుతి’ అని పేరు పెట్టారు. తన సినీ జీవితంలో తొలకరి జల్లును తీసుకువచ్చిందని పాపను ఎంతో ఆప్యాయంగా చూసేవారు.

ప్రశ్న : మీలోని డైరెక్టర్‌ను ఎలా బయటకు తీసుకువచ్చారు?

నేను ఎబిఎన్‌లోనూ, ఆ తర్వాత మా టీవిలోనూ ప్రోగ్రామింగ్ డైరెక్టర్‌గా పనిచేశాను. అసిస్టెంట్ డైరెక్టర్‌గా పూరి జగన్నాథ్ వద్ద చేరుదాం అనుకున్నాను. కానీ, టైమింగ్స్ కుదరలేదు. ఇద్దరు పిల్లలు.. సింగిల్ పేరెంట్‌ను.. జాబే బెటర్ అనుకున్నాను. ఈ సమయంలోనే నా ఫ్రెండ్ ఒకరు నాన్న వద్దకు వెళ్లి నాతో ఒక సినిమాకు డైరెక్షన్ చేయించమని అడిగారు. ఎవరి దగ్గర అసిస్టెంట్ డైరెక్టర్‌గా కూడా పనిచేయలేదు. ఏ నమ్మకంతో శశిని డైరెక్టర్‌గా చేయమని చెప్పాలని ఆయన అడిగారట. ప్రోగ్రామింగ్ డైరెక్టర్‌గా ఆమె క్యాపబులిటీస్ మాకు తెలుసు. మా సినిమాకు సెన్సిబులిటీ ఉన్న కొత్త మహిళా దర్శకురాలు కావాలి.. మీ అమ్మాయే చేయాలన్నారట. దాంతో నాన్న నాకు చెప్పారు. ముందుగా వారు తీయాలనుకుంటున్న మలయాళం సినిమా చూశాను. చాలా బాగుంది. తెలుగు సినిమాకు నిర్మాత డాక్టర్, ఎన్నారై.

ప్రశ్న : మరి ఉద్యోగం మానేశారా?

లేదు. జాబ్ కంటిన్యూ చేస్తూనే ప్రీ ప్రొడక్షన్ వర్క్ స్టార్ట్ చేశాను. నా ఆసక్తిని గమనించిన నాన్న రెండు పడవలపై ప్రయాణం ఎందుకు జాబ్ మానేయి అన్నారు. అంతే మా టీవిలో జాబ్‌కు రిజైన్ చేశాను. .నాకు సినిమా ఆఫర్ ఏప్రిల్ 2013లో వచ్చింది. ప్రీ ప్రొడక్షన్ అంతా పూర్తి చేసుకుని 2014 జనవరిలో సినిమా షూటింగ్ ప్రారంభించాం.



ప్రశ్న : హీరోహీరోయిన్స్ కొత్తవారు. మీరు కొత్త. ఎలా ఫేస్ చేశారు?

డైరెక్షన్ అనేది ఒక ప్యాషన్‌తో చేసేది. ముఖ్యంగా విజన్ ఉండాలి. కష్టపడే తత్వం కావాలి. నాకు వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని మంచి సినిమాను ప్రేక్షకులకు అందించే ప్రయత్నం చేశాను. మా టీమ్ అంతా కలిసి ఈ సినిమాకు టైటిల్ నిర్ణయించాం. సాహెబా సుబ్రమణ్యం. తెలుగు నేటివిటీకి దగ్గరగా ఉండేలా తెరకెక్కించాం. 2014 డిసెంబర్ 13న సినిమా రిలీజ్ అయ్యింది. ప్రేక్షకులకు బాగా కనెక్ట్ అయ్యింది. అయితే థియేటర్లు ఎక్కువగా దొరకలేదు. ఎంత పెద్ద సినిమా అయినా రిలీజ్ చేయడంలో చాలా ఇబ్బందులు ఉన్నాయి.

ప్రశ్న : సినిమా చూసి మీ నాన్న ఎలా ఫీల్ అయ్యారు?

ఈ సినిమాలో నాన్న కూడా నటించారు. హీరోహీరోయిన్స్ కొత్తవారే అయినా.. మిగతా నటీనటులంతా చాలా సీనియర్లు. వారి నుంచి చాలా నేర్చుకున్నాను. ఈ సినిమా విడుదలైన ఆనందాన్ని పూర్తిగా ఆస్వాదించకముందే నాన్న అకాల మరణం. మా కుటుంబాన్ని నిలువునా కుదిపేసింది. ఆ తర్వాత సరిగ్గా సంవత్సరానికి ఆయన వర్ధంతి రోజూ అన్ని చానల్స్ వారు ఇంటికి వచ్చారు. నాన్నను గుర్తుకు చేసుకుంటూ కార్యక్రమాలు. ఆ మరుసటి రోజు రాత్రి అమ్మ గుండెపోటుతో నిద్రలోనే చనిపోయారు. దెబ్బమీద దెబ్బ... రెక్కలు తెగిన పక్షుల్లా నేను, తమ్ముడు మిగిలాం.అన్ని కోల్పోయిన ఫీలింగ్. మా పిల్లలకు నాన్నతో, అమ్మతో చాలా చనువు. వారిద్దరిని అతి తక్కువ వ్యవధిలో కోల్పోవడంతో పిల్లలను ఓదార్చడం చాలా కష్టమైంది. ఆ బాధల నుంచి తెరుకోవడానికి చాలా సమయమే పట్టింది.

ప్రశ్న : ఇప్పుడు ఏ ప్రాజెక్ట్ చేయబోతున్నారు?

నాన్న ఎప్పుడు ఒక్క మాట చెప్పేవారు. పనిని నమ్ముకున్నవారికి ఎప్పుడు అపజయం ఉండదు అని. నాన్న నటనను ప్రేమించేవారు. అందుకే ఆయన 700 సినిమాల్లో విలక్షణమైన పాత్రలను వేసి ప్రేక్షకుల మదిలో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు. పరిశ్రమలో ఆయన స్థానాన్ని ఎవరూ పూర్తి చేయలేరని ఎంతో మంది ప్రముఖులు చెప్పారు. నటుడిగానే కాకుండా మంచి వ్యక్తిగా పేరు తెచ్చుకున్న ఆయన కూతురుగా ఒక్క సినిమానైనా తీసి మంచి హిట్ సాధించాలని ఉంది. అయితే అది ఇప్పుడు కాదు. కథలు రాసుకుంటున్నాను. ప్రస్తుతం ఒక వెబ్ సిరీస్ డైరెక్ట్ చేస్తున్నాను. మంచి సినిమాకైతే థియేటర్లతో ఇబ్బందులు. వెబ్‌కు ఆ ఇబ్బంది లేదుకదా!

ప్రశ్న : మీ నాన్న ఎన్నో పాత్రలు చేశారు. వాటిలో మీకు ఇష్టమైన కొన్ని పాత్రల గురించి చెప్పండి.

నిజ జీవితంలో ఆయనకు చాలా దగ్గరగా ఉండే పాత్ర పిల్ల జమీందారు సినిమాలోది. ఆ తర్వాత శివమణి సినిమాలోని పాత్ర. ఈ సినిమాలోని ఆయన పాత్ర మొత్తాన్ని ఆఫ్ డేలో పూర్తి చేశారు. ‘దూకుడు’ సినిమాలో సూపర్ హిట్ సినిమాల హీరోల పాత్రలను మ్యానరిజం చేసే పాత్ర వేసారు. అయితే ఆ సినిమాలేవీ ఆయన చూడలేదు. డైరెక్టర్ సీన్ చెప్పి.. క్లిప్పింగ్ మాత్రం చూపించారట. ఇలా చెప్పుకుంటూ పోతే అన్ని పాత్రలు ఇష్టమైనవే.

ప్రశ్న : మీరు ఏ విధమైన సినిమాలను ఇష్టపడతారు?

ప్రతి సినిమాను విశ్లేషణాత్మకంగా చూస్తాను. ఆ సినిమా ద్వారా దర్శకుడు ఏం చెప్పాలనుకున్నాడో అన్వేషిస్తాను. కథలో భాగంగా వినోదం ఉండాలి. కథతో పాటుగా ప్రేక్షకులు ట్రావెల్ చేసేలా సినిమా ఉండాలనుకుంటాను. సమాజానికి ఎంతో కొంత మెసేజ్ ఇచ్చే సినిమాలను ఎక్కువగా ఇష్టపడతాను.

వి.యశోద

చున్నీ పట్టి లాగితే..!

మహిళలను వేధించడం పరిపాటిగా మారింది. ఒంటరిగా అమ్మాయిలు కనిపిస్తే చాలు వారిని ఏడిపించడమే లక్ష్యంగా పెట్టుకుంటారు కొందరు అబ్బాయిలు. రోడ్డుపై, కాలేజీలో, మార్కెట్‌లో, పార్క్‌లో ఇలా ఎక్కడ అమ్మాయి ఒంటరిగా కనిపించినా ఏదో ఒక రకంగా వేధిస్తుంటారు. అలాంటి వారికి ఎలా బుద్ధి చెప్పాలో ఈ వారం తెలుసుకుందాం.

ఒంటరిగా నడుచుకుంటూ వెళ్తున్న అమ్మాయిని వేధించే ప్రయత్నం చేస్తున్నాడు ఒక వ్యక్తి. మెల్లగా వచ్చి వెనక నుంచి ఆ అమ్మాయి చున్నీ పట్టిలాగాడు. ఊహించని సంఘటన.. చున్నీ గొంతుకు బిగుసుకు పోవడం రెండూ ఆమెను ఒకేసారి ఉక్కిరిబిక్కిరి చేశాయి.


1


2

చున్నీ గొంతుకు బిగుసుకోవడంతో ఊపిరి ఆడటం కష్టంగా మారుతుంది. దాంతో చాలా మంది అమ్మాయిలు చున్నీ గొంతుకు బిగుసుకుపోకుండా పట్టుకుని లాగుతారు. మీరు అలా చేయవద్దు. చున్నీ పట్టి లాగినట్టు అనిపించగానే.. వెనక్కి తిరగాలి. చున్నీ పట్టుకున్న చేయిని మీ చేతిలో లాక్ చేయాలి. వెంటనే వాడి చేయిని గట్టిగా పట్టుకోవాలి.

గొంతుకు బిగుసుకున్న చున్నీతో మీరు ఇబ్బంది పడతారు అని ఊహించిన ఆ వ్యక్తి మీ రియాక్షన్ అర్థం చేసుకునేలోగా.. మీ రెండో చేయితో ఆ వ్యక్తి జుట్టు పట్టి ముఖాన్ని కిందికి వంచాలి. ఈ అటాక్స్ అన్నీ వెనువెంటనే జరగాలి.


3

10 సెల్ఫ్ డిఫెన్స్


4

జుట్టు పట్టి ముఖాన్ని కిందికి వంచిన తర్వాత వెంటనే వాడి ముఖంపై నీఅటాక్(మోకాలితో ముఖంపై అటాక్) చేయాలి. అంతే చున్నీని వదిలేయడమే కాదు.. మరోసారి మీ వైపు చూసేందుకు కూడా భయపడతాడు.

మహిళలు అంటే చులకనగా చూసే వారికి బుద్ధి చెప్పాల్సిన బాధ్యత మనపై ఉంది. అమ్మాయల జోలికి వచ్చారో.. ముఖం పగిలిపోతుంది అన్న మెసేజ్ వేధించేవారికి చేరాలి. మీరు మీ స్నేహితులతో కలిసి ఈ టెక్నిక్స్ ప్రాక్టీస్ చేయండి. మీలో ఆత్మవిశ్వాసం రెట్టింపు అవుతుంది.



ఎన్. లక్ష్మీ రవి,
ఇంటర్నేషనల్ గోల్డ్ మెడలిస్ట్,
రుద్రమదేవి సెల్ఫ్ డిఫెన్స్,
గాంధీనగర్, హైదరాబాద్.
9490239170, 9949039049

పిప్పళ్ల వెంకటేశ్

నిమ్మ చేసే మాయ...

నిమ్మరసం ఆరోగ్యానికే కాదు.. మరెన్నో రకాల ఉపయోగాలున్నాయి. కిచెన్‌లో మరకలు తొలగించడం నుంచి, చుండ్రు విముక్తి వరకు ఎన్నో రకాలుగా తోడ్పడుతుంది. అందులో కొన్ని..

- ఆపిల్ ముక్కలు కట్ చేయగానే రంగు మారిపోతాయి. నీళ్లలో రెండు మూడు చుక్కల నిమ్మరసం కలపాలి. కట్ చేసిన ఆపిల్ ముక్కలను అందులో ఉంచి తీసి ఒక బాక్స్‌లో పెట్టండి. కొన్ని గంటలపాటు రంగు మారకుండా తాజాగా ఉంటాయి.



- కొందరి గోళ్లు రంగు మారి పచ్చగా కనబడుతుంటాయి. కొన్నిసార్లు ఎంత నెయిల్ పాలిష్ రిమూవర్ ఉపయోగించినా గోళ్లకున్న రంగు పోదు. అలాంటప్పుడు గోరువెచ్చని నీటిలో సగం ముక్క నిమ్మరసం పిండాలి. ఐదు నిమిషాల పాటు వేళ్లను అందులో ఉంచాలి. ఆ తరువాత నిమ్మ తొక్కలతో దానిపై రుద్ది... కడిగేయాలి. అంతే గోళ్లు మునుపటి మాదిరిగా మెరిసిపోతాయి.
- ఫ్రిజ్‌లో రకరకాల పదార్థాలు నిల్వ చేస్తాం. అన్నీ కలగలసి ఒక దుర్వాసన వస్తుంది కొన్ని సార్లు. అది పోగొట్టాలంటే నిమ్మకాయను రెండు ముక్కలు చేసి ఫ్రిజ్‌లో ఉంచండి. లేదా నిమ్మరసంలో దూదిని ముంచి అది ఫ్రిజ్‌లో ఉంచాలి. మూత పెట్టకుండా అల్లం వెల్లుల్లి పేస్టు, పచ్చి ఉల్లిగడ్డముక్కలు, ఫ్రిజ్‌లో నిల్వ చేయకూడదు.
- కొన్ని మొండి మరకలను అస్సలు పోవు. అలాంటి వాటిని తొలగించాలంటే... బట్టలపై నిమ్మరసం పిండాలి. చిటికెడు ఉప్పును వేయాలి. కొన్ని గంటల పాటు అలా ఉంచి... తరువాత సబ్బుతో ఉతికేయాలి. కెచప్, కాఫీ, కూర మరకలు ఇట్టే మాయమవుతాయి. ❄

గ్లిజరిన్‌తో...

చర్మం పొడిబారి, పగిలినట్టు అనిపిస్తే వెంటనే మాయిశ్చరైజర్ రాసుకుంటారు. అలా మాయిశ్చరైజర్ రాసుకునే ముందు దాంట్లో కొద్దిగా గ్లిజరిన్ కలుపుకుంటే తొందరగా ఉపశమనం పొందుతారు. గ్లిజరిన్ చర్మ సంరక్షణకు బాగా ఉపయోగపడుతుంది. కాబట్టి దీన్ని సబ్బుల్లో, మాయిశ్చరైజర్లలో, లోషన్స్‌లో, ఫేస్ మాస్క్‌లో తగినంత మోతాదులో కలుపుతారు. పొడి చర్మతత్వం ఉన్న వారు గ్లిజరిన్ ఎలా ఉపయోగించుకోవాలో తెలుసుకుందాం !



- ఒక చెంచా గ్లిజరిన్‌లో రెండు చెంచాల గులాబీ నీటిని కలపాలి. ఈ మిశ్రమంలో కాటన్ బాల్స్‌ను ముంచి ముఖానికి, పొడి బారిన చర్మానికి అప్లై చేసుకొని పది నిమిషాల తర్వాత కడిగితే మంచి ఫలితం కనిపిస్తుంది. ఇలా కడిగిన వెంటనే చర్మానికి మాయిశ్చరైజర్ రాసుకుంటే మంచిది.
- ఫేస్ మాస్క్ పెట్టుకునే ముందు చర్మానికి కొద్దిగా గ్లిసరిన్ రాసుకుంటే మంచిది. సగం చెంచా గ్లిజరిన్‌లో ఒక చెంచా నీళ్ల కలిపి ముఖానికి పట్టిస్తే సరిపోతుంది. ఆ తర్వాత ముఖానికి మాస్క్ వేసుకోవచ్చు.
- చర్మం బాగా పొడిబారితే కోల్డ్ క్రీమ్‌లో కొన్ని చుక్కలు గ్లిజరిన్ వేసుకొని చర్మానికి రాసుకుంటే మంచిది. ఇలా చేయడం వల్ల చర్మం హైడ్రేట్ కావడంతో పాటు తాజాగా కనిపిస్తుంది.
- బాడీ లోషన్‌లో రెండు చుక్కల గ్లిజరిన్, కొన్ని నీళ్ల కలుపుకొని చర్మానికి పెట్టుకుంటే చర్మం చాలా సమయం వరకు మృదువుగా ఉంటుంది.
- పెదాలు పగిలి, నిర్జీవంగా కనిపిస్తే లిప్‌బామ్‌లో రెండు చుక్కల గ్లిజరిన్ కలిపి పెదాలకు రాసుకుంటే చాలు మృదువుగా, అందంగా తయారవుతాయి. ❄

ఓ విజేత కథ

స్ఫూర్తి ఇవ్వడానికి ఎన్ని విజయాలు కావాలి? ప్రేరణ పొందడానికి ఎన్ని లక్ష్యాలు సాధించాలి? వాటికి కొలమానాలు ఉండవు. ఆడిపాడే వయసులో పెండ్లి చేసుకోవాల్సి వస్తే..! ఇంకా బాల్యపు నీడలు పోకముందే ఓ చిన్నారికి తల్లైపోతే! ప్రపంచమే సరిగ్గా తెలియని 13 ఏండ్ల వయసులో నా అనుకున్నవారు నడిరోడ్డు పాల్జేస్తే. తట్టుకోవడానికి ఎంతటి మానసిక స్థైర్యం కావాలి? నిలదొక్కుకోవడానికి ఎంత గుండెధైర్యం ఉండాలి? దానిని వెలకట్టడానికి ఏ తూనికలు సరిపోవు. కానీ ఎంతోమందికి మనోధైర్యాన్నిస్తుంది. అలాంటి సోదరి కథే ఇది. ఆమె చెబుతుంది చదవండి...



“బాల్యం అనగానే అందరి కళ్లు సంతోషంతో మెరిసిపోతాయి. జ్ఞాపకాలతో మురిసిపోతాయి. కానీ నాకు అలాంటి జ్ఞాపకాలేవీ లేవు. ఎందుకంటే అవేవీ గుర్తుపెట్టుకునేంత మంచివి కావు. అందుకే బాల్యం గురించి తలుచుకోవాలంటే బెంగ నాకు. ఆ గాయాలను తడిమి చూసుకున్నప్పుడల్లా విపరీతమైన నొప్పి కలుగుతుంది గుండెకు. దిగులుతో కూడిన ఒంటరి బాల్యం నాది. అందరూ కలిసి నా బాల్యాన్ని ముక్కలుముక్కలు చేశారు. జీవితంలో ఎప్పటికీ వాటిని అతికించలేను. 12 ఏండ్లప్పుడు అనుకుంటా... నన్ను కొత్త డ్రెస్ వేసుకుని అందంగా తయారు అవ్వాలని చెప్పారు. సంతోషంగా తయారయ్యాను. ఎందుకంటే నన్ను ఆడుకోవడానికి బయటికి తీసుకెళ్తారేమోనన్న ఆనందంతో. కానీ స్కూల్ పిక్‌నిక్ గురించి నేను ఆలోచించే రోజుల్లో... తల్లిదండ్రులు నాకు పెండ్లి చేసి శాశ్వతంగా ఇంటినుంచి దూరం పంపించేశారు. అత్తగారింట్లో నరకం. కట్నం తీసుకురాలేదని కొడుతూనే ఉండేవారు. ‘మా కుటుంబం ఇవ్వలేదు.. అలా డబ్బులు ఇవ్వగలిగిన వాళ్లే అయితే ఇంత తొందరగా పెండ్లి చేసేవారు కాదు. నన్ను బాగా చదివించేవారు’ అని ఎన్నిసార్లు చెప్పినా వాళ్లు వినిపించుకోలేదు. నా భర్త నన్ను విపరీతంగా కొట్టేవాడు.

జీవితంలోకి వెలుగు

13 ఏండ్లకే నాకు పాప పుట్టింది. నేనే చిన్నపిల్లను... నా ఒడిలో మరో పిల్ల. నాకు ఆడుకోవడానికి దొరికిన బొమ్మలాగా అనిపించేది. నా నుంచి ఎక్కడికైనా తీసుకెళ్లిపోతారేమోనని భద్రంగా చూసుకునేదాన్ని. నాకు ఇష్టమైన టీచర్ నా కూతురుకు పేరు పెట్టింది ‘జోయిత’ అని. జోయిత అంటే విజేత అని అర్థం. నా జీవితంలో వెలుగులు తెస్తుందని ఆమె భావించిందేమో. కానీ అదే ఏడాది మా అత్తింటివారు నన్ను ఇంటినుంచి గెంటేశారు. పసిబిడ్డతో... పదమూడేండ్ల వయసులో రోడ్డున పడ్డాను. ఇంత పెద్ద ప్రపంచంలో నేను ఒక్కరాత్రి తలదాచుకోవడానికి చోటు లేకుండా పోయింది. కానీ విచిత్రమేమంటే.. నేనెవరో తెలియని ప్రజల నుంచి నాకు సహాయం దొరికింది. ఆ తరువాత జీవితం నాకెన్నో పాఠాలు నేర్పింది. అది కూడా చాలా కఠినంగా. నేను చాలా ప్రేమించిన మనుషులు నాకు వెన్ను చూపారు. బతకడం కోసం పోరాటం కాదు నాది. ప్రేమ లేని ప్రపంచంలో.. నా కూతురుపై గుండెనిండా ప్రేమ పెంచుకుని బతకడం కోసం. నా కూతురుకోసం బతకడం నేర్చుకున్నాను. నా బాల్యపు పీడకలల నుంచి నేర్చుకున్న పాఠాలతో... ఆమెకు మంచి బాల్యాన్నివ్వడం కోసం శ్రమించాను.

పార్లరే ప్రపంచంగా...

కష్టపడి డిగ్రీ పూర్తి చేశాను. నా కూతురిని స్కూల్లో చేర్పించాను. ఇప్పుడు మీరు చూస్తున్న ఈ గదే నా ప్రపంచం. ఈ గదిలోని ప్రతి చిన్న వస్తువు... నేను నా కూతురు అత్యంత ప్రేమతో అమర్చుకున్నవి. ఇది ఇప్పుడు నేను నడిపిస్తున్న పార్లర్ ‘జోయితా బ్యూటీ పార్లర్’. ఇక్కడే నేను కష్టపడి పనిచేస్తాను. మనసారా నవ్వుకుంటాను. జీవితం గురించి ఎన్నో కలలు కంటాను. చాలా మంది అడుగుతుంటారు నన్ను ‘నీవు కొత్త జీవితాన్ని ఎందుకు ప్రారంభించ కూడదు’ అని. ‘కొత్త’ అంటే ఏమిటి?’ అని తిరిగి అడుగుతాను. మళ్లీ పెళ్లి చేసుకుని కొత్తజీవితాన్ని పొందొచ్చు కదా అంటారు. నేను బిగ్గరగా నవ్వుతాను. ఎందుకంటే చిన్నపాపతో పదేండ్లు జీవన పోరాటంచేశాను. ఆ పోరాటం నుంచి ఎన్నో నేర్చుకున్నాను. అలాంటిది ఇంకా కొత్తదనమేదో ఇవ్వడానికి నా జీవితంలో మరో పురుషుడు అవసరమా? అని గట్టిగా నవ్వేస్తాను” ❄

కూర్చున్నచోటనే...


సన్నగా మారాలని ఉన్నా.. వ్యాయామం చేయడం కష్టం, సమయం లేక కొందరు, బద్ధకిం కొందరు మానేస్తారు. అలాంటివారు వాళ్లకు నచ్చినట్లుగా వ్యాయామం చేయొచ్చు.



- వ్యాయాయమే చేయాలనే నియమాన్ని పెట్టుకోకండి. ఏదయినా డ్యాన్స్ క్లాస్‌లో చేరండి. ఇష్టమైన ఆటను ఆటండి. మీకో వ్యాపకం ఉంటుంది. వ్యాయామం చేసినట్లా అవుతుంది.
- సైకిలు తొక్కడం మొదలుపెట్టండి. చిన్నచిన్న పనులకు దానిపై వెళ్లడం అలవాటుగా మార్చుకుని చూడండి. ఓ పదినిమిషాలు దొరికితే తాడాట ఆడండి. లేదా ఉన్నచోటే గెంతే ప్రయత్నం చేయండి. ఇవన్నీ వ్యాయామంలో భాగమే.
- వ్యాయామం చేస్తున్నా సరే.. వీలైనంత ఎక్కువగా నడిచేందుకు ప్రాధాన్యం ఇవ్వండి. అది వ్యాయామంలా అనిపించదు కానీ.. తెలియకుండానే కెలోరీలు ఖర్చవుతాయి.
- మెట్లెక్కి దిగడం, కూర్చున్నచోట కాళ్లూ, చేతులు సాగదీయడం, గుంజిళ్లు తీయడం.. చేతుల్ని గుండ్రంగా తిప్పడం వంటివన్నీ వ్యాయామంలో భాగమే. ఇవి చేస్తే అదనంగా వ్యాయామశాలకు వెళ్లాల్సిన అవసరంలేదు. ❄

సూర్యకుమారి అదృశ్యం విషాదాంతం

- రైవస్ కాలువలో మృతదేహం లభ్యం
- గాంధీనగర్‌లో స్కూటీ గుర్తింపు



విజయవాడ: విజయవాడలో సంచలనం సృష్టించిన డాక్టర్ సూర్యకుమారి అదృశ్యం విషాదాంతమైంది. ఆమె మృతదేహాన్ని విజయవాడ సమీపంలోని నిడమానురు వద్ద రైవస్ కాల్వలో శనివారం గుర్తించారు. మృతురాలి మెడలో ఉన్న చైను ఆధారంగా తల్లిదండ్రులు తమ బిడ్డేనని గుర్తించారు. ముందుగా పోలీసులు విజయవాడ గాంధీనగర్‌లో రైవస్ కాల్వ వద్ద ఆమె ద్విచక్ర వాహనాన్ని గుర్తించారు. దీంతో అనుమానంతో ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలు జెమిని బోట్ల సాయంతో కాల్వలో రాత్రి ఏడు గంటల సమయంలో నిడమానూరు వద్ద మృతదేహాన్ని గుర్తించి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. సేకరించిన వివరాల ప్రకారం.. ఎంబిబిఎస్ పూర్తి చేసిన సూర్యకుమారి ప్రభుత్వ నిబంధనల ప్రకారం గ్రామీణ ప్రాంతంలో సేవలందించేందుకు కృష్ణాజిల్లా విస్సన్నపేట మండలం తెల్లదేవరపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరు నెలల నుంచి సేవలందిస్తోంది. ఈ క్రమంలో జులై 31వ తేదీ అర్ధరాత్రి ఆమె అదృశ్యమైంది. తమ కుమార్తె కనిపించడంలేదని ఈనెల ఒకటో తేదీన ఆమె తల్లిదండ్రులు మాచవరం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ కేసులో మాజీ ఎమ్మెల్యే జయరాజు కుమారుడు విద్యాసాగర్‌ను అదుపులోకి తీసుకుని నాలుగు రోజులపాటు విచారించారు. అనంతరం శుక్రవారం సాయంత్రం విద్యాసాగర్‌ను విడుదల చేశారు. సూర్య కుమారి కాల్‌డేటా, సిసి కెమెరాల పుటేజీల ఆధారంగా కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులకు ఆమె స్కూటీ రైవస్ కాల్వ వద్ద ఉందని శనివారం మధ్యాహ్నం సమాచారం వచ్చింది. అప్రమత్తమైన పోలీసులు ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలను రంగంలోకి దింపారు. రైవస్ కాల్వలో దూకి ఆత్మహత్య చేసుకుందేమోననే అనుమానంతో బోట్ల సాయంతో కాల్వలో గాలించారు. చివరికి నిడమానూరు వద్ద ఆమె మృతదేహాన్ని గుర్తించారు. సూర్యకుమారి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు ఆమెది హత్య, ఆత్మహత్య అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. సూర్యకుమారి సోదరి కర్నాటకలో ఐఎఎస్ అధికారిగా విధులు నిర్వహిస్తోంది.

దళితులపై భూస్వాముల దాడి


అక్రమ చెరువు తవ్వకాన్ని అడ్డుకున్నందుకు ప్రతీకారం



చేయి విరిగిన ఎలిజబెత్ రాణి



గాయపడిన అనిల్



భూస్వాముల దాడిలో తలకు 10కి పైగా కుట్లుపడిన బి.వి.శ్రీనివాస్

గుడివాడ: కృష్ణాజిల్లాలో భూస్వాముల ఆగడాలు శృతిమించాయి. గుడివాడ మండలం దొండపాడులో అక్రమ చెరువుల తవ్వకాలను అడ్డుకున్న దళితులపై శనివారం దాడి చేశారు. దొరికిన వాళ్లను దొరికినట్లే చితకబాదారు. దళితులకు మద్దతుగా నిలిచిన సిపిఎం డివిజన్ సభ్యులు బివి.శ్రీనివాసరావును తీవ్రంగా గాయ పర్చారు. ప్రాణభయంతో పరుగులు పెట్టిన దళితులనూ విడిచిపెట్టలేదు. తరిమితరిమి కొట్టడంతో పాతిక మందికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిలో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉండటంతో విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. దొండపాడు గ్రామంలో పాత హరిజన వాడకు ఆనుకుని ఉన్న ఏడెకరాల్లో చెరువు తవ్వుతున్నారు. దీని వల్ల కాలుష్యం పెరుగుతోందని, భూగర్భజలాలు కలుషిత మౌతాయని దళితులు సిపిఎం, ఇతర ప్రజాసంఘాల సంఘీభావంతో వారం రోజుల నుంచి తవ్వకాలను అడ్డు కుంటు న్నారు. శనివారం తవ్వకం పనులు తిరిగి ప్రారంభించటంతో అడ్డుకునేందుకు ప్రయత్నించారు. దీంతో అప్పటికే అక్కడ పొంచివున్న 150 మంది గూండాలు వారిని చుట్టుముట్టి విచక్షణా రహితంగా దాడి చేశారు. దొరికిన వారిని దొరికినట్లు చేలల్లో పరిగెత్తించారు. ఊపిరాడకుండా మెడపై కాళ్లు పెట్టి పంట బోదెల్లో కుక్కారు. మహిళలను సైతం వదిలిపెట్టలేదు. తీవ్ర గాయాలైన 25 మందిని గుడివాడ ప్రభుత్వ ఆస్పత్రికి, తీవ్రంగా గాయపడిన శ్రీనివాస రావు, కోటేశ్వరమ్మ, అనిల్ తదితరులను విజయవాడ ఆస్పత్రికి తరలించారు.

గరగపర్రు దళితులకుసర్కారు వెన్నుపోటు

ఏలూరు: సాంఘిక బహిష్కరణకు గురైన గరగపర్రు దళితులకు న్యాయం చేస్తామని చెప్పి ప్రభుత్వం వెన్నుపోటు పొడిచింది. మంత్రుల బృందం, ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ ఇచ్చిన హామీలను సైతం తుంగలో తొక్కింది. ఈ ఏడాది ఏప్రిల్ 12న అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు సమయంలో అగ్రవర్ణాలకు, దళితులకు మధ్య వివాదం ఏర్పడింది. దీంతో మే 5 నుంచి దళితులపై అగ్రవర్ణాలు సాంఘిక బహిష్కరణ విధించాయి. కౌలు పొలాలు తీసేసుకున్నాయి. కలెక్టర్ కొన్ని కుటుంబాలకే పరిహారం అందించాలని నివేదిక ఇచ్చారని, ప్రతి కుటుంబానికీ రూ.లక్ష చొప్పున పరిహారం అందిస్తామని హామీ ఇచ్చారు. అట్రాసిటీ చట్టం ప్రకారం సాంఘిక బహిష్కరణకు గురైన దళితుల కుటుంబానికి రూ.పది లక్షల చొప్పున పరిహారం, లేదా భూమి కొనుగోలు చేసి ఇవ్వాల్సి ఉంది. మంత్రుల బృందం రూ.లక్ష పరిహారం ప్రకటించినప్పటికీ గరగపర్రు దళితులు సరిపెట్టుకున్నారు.

సీఎం పేషీలో ఇష్టారాజ్యం

- ముఖ్యమంత్రికి ఐవైఆర్ లేఖ

అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి కార్యాలయం (సీఎంఓ) లోని అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి ఐవైఆర్ కృష్ణారావు ఫైరయ్యారు. వారు ప్రజాధనాన్ని వేతనాలుగా తీసుకుంటున్నా ఆ మేరకు ముఖ్య మంత్రికి సలహాలివ్వడంలోగాని, ఫైళ్లపై సంతకాలు చేయడంలో గాని సరిగా వ్యవహరించడం లేదన్నారు. ఈ మేరకు ఫిర్యాదు చేస్తూ శనివారం ముఖ్యమంత్రికి ఐవైఆర్ లేఖ రాశారు.

చిత్తూరులో ఘోర ప్రమాదం

- నలుగురు స్పెయిన్ వాసులు, టెంపో డ్రైవర్ మృతి
- పుంగనూరు సమీపంలో ఘటన
- స్పెయిన్ దౌత్య కార్యాలయానికి సమాచారమిచ్చిన అధికారులు

మదనపల్లె: చిత్తూరు జిల్లా మదనపల్లె- పుంగ నూరు జాతీయ రహదారి నెత్తురోడింది. పుంగనూరు మండలంలోని ఈడిగపల్లి పంచాయతి యాతాలవంక మలుపు వద్ద శనివారం ఉదయం ట్రావెలర్ టెంపోను కంటైనర్ ఢీకొన్న ఘటనలో ఐదుగురు మృతి చెందారు. వీరిలో నలుగురు స్పెయిన్ దేశస్తులు కాగా మరొకరు టెంపో డ్రైవర్. మరో తొమ్మిదిమంది తీవ్రంగా గాయపడ్డారు. వీరిని మెరుగైన చికిత్స నిమిత్తం బెంగుళూరు ఆస్పత్రికి తరలించారు. మృతుల్లో స్పెయిన్ దేశానికి చెందిన ఇద్దరు పురుషులు, ఇద్దరు మహిళలు ఉన్నారు. ఘటనా స్థలాన్ని కలెక్టర్ ప్రద్యుమ్న, చిత్తూరు ఎస్‌పి రాజశేఖర్‌బాబు పరిశీలించారు. మృతుల వివరాలను ఢిల్లీలోని స్పెయిన్ దేశ రాయబారి కార్యాలయానికి పంపిస్తామని తెలియజేశారు. స్పెయిన్ దేశం బార్సిలోనాకు చెందిన 13 మంది భారతదేశంలోని గ్రామాల అభివృద్ధిని పరిశీలించేందుకు వచ్చారు. అనంతపురం జిల్లా బత్తలపల్లి ఆర్‌డిటి సంస్థను పరిశీలించారు. అక్కడనుంచి టెంపో ట్రావెలర్‌లో బత్తలపల్లి నుంచి తమిళనాడు రాష్ట్రం తిరుమణ్ణామలైను సందర్శించడానికి బయల్దేరారు. శనివారం ఉదయం 9:30-10 గంటల మధ్య యాతాలవంక మలుపు వద్ద ఎదురుగా వస్తున్న కంటైనర్.. ట్రావెలర్ టెంపోను ఢీకొంది. టెంపో డ్రైవర్ సైషావల్లీతోపాటు స్పెయిన్ దేశస్తులు ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. మదనపల్లి డిఎస్‌పి నారాయణస్వామిరెడ్డి ప్రత్యేక చొరవతో క్షతగాత్రులను మదనపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మరో ఇద్దరు స్పెయిన్ వాసులు మృతి చెందారు. మృతుల పేర్లు ఇవీ.. పురుషులు ఫిరోజ్‌మోరినోవిసెంట్ (50), పెట్రోసజిజాన్ ఫ్రాన్సిస్కో (31), మహిళలు లుపిజ్‌నవరోమారియానివిస్ (62), మోరన్ మోలినిలో జోషిపా (60). వైద్యుల సూచన మేరకు క్షతగాత్రులైన తొమ్మిదిమందిని బెంగుళూరులోని ఎపిఎన్ కొలంబో ఆస్పత్రికి తరలించారు.

గేట్ టాపర్ సుధీర్ ముంబయిలో ఆత్మహత్య!

నెల్లూరు : ఈ ఏడాది గేట్ పరీక్షల్లో ఆలిండియా టాపర్‌గా నిలిచిన కోవూరు సుధీర్ ముంబయ్‌లో అనుమానాస్పదంగా మృతి చెందాడు. శుక్రవారం రాత్రి అక్కడి పొలై షీరా నందనీ గార్డెన్‌లో ఈ విషాదం చోటు చేసుకున్నట్లు తెలిసింది. నెల్లూరులోని సుందరయ్య కాలనీకి చెందిన కోవూరు సుధాకర్, గౌరీలకు పెద్ద కుమారుడు సుధీర్(25) 2017 గేట్ పరీక్షలో ఆల్ ఇండియా ఫస్ట్ ర్యాంకర్‌గా నిలిచాడు. దీంతో అతనికి నెలరోజుల క్రితం బిపిసిఎల్ కంపెనీలో ఉద్యోగం వచ్చింది. నెలకి రూ.55వేల జీతానికి చేరాడు. అతనితో పాటు అదే కంపెనీలో పనిచేస్తోన్న తమిళనాడుకు చెందిన మరో ఉద్యోగితో కలిసి ఉంటున్నాడు. ఉదయం 5.30 గంటలకు నిద్రలేచి ఉద్యోగానికి వెళ్లాల్సి ఉంటుంది. రెండు షిఫ్ట్‌లు పనిచేయాలి. గదిలో ఉన్న వ్యక్తి డ్యూటీకి వెళ్లిపోయాడు. సుధీర్ ఒక్కడే గదిలో ఉన్నాడు. సాయంత్రం 6 గంటలకు సహోద్యోగి వచ్చాడు. ఎంత సేపు తలుపుతట్టినా తీయలేదు. అక్కడున్న వారికి తెలిపాడు. దీంతో అక్కడున్న వారు రాత్రి 7.30 గంటలకు గది తలుపులు పగులగొట్టి చూశారు.

కాళేశ్వరం భూగర్భ పంప్‌హౌస్ పనులను పరిశీలించిన ఐఏఎస్ అధికారుల బృందం

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి

కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా కరీంనగర్ జిల్లాలో జరుగుతున్న భూగర్భ పంప్‌హౌస్ పనులను సీనియర్ ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల బృందం శనివారం పరిశీలించింది. పనుల పురోగతి పట్ల ఈ బృందం సంతృప్తి వ్యకం చేసింది. 20 మంది అధికారులు ఈ బృందంలో ఉన్నారు. సీనియర్ ఐఏఎస్ అధికారి, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజేయ్ మిశ్రా ఈ బృందానికి నాయకత్వం వహించారు. చిత్రా రామచంద్రన్, రాజేశ్వర్ తివారీ, రాజీవ్ త్రివేది, శశాంక్ గోయల్, సునీల్ శర్మ, ఆశోక్‌కుమార్, జయేశ్ రంజన్, వికాశ్‌రాజ్, శివశంకర్, బి. వెంకటేశం, అనితా రాజేంద్ర తదితరులు ఈ బృందంలో ఉన్నారు. సిద్దిపేట జిల్లా కోమటిబండ వద్ద జరుగుతున్న మిషన్ భగీరథ పనులను ఈ బృందం సభ్యులు పరిశీలించారు. కరీంనగర్ సమీంపలో కాళేశ్వరం ప్రాజెక్టు ఎనిమిదవ ప్యాకేజీలో జరుగుతున్న పనులను పరిశీలించారు. భూగర్భ పంప్‌హౌస్, సర్జ్‌పూల్, ట్విన్ టన్నెల్స్, 400 కేవీ సబ్‌స్టేషన్, గ్రావిటీ కాల్వలను వీరు పరిశీలించారు. పనుల వివరాలను మెఘా ఇంజనీరింగ్ కంపెనీ ప్రతినిధులు వీరికి వివరించారు. ముఖ్యమంత్రి ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న కాళేశ్వరం పనులను ఆసక్తితో పరిశీలించడానికి వచ్చామని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సర్ఫరాజ్ అహ్మద్ సీనియర్ అధికారులకు భూసేకరణ తదితర విషయాలను వివరించారు. శనివారం ప్రాజెక్టు పనులను పరిశీలించిన వారిలో 11 మంది సీనియర్ అధికారులు, 9 మంది శిక్షణ ఐఏఎస్‌లు ఉన్నారు.

వెటర్నరీ అసిస్టెంట్ పరీక్ష ప్రాథమిక కీ విడుదల

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పశుసంవర్ధక శాఖలో 541 వెటర్నరీ అసిస్టెంట్ పోస్టులకు గతనెల 23న నిర్వహించిన రాతపరీక్ష ప్రాథమిక కీని తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) శనివారం విడుదల చేసింది. ప్రాథమిక కీ వెబ్‌సైట్‌లో పొందుపరిచామని టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి ఎ వాణీప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్ పద్ధతిలో ప్రాథమిక కీపై అభ్యంతరాలు ఈనెల 8 నుంచి 16వ తేదీ వరకు సమర్పించడానికి గడువుందని పేర్కొన్నారు. తెలుగు, ఇంగ్లీష్‌లో అభ్యంతరాలు సమర్పించడానికి అవకాశముందని తెలిపారు. గతనెల 23న జరిగిన రాతపరీక్షకు 4,230 మంది అభ్యర్థులు దరఖాస్తు చేయగా, ఉదయం 3,889 (91.93 శాతం) మంది, మధ్యాహ్నం 3,883 (91.79 శాతం) మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు.

మెరిట్ స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ (ఎంహెచ్‌ఆర్డీ) ఇస్తున్న మెరిట్ స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ఇంటర్ బోర్డు ప్రకటించింది. 2017-18 విద్యాసంవత్సరానికి చెందిన కొత్త విద్యార్థులు అక్టోబర్ 31 నాటికి దరఖాస్తు చేయాలని ఇంటర్ బోర్డు కార్యదర్శి ఎ అశోక్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణులైన విద్యార్థులు ఉన్నత విద్య చదివే వారు మెరిట్ స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తు చేసేందుకు అర్హులని పేర్కొన్నారు. ఇప్పటికే అందుకు అర్హులైన విద్యార్థుల వివరాలను ఇంటర్ బోర్డు **bie.telangana.gov.in** వెబ్‌సైట్‌లో పొందుపరిచామని తెలిపారు. అర్హులైన వారు ఆన్‌లైన్ (http://scholarships.gov.in) వెబ్‌సైట్ దరఖాస్తు చేయాలని సూచించారు. కొత్త విద్యార్థులు అక్టోబర్ 31 నాటికి, 2016-17 విద్యార్థులు మొదటి రెన్యువల్ చేసేవారు, 2015-16 విద్యాసంవత్సరానికి చెందిన రెండో రెన్యువల్ చేసే వారు ఈనెల 31వ తేదీ నాటికి దరఖాస్తు చేయాలని సూచించారు. ఎంహెచ్‌ఆర్డీ మెరిట్ స్కాలర్‌షిప్‌లను తెలంగాణకు 2,570 మంది విద్యార్థులకు కేటాయించిందని తెలిపారు. అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

కన్నకూతురుపై లైంగికదాడి

నవతెలంగాణ- హయత్‌నగర్

ఆధునిక యుగంలో మానవత్వపు విలువలు మంటకలిసి పోయాయి. కన్నకూతురిపై తండ్రే లైంగికదాడి చేశాడు. ఈ దుర్ఘటన గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో శనివారం వెలుగులోకి వచ్చింది. నిందితున్ని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వనస్థలిపురం ఏసీపీ రవీందర్‌రెడ్డి వివరాల ప్రకారం... అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కుంట్లూరు గ్రామంలోని గణేష్‌నగర్ కాలనీకి చెందిన మీసాల మధుసూదన్ అలియాస్ మధు(38), సరోజ దంపతులకు ఇద్దరు కూతుర్లు, ఓ కొడుకు ఉన్నారు. పెద్ద కుమార్తె (13) ఏడో తరగతి చదువుతోంది. గతనెల 27న ఇంట్లో ఎవరూ లేని సమయంలో పెద్దకూతురుపై తండ్రి లైంగికదాడి చేశాడు. సాయంత్రం తల్లి సరోజ ఇంటికి రాగానే ఆ బాలిక జరిగిన విషయాన్ని చెప్పింది. సరోజ తన అత్త,మామలకు చెప్పగా వారు పట్టించుకోలేదు. దీంతో ఆగస్టు ఒకటో తేదీన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో సరోజ ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు శనివారం మధుసూదన్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

సీఆర్‌టీలు కాదు.. గెస్ట్‌టీచర్లు

కొత్త కేజీబీవీ నియామకాల్లో విద్యాశాఖ వింత నిర్ణయం

- తక్కువ మార్కులు వచ్చిన అభ్యర్థులకు షాక్
- మరోసారి పరీక్షకు అధికారుల సన్నద్ధం!

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

కొత్తగా ఏర్పాటు చేసిన కస్తూర్బాగాంధీ బాలికల గురుకులాల్లో సర్వశిక్షా అభియాన్(ఎస్-ఎస్ఏ) అధికారులు వింత నిర్ణయం తీసుకున్నారు. నోటిఫికేషన్‌లో కాంట్రాక్టు రెసిడెన్షియల్ టీచర్ (సీఆర్‌టీ) పోస్టుల కోసం రాత పరీక్ష నిర్వహించి, వారిలో తక్కువ మార్కులు వచ్చిన వారిని గెస్ట్ టీచర్లుగా నియమించారు. దీంతో తాము రాసిన పరీక్ష ఏంటీ, ఇచ్చిన పోస్టు ఏంటో అర్థంకాక అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పోస్టుకు తక్కువ వేతనం ఉండటంతో చాలామంది విధులు నిర్వహించేందుకు ఆసక్తి చూపడం లేదు.



రాష్ట్రంలో ఈ విద్యాసంవత్సరం కొత్తగా ప్రారంభమైన 84 కేజీబీవీల్లో పోస్టుల భర్తీ కోసం పాఠశాల విద్యాశాఖ జూన్ 22న రాతపరీక్ష నిర్వహించింది. 84 స్పెషల్ ఆఫీసర్ (ఎస్‌ఓ) పోస్టులకు 4,181మంది, 504 కాంట్రాక్టు గురుకుల టీచర్ (సీఆర్‌టీ) పోస్టులకు 11,331మంది దరఖాస్తు చేసుకున్నారు. ఈ పోస్టుల నియామకపు ప్రక్రియ జూలై 7లోగా పూర్తికావాల్సి ఉంది. కానీ చాలా జిల్లాల్లో జూలై నెలాఖరు వరకూ సాగింది. మరో రెండు జిల్లాల్లో ఇంకా కొనసాగుతూనే ఉన్నది. ఈ పోస్టులన్నీ రోస్టర్ ప్రకారం అధికారులు భర్తీ చేశారు. అయితే పరీక్ష నిర్వహణ సమయంలో ఎక్కడా క్వాలిఫై మార్కుల విషయాన్ని ప్రస్తావించలేదు. దీంతో మెరిట్ ఆధారంగా ఈ పోస్టులను భర్తీ చేస్తారని అందరూ భావించారు. అయితే పలు జిల్లాల్లో 35 శాతం కంటే ఎక్కువ మార్కులు వచ్చిన అభ్యర్థులను సీఆర్‌టీలుగా, అంతకంటే తక్కువ మార్కులు వచ్చిన వారిని గెస్ట్‌టీచర్లుగా నియమిస్తూ ఆర్డర్‌కాపీలను అందించారు. గెస్ట్‌టీచర్లుగా ఎంపికైన అభ్యర్థులు ఆ ఆర్డర్‌కాపీలను చూసి షాక్‌కు గురయ్యారు. నోటిఫికేషన్‌లో కేవలం లోకల్ అభ్యర్థులకు అని మాత్రమే నిబంధన పెట్టారనీ, క్వాలిఫై మార్కుల ప్రస్తావన ఎక్కడా చేయలేదని వారు చెబుతున్నారు. నిర్మల్ జిల్లాలో ఐదు కేజీబీవీల్లో 30 మంది సీఆర్‌టీ పోస్టుల్లో 9మంది గెస్ట్ టీచర్లను నియమించారు. ఇలా దాదాపు అన్ని జిల్లాల్లోనూ ఇదే పరిస్థితి. రాష్ట్ర ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ మేరకు గెస్ట్‌టీచర్ల ఆర్డర్స్ ఇచ్చినట్టు జిల్లాల్లో అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం సీఆర్‌టీలకు రూ.15వేల వేతనం ఉన్నది. దాన్ని త్వరలో రూ.20వేలకు వేతనం పెంచుతామని ప్రభుత్వం ప్రకటించింది. అయితే గెస్ట్ టీచర్లకు కేవలం రూ.5వేల వేతనం ఉండటంతో వారంతా విధుల్లో కొనసాగడానికి ఇష్టపడటం లేదు. పరీక్ష కూడా ఇంగ్లీష్‌లో నిర్వహిస్తామని చెప్పి, హిందీ సబ్జెక్టు వారిలో హిందీలో, తెలుగు సబ్జెక్టు వారికి తెలుగులోనే నిర్వహించారని అభ్యర్థులు ఆరోపిస్తున్నారు.

సీఆర్‌టీలుగా గుర్తించాలి : ఓ అభ్యర్థిని, నిర్మల్ జిల్లా

నోటిఫికేషన్‌లో క్వాలిఫై మార్కులను సూచించకుండా, పోస్టుల భర్తీ సమయంలో దీన్ని తెరమీదికి తేవడం సరికాదు. కొద్దిమార్కుల తేడాతో రాష్ట్రంలో చాలా మంది అభ్యర్థులను గెస్ట్‌టీచర్లుగా నియమించారు. గతంలో ప్రభుత్వం నిర్వహించిన డీఎస్సీల్లో అతితక్కువ మార్కులు వచ్చినా అభ్యర్థులనూ గవర్నమెంట్ టీచర్లుగా నియమించారు. కేవలం కాంట్రాక్టు టీచర్ పోస్టుకు క్వాలిఫై మార్కుల నిబంధనలు అవసరమా.? అధికారులు వెంటనే స్పందించి గెస్టు టీచర్లందరినీ సీఆర్‌టీలుగా గుర్తించాలి.

త్వరలో మరో పరీక్ష: శ్రీహరి, కేజీబీవీ రాష్ట్ర ప్రత్యేకాధికారి

కేజీబీవీ సీఆర్‌టీ పోస్టుల భర్తీలో 35శాతం మార్కులు రాని అభ్యర్థులను గెస్ట్‌టీచర్లుగా నియమించాం వీరికి మరో అవకాశమిచ్చేందుకు ఆలోచన చేస్తున్నాం. గెస్ట్‌టీచర్లకు మళ్లీ పరీక్ష నిర్వహించి, క్వాలిఫై అయితే వారిని సీఆర్‌టీలుగా తీసుకుంటాం. త్వరలో పరీక్ష తేదీలు ప్రకటిస్తాం.

పాఠశాల విద్యలో డిటెన్షన్ వద్దు

- పోస్టర్ విడుదల చేసిన టీపీఏ, బీహెచ్‌ఎస్, ఎస్‌ఎఫ్‌ఐ నేతలు

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

పాఠశాల విద్యలో 5,8 తరగతుల్లో డిటెన్షన్ విధానం ప్రవేశపెట్టాలనే ఆలోచనను కేంద్ర ప్రభుత్వం విరమించుకోవాలని తెలంగాణ తల్లిదండ్రుల సంఘం(టీపీఏ), బాలల హక్కుల సంఘం(బీహెచ్‌ఎస్), భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్‌ఎఫ్‌ఐ) రాష్ట్ర కమిటీలు కోరాయి. ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు గానూ డిటెన్షన్ విధానంపై తయారు చేసిన పోస్టర్‌ను శనివారం హైదరాబాద్‌లో ఆయా సంఘాల నేతలు విడుదల చేశారు. ఈ సందర్భంగా విద్యావేత్త నాగటి నారాయణ, బాలల హక్కుల సంఘం గౌరవ అధ్యక్షులు అచ్చుతరావు మాట్లాడుతూ...దేశంలో అక్షరాస్యత 60-70శాతమే ఉన్నదనీ, కొన్ని రాష్ట్రాల్లో 50శాతం కూడా లేదని అన్నారు. డిటెన్షన్ విధానం అమలు చేస్తే అక్షరాస్యత మరింత పడిపోయి, బాలకార్మికులు పెరిగే అవకాశముందని తెలిపారు. తల్లిదండ్రుల సంఘం రాష్ట్ర కార్యదర్శి పగడాల లక్ష్మయ్య, ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర బాలికల విభాగం కన్వీనర్ రజిని, బాలల హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు అనురాధరావు, ఎస్‌ఎఫ్‌ఐ నేతలు జావీద్, అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సింగరేణిలో సోలార్ ప్లాంట్లు

- 12 ఏరియాల్లో పరిశీలన: సీఎమ్‌డీ ఎన్ శ్రీధర్ వెల్లడి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

సింగరేణి కాలరీస్‌లో సోలార్ విద్యుత్‌ప్లాంట్లు నిర్మించనున్నట్టు ఆ సంస్థ సీఎమ్‌డీ ఎన్ శ్రీధర్ తెలిపారు. మొత్తం 12 ఏరియాలను పరిశీలించి, అవకాశం ఉన్న ప్రాంతాల్లో 50 లేదా వంద మెగావాట్ల సోలార్‌ప్లాంట్ల ఏర్పాటుకు సంబంధించి నివేదికను ఇవ్వాలని ఆయన అధికారుల్ని ఆదేశించారు. శనివారంనాడిక్కడి సింగరేణి భవన్‌లో సోలార్ విద్యుత్‌ప్లాంట్ల నిర్మాణంపై రాష్ట్ర సంప్రదాయ ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ, సోలార్ పరికరాలను తయారుచేసే బీహెచ్‌ఈఎల్ ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. ఇరు సంస్థల అధికారులు సోలార్ ప్లాంట్ల నిర్మాణం, ఆదాయం-వ్యయం, వాటి పనితీరు, ప్రయోజనాలు తదితర అంశాల్ని పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం జైపూర్ థర్మల్ విద్యుత్కేంద్రాల పనితీరును సమీక్షించారు. ఈ ప్రాజెక్ట్ రెండు యూనిట్ల ద్వారా ఇప్పటి వరకు 7,255 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి చేసి రాష్ట్రానికి 6,757 మి.యూ., అందించినట్టు వివరించారు. ఏటా సగటున తప్పనిసరిగా 95 శాతం పిఎల్‌ఎఫ్‌ను సాధించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. సమావేశంలో డైరెక్టర్ (ఈ అండ్ ఎమ్) ఎస్ శంకర్, కోఆర్డినేటింగ్ అధికారి లక్ష్మీనారాయణ, ఈడీ సంజయసూర్, ఎస్‌టీపీపీ జీఎమ్ రాజేష్, ఓ అండ్ ఎమ్ చీఫ్ జెఎన్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయంలో శ్రమ దోపిడీ

- ప్రశ్నించిన సిబ్బందిని తొలిగించిన కాంట్రాక్టర్
- కార్మికుల మొర ఆలకించని కార్మిక మంత్రి

నవతెలంగాణబ్యూరో - హైదరాబాద్

సచివాలయం సాక్షిగా కార్మికులు శ్రమదోపిడీకి గురవుతున్నారు. ప్రభుత్వ యంత్రాంగానికి గుండెకాయలాంటి సెక్రటేరియేట్‌లోనే కార్మిక హక్కులు అమలుకు నోచుకోవడం లేదు. న్యాయం చేయాలని కార్మికులు కార్మిక శాఖ మంత్రిని కోరినా ఆయన కానీ ఆశాఖ ఉన్నతాధికారులు కానీ ఏమాత్రం స్పందించకపోవడం గమనార్హం. సచివాయలంలో పారిశుద్య కార్మికులు (హౌజ్‌కీపింగ్) కాంట్రాక్టర్ ఆధ్వర్యంలో పనిచేస్తుంటారు. ప్రభుత్వం నుంచి ఒక్కో కార్మికునికి తొమ్మిది వేలు చెల్లిస్తున్నా..సదరు కాంట్రాక్టర్ బాబు కమిషన్ పేరుతో భారీగా కోత కోసి ఆరువేలే చెల్లిస్తున్నారు. దీనిపై చాలా కాలం నుంచి కాంట్రాక్టర్‌ను కార్మికులు అడుగుతున్నా చూద్దాం అంటూ కాలయాపన చేస్తున్నారు. ఇందులో కొంతమందికి ఎక్కువ జీతాలు, మరికొంత మందికి తక్కువ జీతాలు చెల్లించడంతో కార్మికుల మధ్య చిచ్చు రేగింది. అదేమని కాంట్రాక్టర్‌ను ప్రశ్నించినా సమాధానం లేకపోవడంతో సహనం కోల్పోయిన కార్మికులు సచివాలయంలో ఆందోళనకు దిగారు. విధులు నిర్వహిస్తూనే నిరసన తెలిపారు. దీంతో కార్మికులపై బెదిరింపుల పర్వం మొదలయింది. గురువారం సచివాలయంలో తన కార్యాలయానికి వచ్చిన కార్మిక శాఖ మంత్రి నాయిని నర్సింహారెడ్డిని కలిసి తమ గోడు చెప్పుకొనేందుకు కార్మికులు ఆయన ఆఫీసుకు వెళ్ళినా మంత్రి కలవలేదు. కార్యాలయ అధికారులను న్యాయం చేయాలని కోరారు. కమీషన్ల పేరుతో శ్రమ దోపిడీకి గురవుతున్నామని, ప్రభుత్వం ఇస్తున్న పూర్తి జీతం తమకు ఇప్పించాలని వేడుకున్నారు. మంత్రి ద్వారా న్యాయం జరుగుతుందని భావించిన కార్మికులు..ఉద్యోగాలనే కోల్పోవాల్సి వచ్చింది. ప్రశ్నించిన కార్మికులందరినీ కాంట్రాక్టర్ విధుల నుంచి తొలిగించారు. తర్వాతి రోజు సచివాలయంలోకి రావడానికి కూడా వారికి అనుమతించలేదు. సెక్యూరిటీ సిబ్బందికి చెప్పి కార్మికులను గేటు బయటే ఉంచి తీవ్ర అవమానానికి గురి చేశారు. ఇంత జరిగినా కార్మిక శాఖ మంత్రి స్పందించలేదు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన హామీ అమలు చేయమని అడిగితే కడుపు మీద కొట్టారని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాంట్రాక్టు కార్మికులందరికీ పూర్తి జీతాలు చెల్లించాలని, కమీషన్లతో కోత పెట్టవద్దని కేసీఆర్ ఆదేశించినా కాంట్రాక్టర్‌లు మాత్రం వాటిని పట్టించుకోవడం లేదు. సచివాలయంలోనే పరిస్థితి ఈవిధంగా ఉంటే రాష్ట్ర వ్యాప్తంగా ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. కాంట్రాక్టర్లపై ప్రభుత్వ అధికారులు నియంత్రణ కోల్పోయారని, దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించ లేదు అన్న చందంగా కార్మికుల పరిస్థితి ఉందని కార్మిక సంఘాల నాయకులు అంటున్నారు. సచివాలయంలో జరిగే శ్రమదోపిడీ గురించి చెప్పడానికి కూడ ఆ కార్మికులు భయపడుతున్నారు. ప్రస్తుతం ఉద్యోగాలు కోల్పోయిన సిబ్బంది కూడా పేర్లు చెప్పేందుకు జంకుతున్నారు. ఉద్యోగాలు పోతే కుటుంబాలు రోడ్డున పడతాయని, మళ్ళీ కాంట్రాక్టర్ కొలువుకు పిలుస్తాడనే ఆశతో వారు ఎదురు చూస్తున్నారు. ఇదే విషయంపై కాంట్రాక్టర్‌ను స్పందించాల్సిందిగా కోరగా..అంతా సవ్యంగానే ఉందన్నారు.కార్మికులను తొలిగించిన విషయంపై మాట్లాడేందుకు ఆయన నిరాకరించారు.

నర్మద నిర్వాసితులకు పునరావాసం కల్పించాలి

సంఘీభావ సదస్సులో వక్తల డిమాండ్

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి




సర్దార్ సరోవర్ ప్రాజెక్టు నిర్వాసితులకు వెంటనే పునరావాసం కల్పించాలని వివిధ సంఘాల నేతలు డిమాండ్ చేశారు. ప్రజా ఉద్యమాల జాతీయ వేదిక, మానవ హక్కుల న్యాయ సంస్థ శనివారం నిర్వహించిన నర్మద ఉద్యమ సంఘీభావ సదస్సులో పలువురు వక్తలు మాట్లాడారు. మధ్యప్రదేశ్‌లోని నర్మదా నదిపై నిర్మించిన సర్దార్ సరోవర్ ప్రాజెక్టు కింద మధ్యప్రదేశ్, గుజరాత్, మహరాష్ట్రలో 244 గ్రామాలు నీట మునుగుతున్నాయని వారు తెలిపారు. నిర్వాసితులకు సరైన న్యాయమైన నష్ట పరిహారం ఇవ్వాలని 'నర్మదా బచావ్ ఆందోళన్' సంస్థ గత 30 సంవత్సరాలుగా ఆందోళన చేస్తోందని మానవ హక్కుల సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు జీవన్ కుమార్ తెలిపారు. పూర్తిగా పరిహారం అందచేసి, పునరావాస కార్యక్రమాలు కూడా అమలు చేసిన తర్వాతే ప్రాజెక్టు గేట్లు మూయాలని డిమాండ్ చేస్తూ మేధాపట్కర్ గత పది రోజులుగా భోపాల్‌లో చేస్తున్న నిరవధిక నిరాహార దీక్షకు మద్దతు ప్రకటించాలని ఆయన కోరారు. భూమిలేని నిరుపేదలకు, చేతివృత్తుల వారికి న్యాయం చేయాలని, పునరావాస చర్యల పేరుతో జరిగిన అవినీతిపై దర్యాప్తు జరిపించాలని ఆయన కోరారు. సుప్రీం కోర్టు ఆదేశించిందనే నెపంతో నర్మద గేట్లు మూయడానికి ప్రజలను గ్రామాల నుంచి బలవంతంగా తరలించడానికి మధ్యప్రదేశ్ ప్రభుత్వం సైన్యాన్ని పిలిపించడం మానవహక్కుల ఉల్లంఘనే అని అన్నారు. సామాజిక కార్యకర్తలు యోగేంద్ర యాదవ్, అరుణారాయ్, సునీలమ్, రాజేందర్ సచార్, నిఖిల్‌డే సహా 50 మంది ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద నిరసన కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. సర్దార్ సరోవర్ ప్రాజెక్టు కింద 20 శాతం మాత్రమే ఆయకట్టు ఉండగా 80 శాతం కార్పొరేట్ పరిశ్రమలకు ఉపయోగపడుతుందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రజల కోసం పనిచేస్తున్న 26 మంది మేధావులు నర్మద నిర్వాసితుల గురించి మాట్లాడటానికి ప్రధాన మంత్రిని కలవాలని కోరినా ఆయన నోరు మెదపడం లేదన్నారు. ప్రజాగాయకురాలు విమలక్క మాట్లాడుతూ సర్దార్ సరోవర్ ప్రాజెక్టు వల్ల మూడు రాష్ట్రాల ప్రజల జీవనవిధానంలో మార్పు వస్తుందన్నారు. పాలకవర్గాల కుటిల నీతికి ఈ ప్రాజెక్టు ఒక ఉదాహరణగా ఆమె అభివర్ణించారు. నర్మద నిర్వాసితుల న్యాయమైన పోరాటానికి మద్దతు ప్రకటిస్తున్నామని ఆమె చెప్పారు. సామాజిక కార్యకర్త సజయ మాట్లాడుతూ తెలంగాణలో కూడా ప్రజా ఉద్యమాల అణచివేత కొనసాగుతున్నదని అన్నారు. ధర్నా చౌక్ మూసివేత ప్రజల గొంతు నొక్కడానికేనన్నారు. ముఖ్యమంత్రి వాడుతున్న పదజాలంపై ఆమె అభ్యంతరం తెలిపారు. దేశంలో భారీ డ్యాంల అవసరం గురించి చర్చ జరగాలని ప్రముఖ పర్యావరణ వేత్త డాక్టర్ బాబూరావు అభిప్రాయపడ్డారు. అమెరికాలో కొన్ని డ్యాంలను కూల్చివేసిన విషయం ఆయన గుర్తు చేశారు. భారీ బ్యాంల నుంచి బొగ్గుపులుసు వాయువు కంటే ప్రమాదమైన మిథేన్ వాయువు వెలువడుతుందని ఆయన తెలిపారు. పర్యావరణం, భూమి అనే పదాలు పాలకులకు గిట్టడం లేదని, కేవలం డబ్బు, మార్కెట్ మాత్రమే పవిత్రమైనవని భావిస్తున్నారని తెలిపారు. పర్యావరణాన్ని నిర్లక్ష్యం చేస్తే ఈ శతాబ్ధంలోనే మానవ సమాజం క్షీణించే అవకాశం ఉన్నదని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారని చెప్పారు. నారాయణస్వామి, జావేద్, జనార్ధనరెడ్డి తదితరులు మాట్లాడారు.

ఇద్దరు లండన్ ప్రొఫెసర్లు అరెస్ట్

వాషింగ్టన్ : అమెరికా పౌరుని హత్య కేసులో ఆరోప ణలు ఎదుర్కొంటున్న ఇద్దరు ప్రొఫెసర్లను అరెస్ట్ చేసినట్టు చికాగో పోలీస్ ప్రతినిధి ఆంథోనీ తెలిపారు. అనుమానితులిద్దరూ లండన్‌లోని ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాల యంలో ప్రొఫెసర్లుగా పనిచేస్తున్నారని అన్నారు. గతనెల 27న చికాగోలో ట్రెంటన్ జేమ్స్ (26) అనే యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. హత్య చేసిన నిందితులను సీసీటీవీ ఫుటేజ్‌ల ఆధారంగా గుర్తించినట్టు పోలీసులు తెలిపారు. కాగా, జేమ్స్‌ను హత్య చేసినట్టు విందమ్ గుగ్లీల్మీ (42), ఆండ్రీవ్ వారెన్ (56) అనే నిందితులిద్దరూ ప్రాథమిక విచారణలో అంగీకరించినట్టు ఆంథోనీ తెలిపారు. నిందితులను సోమవారం కోర్టులో హాజరుపరుస్తామని అన్నారు.

ఫిలిప్పీన్స్‌లో భూకంపం

- రిక్టర్ స్కేల్‌పై తీవ్రత 5.8గా నమోదు



మనీలా : ఫిలిప్పీన్స్‌లోని మిందానో ప్రాంతంలో భూకంపం సంభవిం చింది. రిక్టర్‌స్కేల్‌పై దీని తీవ్రత 5.8గా నమోదైందని యూఎస్ జియోలజికల్ సర్వే అధికారులు తెలిపారు. జనరల్ సాంటస్ నగరంలో 74.4కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రాన్ని గుర్తించామని అన్నారు. భూప్రకంపనలు రావడంతో ప్రజలు వీధుల్లోకి పరుగులు తీశారని అన్నారు. అయితే, భూకంపం కారణంగా ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం సంభవించలేదని చెప్పారు.

వలసదారులకు ట్రంప్ షాక్

- ఐదేండ్ల వరకు సంక్షేమ పథకాలు వర్తించవు

వాషింగ్టన్ : తమ దేశానికి వలస వచ్చే విదేశీయులకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో షాకిచ్చారు. తమ దేశానికి వచ్చే వలసదారులు తొలి ఐదేండ్లలో ఎలాంటి సంక్షేమ పథకాలు పొందలేరని ట్రంప్ స్పష్టం చేశారు. 'మీరు మా దేశానికి వచ్చిన తర్వాత తొలి ఐదేండ్ల వరకు ఎలాంటి సంక్షేమ పథకాల ప్రయోజనాలను పొందడం ఇకపై ఉండదు' అని ట్రంప్ పేర్కొన్నారు. ప్రతివారం నిర్వహించే వెబ్, రేడియో కార్యక్రమంలో భాగంగా ఆయన ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. 'ఐదేండ్లపాటు మా సంక్షేమ పథకాలను అడగటం కానీ, వినియోగించుకోవడం కానీ చేయబోనని మీరు చెప్పాల్సి ఉంటుంది.

కాంగ్రెస్‌లో చేసిన నా ప్రసంగంలో చెప్పినట్టు.. అమెరికా ఉన్నతంగా కలలు కంటోంది. సాహసోపేతంగా ముందుకు వెళుతోంది' అని ట్రంప్ అన్నారు. ప్రతిభ ప్రాతిపదికన గ్రీన్‌కార్డులు జారీ చేయాలంటూ రూపొందించిన 'రైజ్'(రిఫార్మింగ్ అమెరికన్ ఇమిగ్రేషన్ ఫర్ స్ట్రాంగ్ ఎంప్లాయ్‌మెంట్) బిల్లుకు ట్రంప్ ఇటీవల మద్దతు తెలిపిన సంగతి తెలిసిందే. ఇన్నాళ్లూ గ్రీన్‌కార్డుల జారీకి అనుసరించిన లాటరీ విధానానికి స్వస్తి పలికి.. ఇక నుంచి ఆంగ్ల భాషా నైపుణ్యం, ఉన్నత విద్య, అధిక వేతనం, వయసు ప్రాతిపదికగా కార్డులు జారీ చేయనుంది. ఇందుకోసం ఉద్దేశించిన 'రైజ్' బిల్లు ఆమోదాన్ని ప్రస్తావిస్తూ అమెరికా సరైన దిశలో సాగుతున్నదని ట్రంప్ అన్నారు. ఈ నూతన విధానం భారతీయులకు వరమేనని భావిస్తున్నా.. ట్రంప్ మాత్రం వలసదారులపై మరిన్ని ఆంక్షలు తప్పవంటూ సంకేతాలు ఇస్తున్నారు.

రష్యాపై అమెరికా ఆంక్షల ప్రభావం లేదు

వీటీసియోమ్ సంస్థ నివేదిక



మాస్కో : రష్యాపై అమెరికా మోపిన ఆంక్షల ప్రభావం ఏమాత్రం ఉండదని వీటీసియోమ్ అనే సంస్థ పేర్కొన్నది. ఈ మేరకు ఆ సంస్థ నిర్వహించిన సర్వేకు సంబంధించిన నివేదికను విడుదల చేసింది. దానిలోని వివరాల ప్రకారం... రష్యాపై ఆంక్షలు మోపడం అమెరికా సర్కార్ తొందరపాటు నిర్ణయమని అభిప్రాయపడింది.

ఈ నిర్ణయంతో ట్రంప్‌లో అసంతృప్తి రోజురోజుకి పెరగడం ఖాయమని ఆ సంస్థ జోస్యం చెప్పింది. రష్యాపై అమెరికా ఆంక్షలు మోపిన విషయం గురించి ఇప్పటికే 68శాతం మందిలో అవగాహన ఉన్నట్టు గుర్తించామని తెలిపింది. కేవలం 32శాతం మంది మాత్రమే అమెరికా నిర్ణయం గురించి విస్మయాన్ని వ్యక్తం చేశారని తెలిపింది. మిగతా వారంతా అమెరికా కపటనాటకాలు తమకు తెలుసనే అభిప్రాయాలు వ్యక్తపరిచారని పేర్కొన్నది. అమెరికా ఆంక్షలతో రష్యా విదేశాంగ విధానంలో ఎలాంటి మార్పు ఉండబోదని 48 శాతం మంది, ఆంక్షల ప్రభావం రష్యాపై కచ్చితంగా ఉంటుందని 28శాతం మంది, తాజా ఆంక్షలతో రష్యాకు మేలు చేకూరుతుందని 9శాతం మంది సర్వే నిర్వాహకుల తో చెప్పారు. అమెరికా మోపిన ఆంక్షలతో నిత్యావసర ధరలు పెరుగుతాయని 18 శాతం మంది రష్యన్లు ఆందోళన వ్యక్తం చేయగా, మరో 79 శాతం మంది రష్యాపై ప్రభావం ఉండదని అభిప్రాయపడ్డారు.

కాగా, అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రష్యా జోక్యం చేసుకున్నదనే విమర్శలు వినిపిస్తున్నాయి. అధ్యక్ష ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లో పాల్గొన్న ట్రంప్.. రష్యా అధ్యక్షుడిపై ప్రశంసలు కురిపించారు. తాను దేశాధ్యక్షుడిగా ఎన్నికైనట్టయితే అమెరికా- రష్యా ద్వైపాక్షిక సంబంధాలు బలోపేతం చేస్తానని పేర్కొన్నారు. ఈ పరిణామాన్ని యూఎస్ సెనెట్ ఏమాత్రం జీర్ణించుకోలేకపోతున్నది. పుతిన్‌తో ట్రంప్ దోస్తీని దూరం చేయాలని ధృడంగా నిశ్చయించుకుని రష్యాపై ఆంక్షలు మోపాలనే బిల్లును తెరపైకి తెచ్చింది. ఈనెల 2న ట్రంప్ ఈ బిల్లుపై సంతకం చేశారు.

యూఎస్-మెక్సికో సరిహద్దులో

పెరిగిన శరణార్థుల మరణాలు

వాషింగ్టన్ : అమెరికా-మెక్సికో సరిహద్దులో శరణార్థుల మరణాలు పెరిగిపోవడం పట్ల అంత ర్జాతీయ శరణార్థి సంస్థ (ఐఓఎం) ఆందోళన వ్యక్తం చేస్తున్నది. ఈఏడాది జనవరి నుంచి జూలై31 నాటికి 232 మంది శరణార్థులు మృతి చెందారని తెలిపింది. డీహైడ్రేషన్, వడదెబ్బ, హైపోథర్మియా, ప్రతికూల వాతావరణం తదితర కారణాలతో శరణా ర్థులు మృతి చెందినట్టు నిర్ధారించింది. అంతేగాకుం డా, ఈ సరిహద్దులో మాదకద్రవ్యాల అక్రమ రవాణా యథేచ్ఛగా కొనసాగుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని తెలిపింది. పలు డ్రగ్స్ ముఠాలు శరణార్థులను అక్రమ రవాణా కార్యకలా పాల కోసం వినియోగించుకోవడం బాధాకరమని తెలిపింది. కాగా, అమెరికా-మెక్సికో సరిహద్దులో గోడను నిర్మించి మాదక ద్రవ్యాల అక్రమ రవాణా దారులను అరికడతానని అధ్యక్ష ఎన్నికల సమ యంలో ట్రంప్ ఊదరగొట్టారు. ఈ ప్రతిపాదనకు మెక్సికో నుంచి స్పందన కరువైంది. గోడ నిర్మాణానికి అవసరమైన డబ్బులు చెల్లించలేమని ఆదేశం తేల్చి చెప్పింది. సరిహద్దు గోడ నిర్మాణానికి 1.6 బిలియన్ డాలర్లు కేటాయించాలని ప్రతినిధుల సభ ట్రంప్‌ను కోరింది. టెక్సాస్‌లోని రియో గ్రాండ్ వ్యాలీలో 45 కిలోమీటర్ల గోడ నిర్మించాల్సిన అవసరముందని అభిప్రాయపడింది.



ఆర్మీలో మైనర్లను చేర్చుకోవద్దు

- బ్రిటన్ మాజీ సైనికాధికారులు



లండన్ : ఆర్మీలో మైనర్లను చేర్చుకోవద్దని బ్రిటన్ మాజీ సైనికాధికారులు ప్రభుత్వాన్ని కోరారు. సైన్యంలో 18ఏండ్ల లోపువారి నియామకాలకు ఇకపై మంగళం పాడాలని అభ్యర్థించారు. చిన్న వయస్సులో సైన్యంలో చేరినవారిలో మానసిక ఎదుగుదల సక్రమంగా ఉండదని వారు అభిప్రాయపడ్డారు. వెటరన్స్ ఫర్ పీస్ సంస్థ తాజా నివేదిక ప్రకారం..ప్రతీ 100 మంది బ్రిటిష్ సైనికుల్లో 67 మంది మైనర్లు ఉన్నారు. అయితే, యుక్త వయసుకు చేరుకున్న తర్వాతే వారిని అంతర్గత భద్రత, సరిహద్దు పరిరక్షణ తదితర విధులు కేటాయిస్తున్నారు. ఆర్మీ శిక్షణకు సంబంధించి ఆ సంస్థ 72 పేజీల నివేదికను విడుదల చేసింది. మైనర్లను చేర్చుకోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నది.కాగా, మైనర్లను సైన్యంలో చేర్చుకున్నట్టయితే వారిలో దేశభక్తి భావాలు పెరుగుతాయని వాయిన్ షరాక్ అనే సైనికుడు అభిప్రాయపడ్డాడు. తాను 17 ఏండ్ల వయసులో ఉన్నప్పుడు ఆర్మీలో చేరానని అన్నారు. అయితే, నాటి పరిణామాలకు ప్రస్తుత పరిస్థితులకు చాలా తేడా ఉందన్నారు. ఇటీవలి కాలంలో బ్రిటన్ ఆర్మీ సంస్కరణలు చేపట్టిందన్నారు. చిన్న వయసులో చేరడంతో పలు సమస్యలు ఎదుర్కొన్న మాట వాస్తవమేనని చెప్పుకొచ్చారు. మైనర్లను సైన్యంలో చేర్చుకోకపోవడమే సముచితమని స్కాటిష్ నేషనలిస్ట్ పార్టీ అభిప్రాయపడింది. దేశభక్తి భావాలున్నవారికే సైన్యంలో తొలి ప్రాధాన్యం కల్పిస్తున్నామని ఆదేశ రక్షణ శాఖ పేర్కొన్నది. మైనర్లు సైన్యంలో చేరిన తర్వాత వారికి శిక్షణ ఇస్తున్నామని తెలిపింది. 18ఏండ్లు దాటిన వారి సేవలను వినియోగించుకుంటున్నామని తెలిపింది.

సోమాలియాలో కారు బాంబు పేలుడు

- ఒకరి మృతి

మొగధీషు : సోమాలియా రాజధాని మొగధీషులో కారు బాంబు పేలింది. ఈ ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందగా, మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రున్ని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

పేలుడు సంభవించిన సమయంలో ఘటనాస్థలంలో ఎక్కువ మంది లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటనకు బాధ్యత వహిస్తున్నట్టు ఏ ఉగ్రసంస్థ కూడా ప్రకటించుకోలేదు. అయితే, ఈ ప్రాంతంలో అల్‌షాబాబ్ ఉగ్రసంస్థ కార్యకలాపాలు అధికంగా ఉన్నాయి. గతంలో జరిగిన ఆత్మాహుతి దాడులకు బాధ్యత వహిస్తున్నట్టు ఆ సంస్థ ప్రకటించుకున్నది. దీంతో, ఆసంస్థ సభ్యులే ఈ పేలుడుకు పాల్పడి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు.

ఉత్తర కొరియాపై ఆంక్షలకు అమెరికా కుట్ర

ప్యాంగాంగ్ : ఉత్తర కొరియాపై ఆంక్షలు మోపేందుకు అగ్రరాజ్యం కుట్ర పన్నింది. ఈ మేరకు ఐరాస భద్రతా మండలిలో ఓటింగ్ నిర్వహిం చినట్టు సమాచారం. కాగా, ఉత్తరకొరియా గతనెల రెండు బాలిస్టిక్ క్షిపణులు ప్రయోగించిన సంగతి తెలిసిందే. ఉత్తర అమెరికాలోని భూభా గంలోని లక్ష్యాలను సైతం అవలీలగా ఢీకొనగలమని ప్రకటించింది. దీంతో, అమెరికాలో గుబులు మొదలైంది. ఉత్తర కొరియా చర్యలను నియంత్రించకపోతే తమకే ప్రమాదమని భావించి తాజాగా భద్రతా మండలిలో ఈ అంశంపై కూలంకుషంగా చర్చించింది. ఐరాస భద్రతా మండలిలోని 15 సభ్య దేశాలకు ఓ ముసాయిదాను అందజేసింది. అంతే గాకుండా, ఉత్తర కొరియా చర్యలను నియంత్రించాలని చైనాను కోరింది. అయితే, ఈ ప్రతిపాదనకు 9దేశాలు ఆమోదించాల్సి ఉంటుంది. ఉత్తర కొరియా ఐరాస ఆంక్షలను బేఖాతరు చేస్తోందని అమెరికా ఆరోపిస్తున్నది.

స్విట్జర్లాండ్‌లో కూలిన విమానం

- పైలట్ సహా ఇద్దరు మృతి

మాడ్రిడ్ : స్విట్జర్లాండ్‌లో ఓ లఘు విమానం ప్రమాదవశాత్తూ కూలింది. ఈ ఘటనలో పైలట్ సహా ఇద్దరు మృతి చెందారు. మృతుల్లో ఓ మైనర్ బాలుడు కూడా ఉన్నాడు. మరో మైనర్ బాలిక తీవ్రంగా గాయపడింది. క్షతగాత్రురాలిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. విమానం టేక్ ఆఫ్ అయిన 10నిమిషాల తర్వాత డియోవోలేజా ప్రాంతంలో కుప్పకూలినట్టు అధికారులు గుర్తించారు. ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు.

అమెరికా అధ్యక్షుని భద్రత కోసం రెండు బోయింగ్ విమానాలు

- ఒక్కో విమానం ధర రూ.2,462 కోట్లు

వాషింగ్టన్ : అమెరికా అధ్యక్షుడి ట్రంప్ భద్రత కోసం బోయింగ్ నుంచి రెండు జంబో జెట్ విమానాలు కొనాలని అమెరికా వాయు సేన నిర్ణయించుకున్నది. కొత్త ఎయిర్‌ఫోర్స్ వన్ విమానాల ఖర్చును తగ్గించుకోవడానికి మార్గాలను వెతుకుతున్న అమెరికా వాయుసేన.. ఈ రెండు విమానాల కోసం శుక్రవారం ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు వాయుసేన, బోయింగ్ సంస్థల మధ్య చర్చలు జరిగాయని ఈ వ్యవహారంతో సంబంధమున్న ఇద్దరు అధికారులు ధ్రువీకరించారు. ఒక్కో విమానం కొనుగోలు కోసం రూ.2,462కోట్లు ఖర్చు చేయనున్నట్టు తెలిపారు.

అమెరికా అధ్యక్షుడి కోసం కొనుగోలు చేసే కొత్త ఎయిర్ ఫోర్స్ వన్ విమానాల ధర అధికంగా ఉంటుందని డొనాల్డ్ ట్రంప్ గత ఏడాది డిసెంబర్‌లో ట్విటర్‌లో మండిపడిన విషయం తెలిసిందే. ఎక్కువ వ్యయం అయితే ఆర్డర్లను రద్దు చేసుకోవాలని ఆ సమయంలో పేర్కొన్నారు. బోయింగ్ వెబ్‌సైట్‌లో బోయింగ్ 747-8 విమానం ధర 386.8 మిలియన్ డాలర్లుగా (రూ.2,462 కోట్లు) పేర్కొన్నారు. అమెరికా అధ్యక్షునికి అవసరమయ్యే భద్రత, ఇతర సౌకర్యాలు కల్పించడానికి చేసే మార్పులను బట్టి దీని ధర ఇంకా పెరగనుంది.

జగన్‌పై పీఎస్‌లో టీడీపీ ఫిర్యాదు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుపై వైఎస్సార్ కాంగ్రెస్ అధ్యక్షులు జగన్మోహన్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యల నేపథ్యంలో బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో టీడీపీ నేతలు ఫిర్యాదు చేశారు. చంద్రబాబును నడిరోడ్డుపై కాల్చి చంపినా తప్పులేదని బహిరంగసభలో అనడం సరికాదని అభిప్రాయ పడ్డారు. ఈమేరకు టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షులు బీఎన్ రెడ్డి, అధికార ప్రతినిధి ఎన్.దుర్గాప్రసాద్, టీడీపీ లీగల్ సెల్ అధ్యక్షులు గంధం గురుమూర్తి ప్రజలను రెచ్చగొట్టేరీతిలో ప్రసంగాలు చేయడం దారుణమన్నారు. వైఎస్ జగన్‌పై క్రమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జగన్‌కు నేరచరిత్ర ఉన్నందున, తమ నేత చంద్రబాబుకు ప్రాణహాని ఉందని చెప్పారు. ఈమేరకు ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియా క్లిప్పింగ్‌లను పోలీసులకు అందజేశారు. వెంటనే జగన్‌పై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

ఉద్యోగుల పట్ల అసహనమా ?

- వయోపరిమితి పెంచాలి
- కేసీఆర్‌పై సివిల్ ఇంజినీర్ల ఫోరం విమర్శ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సకల జనుల సమ్మెతో తెలంగాణ రావడానికి పూర్తిస్థాయిలో సహకరించిన ఉద్యోగుల పట్ల ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు అసహనం ప్రదర్శించడాన్ని తెలంగాణ రాష్ట్ర సివిల్ ఇంజినీర్ల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు కోదాటి శ్యాంసుందర్ విమర్శించారు. వయోపరిమితి పెంచాలనే డిమాండ్ ఇప్పటిది కాదని, ఎప్పటి నుంచో ఉందనే సంగతిని గుర్తు చేశారు. 42 రోజులు సమ్మె చేస్తే, ఈ మాత్రం ఉద్యోగులకు సాయం చేయరా అంటూ నిలదీశారు. వయోపరిమితిని 58 సంవత్సరాల నుంచి 60 ఏండ్లకు పెంచాలని గతం నుంచే కోరుతున్నామన్నారు. ఉమ్మడి రాష్ట్ర సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి సంబంధిత ఫైలుపై సంతకం పెట్టి ఉంటే ఇప్పుడు ఈ తలనొప్పి ఉండేది కాదన్నారు. బడ్జెట్ లోటు ఉన్నా ఆంధ్రప్రదేశ్‌లో 60 ఏండ్లకు వయోపరిమితిని పెంచడం అభినందనీయమన్నారు. రాష్ట్రం కోసం పోరాడి, ఉద్యమించి, జేఏసీలో పనిచేసిన పాపానికి పక్క రాష్ట్రం ఉద్యోగులు పొందుతున్న సౌకర్యాలను కూడా పొందకూడదా అని ప్రశ్నించారు. . వయోపరిమితి పెంచడం మూలంగా నిరుద్యోగులకు అన్యాయం చేసినట్టు కాదని వివరించారు. పీఆర్సీ బకాయిలు ఇప్పటికి అందని పరిస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. ఒకేచోట భార్యాభర్తలు పనిచేయడానికి అంగీకరించి ఇచ్చిన జీవో అమలుకాకపోవడం పట్ల నిరసన తెలిపారు. సీఎం కేసీఆర్ తన వైఖరీని మార్చుకోవాలని సూచించారు. ఈమేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

ఆర్థిక సహాయ వివరాలను అందించండి

- ఎస్సీ కార్పొరేషన్ వైస్ చైర్మెన్
- జిల్లా అధికారులతో సమీక్ష

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

గత మూడేండ్లుగా రాష్ట్రంలోని నిరుపేదలకు బ్యాంకుల అందజేసిన ఆర్థిక సహాయ వివరాలను అందించాలని ఎస్సీ కార్పొరేషన్ వైస్ చైర్మెన్ లచ్చిరాం భూక్య జిల్లా అధికారులను ఆదేశించారు. శనివారం సంక్షేమ భవన్‌లో వివిధ జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ కార్పొరేషన్ ద్వారా మంజూరైన రుణాలను ఈ నెల 20లోగా అందజేయాలని చెప్పారు. 2017-18 ఆర్థిక సంవత్సరానికి గాను స్వయం ఉపాధి రుణాల కోసం ఈ నెల 15వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే విధంగా జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. గుడుంబా తయారిదారుల పునరావాస పథకం కింద చేపట్టిన చర్యలపై ఆయన సమీక్షించారు. భూ పంపిణీ పథకం కింద భూములను అందజేసిన లబ్దిదారులకు సాగుకు అవసరమైన ఆర్థిక సహాయాన్ని వెంటనే విడుదల చేయాలని ఆయన ఆదేశించారు.



హామీ నిలుపుకున్నాం : జూపల్లి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

విలేజ్ ఆర్గనైజేషన్ల అసిస్టెంట్లకు రూ.3 వేల గౌరవ వేతనం ఇస్తామన్న హామీని నిలుపుకున్నామని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి జూపల్లి కష్ణారావు కోరారు. వీఓఏలకు రూ.3 వేల గౌరవ వేతనాన్ని ఇస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో శనివారం మంత్రి జూపల్లి కృష్ణారావును వీఓఏలు కలిసి కతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ ఏడాది ఏప్రిల్ నుంచే వీఓఏలకు రూ. 3వేల గౌరవ వేతనం వర్తింపజేస్తా మన్నారు. గతంలో సీయం కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు మార్గదర్శకాలు విడుదల చేశామన్నారు. తెలంగాణలోని 18,836 మందికి ప్రయోజనం కలుగుతుందని చెప్పారు. ఇప్పటివరకు వీఓఏల పని సమావేశాలు నిర్వ హించడం, బుక్ కీపింగ్ చేయడమే వీఓఏల బాధ్యతగా ఉండేదన్నారు. ఇకనుంచి ప్రభుత్వ కార్యక్రమాలను విజయవంతం చేయడంలోనూ బాధ్యతాయుతంగా పని చేయాలని కోరారు. ముఖ్యంగా మహిళా సంఘాల్లోని సభ్యులందరినీ అక్షరాస్యులుగా మార్చాలని సూచించారు.

దిక్కుతోచని స్థితిలో రైతులు

- రావుల విమర్శ

నవతెలంగాణ బ్యూరో -హైదరాబాద్

రాష్ట్రంలోని వర్షాభావ పరిస్థితులతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉంటే, ప్రభుత్వాధినేతలు మాత్రం సొంత ప్రచారం చేసుకుంటూ, ప్రతిపక్షాలను దూషిస్తూ కాలయాపన చేస్తున్నారని తెలుగుదేశం పొలిట్‌బ్యూరో సభ్యులు రావుల చంద్రశేఖర్‌రెడ్డి విమర్శించారు. సీఎంకు వ్యవసాయ పంటల పరిస్థితులపై సమీక్ష చేసే తీరికలేకపోవడం దారుణమని వ్యాఖ్యానించారు. శనివారం హైదరాబాద్‌లోని ఎన్టీఆర్‌భవన్‌లో విలేకర్లతో మాట్లాడారు. మంత్రులకు వ్యవసాయ పరిస్థితులపై అవగాహన లేదని, రాష్ట్రంలో 45 లక్షల ఎకరాలకు వరిపంట వేసే అవకాశం ఉండగా, 30 లక్షల ఎకరాల్లో మాత్రమే రైతులు పంటలు వేశారని తెలిపారు. ఆగస్టు నాటికి 40 శాతం తక్కువగా వర్షపాతం నమోదైందన్నారు. ప్రాజెక్టు పేరుతో చెప్పడం లేదంటే ప్రాజెక్టుల అంచనాలను పెంచుకుంటూ పోవడం అనే రెండు కార్యక్రమాలను మాత్రమే చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో నీటి లభ్యతపట్ల సర్కారుకు అవగాహన ఉందా ? అనే అనుమానం కలుగుతున్నదని విమర్శించారు. కర్నాటకలో ఆల్మట్టి నిండి, నారాయణపూర్‌లో నిండినా జూరాల వరకు నీరు రావడం లేదన్నారు. నారాయణపూర్-జూరాల మధ్యలో అనేక ప్రాజెక్టులను కర్ణాటక రాష్ట్రం నిర్మించుకున్నదన్నారు. రాయచూర్ దగ్గర కర్నాటక ప్రభుత్వం కొత్త ప్రాజెక్టును నిర్మిస్తున్నదని ప్రభుత్వ దృష్టికి తీసుకెళితే, అది పావు టీఎంసీ ఉన్న ప్రాజెక్టు కూడా కాదని టీఆర్ఎస్ నాయకులు మమ్మల్ని ఎగతాళి చేశారని విమర్శించారు. నిర్మాణంలో ఉన్న దేవాదుల, ఎస్ఆర్ఎస్పీ ఆధునీకరణ, వరద కాలువ వంటి 34 ప్రాజెక్టులను ప్రభుత్వం పూర్తిచేయలేదన్నారు. ఏడాది కిందట తెలుగుదేశం ప్రభుత్వానికి బహిరంగ లేఖ రాసిందన్నారు. చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు ఆల్మట్టి ఎత్తును 519 మీటర్లకే పరిమితం చేయగలిగామని, ఇప్పుడు కర్నాటక సర్కారు 524 మీటర్లకు పెంచుకుందని ఎద్దేవా చేశారు. ఎత్తు పెంచిన నేపథ్యంలో ముంపుకు గురవుతున్న 65 గ్రామాలకు పరిహారం, పునరావాసం కల్పించి ముందుకు వెళుతున్నదన్నారు. మన రాష్ట్రంలో మాత్రం జిల్లాకు ఒక పునరావాసం ప్యాకేజీ కల్పిస్తూ గందరగోళం సృష్టిస్తున్నదని ఆరోపించారు. సిరిసిల్ల దళితులపై పోలీసులు థర్డ్ డిగ్రీ ప్రయోగించడాన్ని ఖండించారు. ప్రభుత్వమే పనిగట్టుకుని ఇలా చేయించిందని ఆరోపించారు. విలేకర్ల సమావేశంలో మైనారిటీ సెల్ అధ్యక్షులు తాజుద్దీన్ పాల్గొన్నారు.

ఈఎస్ఐ రోగుల వెతలెన్నో!

- ఆస్పత్రుల తారుమారుతో రోగుల పరేషాన్
- నత్త నడకన నాచారం నిర్మాణాలు
- వసతుల లేమి నిజమే : ఆస్పత్రి సూపరింటెండెంట్

ప్రత్యేక ప్రతినిధి, నవ తెలంగాణ

"కొండనాలుకకు మందేస్తే.. ఉన్న నాలిక ఊడిపోయే.." అన్నట్టుగా తయారైంది రాష్ట్రంలో ఎంప్లాయీస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఈఎస్ఐ) ఆధ్వర్యంలో పని చేసే దవాఖానాల పరిస్థితి! రాష్ట్ర రాజధానిలోని సనత్‌నగర్ కేంద్రంగా ఈఎస్ఐ ఆధ్వర్యంలోని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి పని చేసేది. దానిని రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని కార్మిక శాఖ నిర్వహించేది. అలాగే నాచారంలోనూ మరో మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి ఉండేది. దాని నిర్వహణను కేంద్ర కార్మిక శాఖ చూసేది. అయితే అనాలోచితంగా కేంద్ర సర్కార్ సనత్‌నగంలోని స్పెషాలిటీ ఆస్పత్రిని నాచారంలోకి మార్చింది. పూర్వం నుంచి సనత్‌నగర్ కేంద్రంగా అనేక పారిశ్రామిక ప్రాంతాలు విస్తరించి ఉన్నాయి. అప్పట్లో వాటిని దృష్టిలో పెట్టుకునే కార్మిక శాఖ అక్కడ పెద్ద దవాఖానాను ఏర్పాటు చేసింది. దశాబ్దాలుగా అక్కడ పని చేస్తోన్న ఉద్యోగుల పిల్లలు సైతం సనత్‌నగర్ కేంద్రంగా విద్యా, ఉద్యోగ రంగాల్లో కొనసాగుతున్నారు. ఒక్కసారిగా సనత్‌నగర్ ఉద్యోగులను నాచారం ఆస్పత్రికి మార్చడంతో అటు రోగులు.. ఇటు ఉద్యోగులు అనేకానేక ఇక్కట్లను ఎదుర్కొంటున్నారు.

రోగులు పరేషాన్

ఉద్యోగులు పారిశ్రామిక కార్మికులు రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే సనత్‌నగర్ ఆస్పత్రికి వెళ్లే వారు. ప్రస్తుతం దానిని నాచారంకు మార్చడంతో వారంతా అక్కడకు వెళ్లాల్సి వస్తోంది. అది వారికి దూర భారం పెంచింది. దాంతో అనేక మంది వ్యాధిగ్రస్తులు అంత దూరం వెళ్లలేక ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. అప్పో సప్పో చేసి బయట వైద్యులకు చూపించుకుంటున్నారు. మరోవైపు ఉద్యోగులు సైతం ఒక్కసారిగా సనత్‌నగర్ నుంచి నాచారం మారడంతో అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. తీరా నాచారం వెళితే వారిని తిరిగి సనత్‌నగర్ ఆస్పత్రికి రిఫర్ చేస్తున్నారు. నేరుగా సనత్‌నగర్ ఆస్పత్రికి వెళ్తే.. నాచారంలో చూపించుకోవాలని చెప్తున్నారు. సీనియర్ వైద్యుల నుంచి నాలుగో తరగతి ఉద్యోగుల దాకా దాదాపు రోజూ 400 మంది సనత్‌నగర్ పరిసర ప్రాంతాల నుంచి నాచారం ప్రయాణించాల్సి వస్తోంది. కనీసం వారికి సరైన రవాణా సౌకర్యాలు కల్పించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయి. పనివేళల్లో ఆర్టీసీ ప్రత్యేక బస్సులనైనా ఏర్పాటు చేసినా కొద్దిపాటి సౌకర్యం వారికి కలిగేది.

నిర్మాణాల నత్త నడక

నిజానికి సనత్‌నగర్ ఈఎస్ఐప్రాంగణాన్ని కేంద్ర కార్మికశాఖ తీసుకుని బదులుగా తన ఆజమాయిషీలో ఉన్ననాచారం క్యాంపస్‌ను వారికి అప్పగించింది. ఆ సమయంలో ఏడాదిన్నర కాలంలో నాచారం ఆస్పత్రి భవన సముదాయాలకు మరమ్మత్తులతో పాటు సిబ్బందికి క్వార్టర్లను నిర్మించి ఇస్తామని హామీనిచ్చింది. ఒప్పుకున్న 18నెలల కాలంలో 14 నెల లు గడిచిపోయినప్పటికీ ఇంకా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది. పైపెచ్చు నాలుగు అంతస్థులలో ఉన్న నాచారం క్యాంపస్‌లో మూడు అంతస్థులు కూల్చివేశారు. ఇక దాంతో ఇక్కట్లు చెప్పనలవికాకుండా మారాయి. ముందు చూపుగా చాలా కాలం కిందటే నాచారంలో నిర్మాణాలు ప్రారంభించినప్పటికీ.. వాటిలో ఇసుమంతైన పురోగతి లేదు.

రోగులు కిటకిట

ఇక నాచారం ఆస్పత్రి ప్రాంగణంలో కనీస సౌకర్యాలు




నాచారం ఈఎస్ఐ ఆస్పత్రి (ఫైల్)

మృగ్యమయ్యాయి. ఒక మాదిరి పెద్ద వర్షం కురిస్తే చాలు.. పై కప్పుల నుంచి నీరు జాలువారుతోంది. దాంతో రోగులు, వైద్యులు, సిబ్బంది ప్రాణాలరచేత పెట్టుకుంటున్నారు. పాత భవనం పరిస్థితి మరీ ఘోరం! తీవ్రంగా జబ్బుపడిన రోగులను సత్వరం వార్డుల్లోకి తీసుకెళ్లాలంటే అక్కడ లిఫ్టులు లేవు. దాంతో ఎంతో ప్రయాసపడి సహాయకులు మొదటి అంతస్తులోని వార్డుల్లోకి తరలిస్తున్నారు. వైద్యులున్నప్పటికీ, ఆపరేషన్ థియేటర్లు లేక రోగులు నానా అవస్థలు పడుతున్నారు. ఒక హిస్టరెక్టమీ (గర్భసంచి తొలగింపు) ఆపరేషన్ చేయాలంటే బాధితులు ఏకంగా రెండు మూడు నెలలపాటు వేచి ఉండాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. రోజుకు పన్నెండు వందల మందికి పైగా రోగులు సందర్శించే ఆస్ప త్రిలో ఒకే ఒక్క ఎక్స్-రే మిషన్, మరో అబ్డామిన్ స్కానింగ్ యంత్రం మాత్రమే ఉన్నాయి. ఇక రిఫరెల్ కేంద్రాల వద్ద పరిస్థితుల గురించి ఎంత తక్కువ చెప్పుకుంటే అంత మంచిది.

అవును నిజమే : డాక్టర్ పద్మజ

నాచారం ఈఎస్ఐ ఆస్పత్రిలో పలు ఇబ్బందులు ఉన్నమాట వాస్తవమేనని సూపరింటెండెంట్ డాక్టర్ పద్మజ అంగీకరించారు. వివరణ కోరిన 'నవ తెలంగాణ'తో సంభాషిస్తూ తమకు ఇచ్చిన గడువు మేరకు నిర్మాణాలు పూర్తి చేసి ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మూడంస్థుల నిర్మాణాలను ఎందుకు కూల్చారో తెలియదన్నారు. గత అయిదేళ్లుగా నిర్మాణాలు నత్తనడకన సాగుతున్నాయని.. అవి పూర్తి కావడంపై స్పష్టత కొరవడిందన్నారు. మందులు నిల్వ చేసేందుకు సైతం స్టోర్ రూమ్‌ల కొరత వేధిస్తోంది.



500 పడకల ఆస్పత్రిలో 200 మంది రోగులకు సైతం సరిపడు వసతులు లేవు. రక్తనిధి లేకపోవడంతో అనివార్యంగా ప్రైవేట్ కేంద్రాలపై ఆధారపడాల్సి వస్తోంది. ముఖ్యంగా రోడ్డు ప్రమాద బాధితులకు చికిత్స అందించడంలో పలు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇప్పటికైనా ఆస్పత్రి వార్డుల నిర్మాణాలు, సిబ్బంది క్వార్టర్లు పూర్తి చేసి సరైన వసతులు కల్పించాలని డాక్టర్ పద్మజ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

నవచిత్రం

స్వాతంత్ర్య దినోత్సవ కానుక..!


పవన్ కళ్యాణ్

'జల్సా', 'అత్తారింటికి దారేదీ' వంటి వరుస విజయాల తర్వాత పవన్ కళ్యాణ్, త్రివిక్రమ్ కాంబినేషన్‌లో ముచ్చటగా మూడోసారి ఓ చిత్రం రూపొందుతున్న విషయం విదితమే. ఇది పవర్‌స్టార్ నటిస్తున్న 25వ చిత్రం కావడం విశేషం. ఈ చిత్ర టైటిల్, సినిమా ఇతివృత్తం, హీరో పాత్ర విషయంలో ఇప్పటి వరకు ఎలాంటి వార్తలు చిత్ర బృందం నుంచి అధికారికంగా బయటకు రాలేదు. సోషల్ మీడియాలో ఏవేవో వార్తలు హల్‌చల్ చేసినప్పటికీ ఏ విషయంలోనూ స్పష్టత రాలేదు. దీంతో అటు అభిమానులు, ఇటు పరిశ్రమ వర్గాలు పవన్, త్రివిక్రమ్‌ల సినిమా ఎలా ఉంటుందోననే ఆసక్తితో ఎదురు చూస్తున్నారు. ఆ ఆసక్తికి, ఆత్రుతకి తెరదించుతూ ఈ చిత్ర బృందం స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా ఓ మంచి సర్‌ప్రైజ్ ఇచ్చేందుకు రెడీ అవుతోందట. ఆ రోజు చిత్ర టైటిల్‌తోపాటు ఫస్ట్‌లుక్‌ను విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నారట. పవన్ కళ్యాణ్ సరసన కీర్తిసురేష్, అను ఇమ్మాన్యుయెల్ హీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రాన్ని హారికా అండ్ హాసిని పతాకంపై ఎస్.రాధాకృష్ణ నిర్మిస్తున్నారు. అనిరుధ్ రవిచంద్రన్ స్వరాలు సమకూరుస్తున్నారు.

ఫ్రైడే నిరూపించుకుంటే తిరుగే ఉండదు..

'నా రెండవ సినిమా 'స్పీడున్నోడు' పరాజయం నన్ను బాగా ఇబ్బంది పెట్టింది. ఆ ఫెయిల్యూర్ తర్వాత రెండేండ్లకు ఒక్క సినిమా చేసినా ఫర్వాలేదు. ఫ్రైడే మాత్రం మంచి సినిమాతో ప్రేక్షకుల ముందుకు రావాలని డిసైడ్ అయ్యాను' అని అంటున్నారు బెల్లంకొండ సాయి శ్రీనివాస్. ద్వారక క్రియేషన్స్ పతాకంపై బోయపాటి శ్రీను దర్శకత్వంలో బెల్లంకొండ సాయి శ్రీనివాస్, రకుల్ ప్రీత్‌సింగ్, ప్రగ్యాజైశ్వాల్ నాయకానాయికలుగా మిర్యాల రవీందర్‌రెడ్డి నిర్మించిన చిత్రం 'జయ జానకి నాయక'. ఈనెల 11న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈ నేపథ్యంలో హీరో బెల్లంకొండ సాయిశ్రీనివాస్ శనివారం మీడియాతో ముచ్చటించారు. ఆ విశేషాలు ఆయన మాటల్లోనే..


బెల్లంకొండ సాయి శ్రీనివాస్

బోయపాటి మార్క్ సినిమా..

ఈ కథను నా రెండవ సినిమాగానే చేయాల్సింది. స్క్రిప్ట్ ఆలస్యం కావడంతో మూడవ సినిమాగా వస్తోంది. ఇది పక్కా బోయపాటిగారి మార్క్ సినిమా. ఆయన తరహా హీరోయిజం, యాక్షన్, టేకింగ్ ఉంటూనే చాలా కొత్తగా, ఫ్రెష్‌గా ఉంటుంది. ప్యూర్, ప్రాపర్ లవ్ స్టోరీ. కథ అద్భుతంగా ఉంటుంది. ఇప్పటి వరకు ఎవరూ ఇలాంటి లవ్‌స్టోరీని టచ్ చేయలేదు. బోయపాటి కూడా చేయలేదు. దీంతోపాటు అన్ని రకాల కమర్షియల్ ఎలిమెంట్స్ పుష్కలంగా ఉన్న సినిమా ఇది. హంసల దీవిలో చిత్రీకరించిన ఎపిసోడ్స్ సినిమాకు స్పెషల్ హైలైట్‌గా నిలుస్తాయి.

జానకిని గెలుచుకోవడమే...

జానకిని నాయకుడు ఎలా గెలుచుకున్నాడన్నదే ఈ చిత్ర కథ. టైటిల్ పెట్టడానికి కూడా అదే కారణం. టైటిల్ జస్టిఫికేషన్ టెర్రిఫిక్‌గా ఉంటుంది. ఇందులో నేను, రకుల్ కాలేజ్ స్టూడెంట్స్‌గా కనిపిస్తాం. ఆ తర్వాత మా ప్రేమ ప్రయాణం ఎలా సాగిందనేది ఆసక్తికరం. మా పాత్రల తీరుతెన్నులు కూడా చేసిపెట్టారు. అంతేకాదు నాతో మళ్ళీ సినిమా చేయాలనుందని చెప్పారు. ఒక యాక్టర్‌గా మనం ప్రతి సినిమా నుంచి ఏదో ఒకటి నేర్చుకుంటూనే ఉంటాం. నటన పరంగా, ఫిజిక్ పరంగా ఈ చిత్రంతో కొంత పరిణతి చెందానని అందరూ అభినందిస్తుంటే చాలా సంతోషంగా ఉంది. దర్శకుడు చెప్పిన మేరకు మొదట భారీగా బరువు పెరిగి మళ్ళీ తగ్గాను. దీంతో పాత్రకు కావాల్సిన విధంగా తయారయ్యాను. నటన పరంగా నా బెస్ట్ చేయగలిగాను. ఎమోషనల్ సీన్స్ బాగా చేశానని ఆయన అప్రిషియేట్ చేశారు. డైలాగ్స్ బోయపాటి స్టయిల్‌లో ఇంకాస్త ఎక్కువగానే ఉంటాయి. ఓవర్‌గా కాకుండా నా ఏజ్‌కు సరిపడేలా రాసిన డైలాగ్స్‌కు థియేటర్‌లో విజిల్స్ ఖాయం.

ఇంప్రూవ్ అవుతాం..

ఈ చిత్రం ద్వారా జగపతిబాబు, శరత్ కుమార్ వంటి సీనియర్ ఆర్టిస్టులతోనూ కలిసి పనిచేసే అవకాశం దొరికింది. సీనియర్స్‌తో పనిచేస్తే మన నటన ఇంకా ఇంప్రూవ్ అవుతుంది. బాగా చేయాలనే తపన పెరుగుతుంది.

నవ్యంగా ఉంటాయి. రీసెంట్‌గా బోయపాటిగారితో కలిసి సినిమా చూశాను. సినిమా చాలా చాలా బాగా వచ్చింది. నా గత రెండు భారీ చిత్రాల తర్వాత వస్తున్న సినిమా కావడంతో దీనిపై ప్రేక్షకుల్లో అంచనాలూ అలాగే ఉంటాయి. ఆ అంచనాలను వందకు వెయ్యి శాతం ఈ చిత్రం రీచ్ అవుతుంది. ఆ విషయంలో చాలా కాన్ఫిడెంట్‌గా ఉన్నాం.

చాలా నేర్చుకున్నా..

నా మూడవ సినిమానే బోయపాటి వంటి దర్శకుడితో పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నాను. ఆయన్నుంచి ఈ చిత్రం ద్వారా చాలా నేర్చుకున్నాను. నాకు కాన్ఫిడెన్స్ ఇచ్చారు. ఒక అన్నలా నన్ను నమ్మి ఫ్రీగా ఈ సినిమా

ఈ చిత్రంలో నా నటన చూసి జగపతిబాబుగారు ఆడియో వేడుకలో ప్రశంసించడం చాలా ఆనందంగా ఉంది. నాకు జోడీగా రకుల్ ప్రీత్ సింగ్ చాలా బాగా చేసింది. ఓ కీలక పాత్రలో ప్రగ్యాజైశ్వాల్ నటించారు. కథలో కన్‌ఫ్యూజన్ క్రియేట్ చేసే పాత్ర ఆమెది. కలలో వచ్చి కథే మార్చేస్తుంది (నవ్వుతూ).

యాక్షనే నా అస్సెట్..

నేను కమర్షియల్ సినిమాలు చేయడానికి కారణం యాక్షన్ నా అస్సెట్. దీనికితోడు బాగా డాన్స్ చేస్తాను. కమర్షియల్ సినిమాలకు ఈ రెండు చాలా ప్రధానం. ఆ రెండు నా స్ట్రెంగ్త్స్ కాబట్టి వాటిని వదులుకుని ఇతర జోనర్ సినిమాలు చేయడం ఎందుకు?. అందుకే కమర్షియల్ అంశాలు ఉండే చిత్రాలనే చేస్తున్నా. అలాగే హీరోగా నాకు అభిమానుల బేస్ లేదు. ఇమేజ్ లేదు. కాబట్టి సినిమాలో ఇతర హంగులు అవసరం. అందులో భాగంగా కేథరిన్‌తో స్పెషల్ నెంబర్ చేయించాం. గత రెండు చిత్రాలకు తమన్నా చేశారు. కొత్తగా ఉండాలని కేథరిన్‌ని తీసుకున్నాం.

ఫ్రైడే నిరూపించుకోవాలి..

నా రెండవ సినిమా 'స్పీడున్నోడు' పరాజయం నన్ను బాగా ఇబ్బంది పెట్టింది. రెండు రోజులు దూరంగా ఉన్నా. కామన్‌గా నేను ఏడ్వను. కానీ ఆ చిత్రం నన్ను బాగా ఏడిపించింది. దీంతో రెండేండ్లకు ఒక్క సినిమా చేసినా ఫర్వాలేదు, ఫ్రైడే రోజు మాత్రం మంచి సినిమాతో రావాలని డిసైడ్ అయ్యాను. ఫ్రైడే రోజు నిరూపించుకుంటే తర్వాత అదే సెట్ అవుతుంది. నా ఫ్రస్టేషన్‌ను నా స్నేహితులు, మా తల్లిదండ్రులతో పంచుకుంటాను. హీరో కావాలనే నా డ్రీమ్‌ను మా నాన్న(బెల్లంకొండ సురేష్) ఆయన డ్రీమ్‌గా మార్చుకుని సాధ్యం చేసేందుకు తపన పడుతున్నారు. అందుకు నేను అదృష్టంగా ఫీలవుతున్నా. నాన్న చేస్తున్న ప్రయత్నంలో నేను విజయం సాధించాలని శాయశక్తులా కృషి చేస్తున్నాను.

కొత్త జోనర్‌లో..

ప్రస్తుతం శ్రీవాస్‌తో చేస్తున్న సినిమా ఓ కొత్తజోనర్‌లో ఉంటుంది. ఇప్పటి వరకు తెలుగులో ఇలాంటి సినిమా రాలేదు. నెక్స్ట్ లెవల్ యాక్షన్ ఎంటర్‌టైనర్. శ్రీవాస్ అద్భుతంగా తెరకెక్కిస్తున్నారు. ఇప్పటికే ఫస్ట్ షెడ్యూల్ పూర్తయ్యింది. త్వరలో నెక్స్ట్ షెడ్యూల్ ఉంటుంది. ఈ చిత్రాన్ని అభిషేక్ నామా నిర్మిస్తున్నారు. ఇకపై చేసే సినిమాలన్నీ కమర్షియల్‌గా ఉంటూనే నవ్యమైన కథ ఉండేలా చూసుకుంటాను. అలాగే నటన పరంగా బాగా ఇంప్రూవ్ అవ్వడానికి అన్ని రకాలుగా ప్రయత్నిస్తాను. ప్రేక్షకుల్లో నాకంటూ ఓ స్థానం కోసం అహర్నిశలు శ్రమిస్తాను.

అణాపైసలతో సహా చెల్లిస్తా..


ఎన్టీఆర్

'చాలా సంవత్సరాలుగా ఆదాయపు పన్ను, సర్వీస్ టాక్స్ క్రమం తప్పకుండా చెల్లిస్తున్నాను. ఒక భారతీయ పౌరుడిగా నా చట్టపరమైన బాధ్యతలను నేనెన్నడూ మరువలేదు' అని అన్నారు హీరో ఎన్టీఆర్. 2015లో ఎన్టీఆర్ 'నాన్నకు ప్రేమతో' చిత్రంలో నటించిన విషయం విదితమే. ఎన్టీఆర్ విదేశాల్లో చేసిన సినిమాలకు సేవల ఎగుమతుల కింద చూపుతూ సర్వీస్ టాక్స్ ఎగవేశారని కాగ్ పేర్కొన్నట్టు శనివారం వార్తా పత్రికల్లో ఓ వార్త ప్రచురితమైంది. ఈ నేపథ్యంలో దీనిపై ఎన్టీఆర్ స్పందించి వివరణ ఇచ్చారు. 'శనివారం వార్తల్లో వచ్చిన సర్వీస్ టాక్స్ మినహాయింపు కథనంపై ఒక బాధ్యతగల భారతీయ పౌరుడిగా నా స్పందన తెలియజేయడం సబబని భావించి, జరిగిన సంఘటనలను వివరిస్తున్నాను. నేను నటించిన 'నాన్నకు ప్రేమతో' చిత్రం లండన్‌లో నిర్మించాం. కళాకారుడిగా పొరుగు దేశంలో అందించిన సర్వీస్‌కు భారత దేశంలో సర్వీస్ టాక్స్ వర్తించదు అని నాకు చెప్పడంతో చట్ట ప్రకారమే నేను 'నాన్నకు ప్రేమతో' సినిమా నిర్మాతల నుంచి సర్వీస్ టాక్స్ వసూలు చేయలేదు. 2016లో ఇదే విషయంపై కాగ్ నుంచి వచ్చిన క్వెరీకి లిఖిత పూర్వకంగా మా ఆడిటర్‌లు స్పందించటం జరిగింది. ఆ స్పందన తర్వాత ఎటువంటి అధికారిక ఉత్తర్వులు గాని, నోటీసులుగానీ మాకు అందలేదు. ఈ విషయంలో సంబంధిత అధికారుల నుంచి నాకు ఆదేశాలు అందితే నా వైపు నుంచి చట్టపరంగా చెల్లించాల్సిన రుసుము ఏమైనా ఉంటే అణాపైసలతో సహా చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నాను. చట్టానికి ఎల్లప్పుడూ కట్టుబడి ఉండాలని నమ్మే నేను ఈ విషయంలో కూడా అదే పాటిస్తున్నాను' అని ఎన్టీఆర్ చెప్పారు.

ట్రెండ్ మారినా ఫ్రెండ్ మారడు..


రామ్

రామ్, అనుపమ పరమేశ్వరన్, లావణ్య త్రిపాఠి హీరో,హీరోయిన్లుగా కిశోర్ తిరుమల దర్శకత్వంలో స్రవంతి రవికిషోర్, పి.ఆర్.సినిమాస్ సమర్పణలో స్రవంతి సినిమాటిక్స్ పతాకంపై కృష్ణచైతన్య నిర్మిస్తున్న నూతన చిత్రానికి 'ఉన్నది ఒకటే జిందగీ' అనే టైటిల్ కన్ఫమ్ చేశారు. ఈ సందర్భంగా చిత్ర టైటిల్ పోస్టర్‌ను శనివారం విడుదల చేశారు. నిర్మాత స్రవంతి రవికిషోర్ మాట్లాడుతూ, 'స్నేహం, ప్రేమ నేపథ్యంలో సాగే చిత్రమిది. నేడు ఫ్రెండ్‌షిప్ డే సందర్భంగా ఈ చిత్రంలో ఉన్న 'ట్రెండ్ మారినా.. ఫ్రెండ్ మారడు..' అనే పాటకు సంబంధించి లిరికల్ వీడియోను విడుదల చేయబోతున్నాం. దేవిశ్రీప్రసాద్ స్వరపరిచిన ఈ పాటకు చంద్రబోస్ సాహిత్యం అందించారు. దేవిశ్రీప్రసాద్ వినసొంపైన బాణీలను అందించారు. ఇప్పటి వరకు 50శాతం షూటింగ్ పూర్తయ్యింది. ఈ నెల 7 నుంచి ఊటీలో జరుపనున్న భారీ షెడ్యూల్‌తో ఒక పాట మినహా సినిమా పూర్తవుతుంది. ఆ పాటను వచ్చే నెలలో ఇటలీలో చిత్రీకరిస్తాం. దసరాకి సినిమాను విడుదల చేయాలనుకుంటున్నాం' అని అన్నారు. శ్రీవిష్ణు, ప్రియదర్శి ఇతర ప్రధాన పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: సమీర్‌రెడ్డి, ఎడిటింగ్: శ్రీకర్ ప్రసాద్, ఆర్ట్: ఎ.ఎస్.ప్రకాష్.

హిందీలోనూ..


ప్రియాంక చోప్రా

ప్రియాంక చోప్రా.. ఓవైపు గ్లోబల్ స్టార్‌గా రాణిస్తూనే మరో వైపు అభిరుచిగల నిర్మాతగా నూతన ప్రతిభను ప్రోత్సహిస్తూ ప్రాంతీయా భాషా చిత్రాలను నిర్మిస్తోంది. ఇప్పటికే బోజ్‌పూరిలో 'బమ్ బమ్ బోల్ రహ హై కషి', మరాఠిలో 'వెంటిలేటర్', 'క్యా రే రాస్కాలా', పంజాబీలో 'సర్వన్' చిత్రాలను నిర్మించింది. ప్రస్తుతం సిక్కింలో 'పహునా' చిత్రాన్ని తెరకెక్కిస్తోంది. తాజాగా హిందీలో సైతం సినిమాలను నిర్మించేందుకు రంగం సిద్ధం చేస్తోంది. దీనికోసమై ఇప్పటివరకు విన్న కథలో రెండు స్క్రిప్ట్స్ ఫైనల్ చేసి, వాటిని నిర్మించేందుకు గ్రౌండ్‌వర్క్ చేస్తోందట. ఇందులో ఒకటి ముక్కోణపు ప్రేమ కథ కాగా, మరోకటి కథానాయికకు ప్రాధాన్యత ఉన్న కథ. ప్రస్తుతం ఈ రెండు చిత్రాలకు నటీనటులను ఎంపిక చేసే పనిలో చిత్రబృందం ఉన్నట్టు సమాచారం. కథానాయికకు ప్రాధాన్యత ఉన్న చిత్రంలోని పాత్రకు సరైన నటి దొరక్క పోవడంతో తానే నటించే యోచనలో ప్రియాంక ఉన్నారట. దీంతోపాటు మరాఠీలో నిర్మించిన 'వెంటిలేటర్' చిత్రాన్ని మలయాళంలో రీమేక్ చేయబోతున్నారు. ఈ విషయాన్ని ప్రియాంక తల్లి మధు చోప్రా మీడియాకి తెలిపారు. ప్రియాంక ప్రస్తుతం హాలీవుడ్‌లో 'ఎ కిడ్ లైక్ జేక్', 'ఇజింట్ ఇట్ రొమాంటిక్' చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉంది.


వైభవి, ఆది సాయికుమార్

విజయదశమి గిఫ్ట్‌గా నెక్స్ట్ నువ్వే

ఆది సాయికుమార్, వైభవి హీరోహీరోయిన్లుగా ప్రభాకర్.పి దర్శకత్వంలో వి4 మూవీస్ పతాకంపై బన్నివాసు నిర్మిస్తున్న నూతన చిత్రానికి 'నెక్స్ట్ నువ్వే' టైటిల్ ఖరారు చేశారు. ఇందులో రష్మి మరో కథానాయిక. ఈ చిత్ర ఫస్ట్‌లుక్‌ను చిత్ర యూనిట్ శనివారం విడుదల చేసింది. ఈ సందర్భంగా బన్నివాసు మాట్లాడుతూ, 'హిలేరియస్ కామెడీ థ్రిల్లర్ చిత్రమిది. ఇప్పటికే హీరోగా తనకంటూ మంచి ఇమేజ్‌ను, సక్సెస్‌ను సాధించిన ఆది సాయికుమార్ హీరోగా, బుల్లితెరపై గట్టి పట్టున్న ప్రభాకర్ దర్శకత్వంలో ఈ చిత్రాన్ని నిర్మించడం చాలా ఆనందంగా ఉంది. మంచి కాన్సెప్ట్ ఓరియెంటెడ్ ఎంటైర్‌టైనర్ చిత్రమిది. ఇందులో ఆది సాయికుమార్ పాత్ర అందరినీ ఆకట్టుకునేలా ఉంటుంది. ఆయన కెరీర్‌లో ఇది మంచి విజయవంతమైన చిత్రంగా నిలుస్తుంది. ప్రస్తుతం పోస్ట్‌ప్రొడక్షన్స్ కార్యక్రమాలు జరుగుతున్నాయి. అన్ని కార్యక్రమాలను పూర్తి చేసి విజయదశమి కానుకగా సినిమాను విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నాం' అని అన్నారు. బ్రహ్మాజీ, అవసరాల శ్రీనివాస్, హిమజ, జయప్రకాష్‌రెడ్డి, పృథ్వీ, ఎల్.బి.శ్రీరామ్, రఘుబాబు, పోసాని, రఘు, బెనర్జీ, తాగుబోతు రమేష్, ముమైత్ ఖాన్, రజిత, సత్యకృష్ణ, దువ్వాసి మోహన్ తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి ఫొటోగ్రఫీ: కార్తీక్ పళని, ఎడిటింగ్: ఎస్.బి.ఉద్ధవ్, ఆర్ట్: శ్రీకాంత్.

ఎమోషనల్ స్టోరీతో అర్జున్‌రెడ్డి


విజయ్ దేవరకొండ, షాలిని, నాని, సందీప్‌రెడ్డి వంగా

విజయ్ దేవరకొండ, షాలిని,జియా శర్మ హీరో, హీరోయిన్లుగా సందీప్‌రెడ్డి వంగా దర్శకత్వంలో భద్రకాళి పిక్చర్స్ పతాకంపై ప్రణయ్‌రెడ్డి వంగా నిర్మిస్తున్న చిత్రం 'అర్జున్‌రెడ్డి'. ఈ చిత్ర ట్రైలర్ లాంచ్ శనివారం హైదరాబాద్‌లో జరిగింది. అతిథిగా విచ్చేసిన నాని మాట్లాడుతూ, 'నేను నెక్స్ట్ చేయబోతున్న చిత్రం పేరు 'కృష్ణార్జునయుద్ధం'. నాకు కొడుకు పేరు అర్జున్. నేను లాంచ్ చేసిన ట్రైలర్ పేరు 'అర్జున్‌రెడ్డి' కావడం విశేషం. ట్రైలర్ చూస్తే సినిమా చూడాలా వద్దా అని డిసైడ్ చేసుకుంటాం. కాని ఈ ట్రైలర్ చూస్తుంటే ప్రేక్షకుడిని సినిమా మూడ్‌లోకి తీసుకెళ్తున్నట్టు అనిపించింది. టెర్రిఫిక్‌గా, షాకింగ్‌గా ఉంది. తెలుగు సినిమాలో వస్తున్న మార్పును ఈ చిత్రం నెక్స్ట్ లెవల్‌కి తీసుకెళ్తుందనిపిస్తుంది. విజయ్ గురించి ఎక్కడ మాట్లాడినా నాకు ఒక గర్వం ఉంటుంది. ఇలాంటి ట్రైలర్ అతన్నుంచి వస్తుండటం ఇంకా గర్వంగా ఉంది. కొత్తరకమైన సినిమా వచ్చినప్పుడు మంచి ఫ్లాట్‌ఫామ్ అవసరం. ఏసియన్ సినిమా వాళ్ళు ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నందుకు హ్యాపీగా ఉంది. ఇలాంటి కంటెంట్‌ను ఆదరిస్తే మరిన్ని మంచి సినిమాలు వస్తాయి. రథన్ మ్యూజిక్ చాలా బాగుంది. సినిమా పెద్ద బ్లాక్ బస్టరై మనం ఫాలో అవుతున్న అన్ని ఫార్ములాలను బ్రేక్ చేయాలని కోరుకుంటున్నా' అని అన్నారు.

'ఇదొక ఎమోషనల్ స్టోరీ. చాలా డిఫరెంట్ లొకేషన్లలో షూట్ చేశాం. దీని వల్ల ఆలస్యమైంది. ఎట్టకేలకు ఈ నెల 25న ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నాం. ఆదరించాలని కోరుకుంటున్నా' అని దర్శకుడు తెలిపారు. షాలిని చెబుతూ, 'ఈ చిత్రంలో నటించినందుకు ఎగ్జైటింగ్‌గా ఉంది. ఇదొక కొత్త అనుభవం' అని తెలిపింది. 'ట్రైలర్ చూస్తుంటే ఇంకాస్త ఉంటే బాగుండనిపిస్తుంది. ఇది బ్లాక్ బస్టర్ సినిమా అవుతుంది. ఈ విషయంలో బెట్ చేయడానికి నేను సిద్ధమే. నటుడిగా ఈ సినిమా విషయంలో చాలా సంతృప్తిగా ఉన్నా. సినిమాను తీసుకున్న సునీల్ నారంగ్‌కు ధన్యవాదాలు. ఈ సినిమాను ఆయన ఎందుకు కొన్నారన్నది ఈ నెల 25న సినిమాను చూస్తే తెలుస్తుంది. నాకు 'ఎవడే సుబ్రమణ్యం' నుంచి నాని సపోర్ట్ చేస్తున్నారు. ఆయనకు థ్యాంక్స్' అని హీరో విజయ్ దేవరకొండ తెలిపారు.

సప్తగిరి సూపర్ ఫాస్ట్ ఆరంభం


సప్తగిరి, జెమిని కిరణ్

సప్తగిరి హీరోగా నటిస్తున్న నూతన చిత్రం 'సప్తగిరి సూపర్ ఫాస్ట్'. హర్షవర్ధన్ దర్శకత్వంలో జొన్నాడ రమణమూర్తి సమర్పణలో నట్టీస్ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై నట్టి కరుణ, నట్టి క్రాంతి నిర్మిస్తున్న ఈ చిత్రం శనివారం హైదరాబాద్‌లోని అన్నపూర్ణ స్టూడియోలో ప్రారంభమైంది. హీరోపై చిత్రీకరించిన ముహూర్తపు సన్నివేశానికి జెమిని కిరణ్ క్లాప్‌నివ్వగా, విజయేంద్రప్రసాద్ కెమెరా స్విచాన్ చేశారు. బి.గోపాల్ గౌరవ దర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా విజయేంద్రప్రసాద్ మాట్లాడుతూ, 'హర్షవర్ధన్ నాతో కలిసి పలు సినిమాలకు పనిచేశాడు. ఈ చిత్ర కథను సిద్ధం చేసి నాకు వినిపించాడు. చాలా బాగుంది. సప్తగిరికి 100శాతం యాప్ట్ అయ్యే కథ. సప్తగిరిని సూపర్ స్టార్ చేసే సినిమా అవుతుంది' అని అన్నారు. 'హర్షవర్ధన్ మంచి టెక్నీషియన్. చాలా కాలం తర్వాత మళ్లీ మంచి కథతో వస్తున్నాడు. సప్తగిరి మంచి ఫామ్‌లో ఉన్నాడు. కచ్చితంగా ఇది మంచి విజయం సాధిస్తుంది' అని బి.గోపాల్ తెలిపారు. హీరో సప్తగిరి చెబుతూ, 'మంచి కంటెంట్ ఉన్న స్టోరీ ఇది. 'సప్తగిరి ఎక్స్‌ప్రెస్' విజయంతో సప్తగిరి అనే పదం సెంటిమెంట్‌గా మారింది. దీంతో నా రెండవ చిత్రానికి 'సప్తగిరి ఎల్ ఎల్ బి', ఈ చిత్రానికి కూడా సప్తగిరి వచ్చేలా టైటిల్‌ను ఖరారు చేయడం జరిగింది. సినిమా కచ్చితంగా అన్ని వర్గాల ప్రేక్షకులను ఎంటర్‌టైన్ చేస్తుంది' అని చెప్పారు. 'హైలీ టెక్నీకల్ వ్యాల్యూస్‌తో తెరకెక్కించబోతున్నాం. సప్తగిరి మార్క్ ఎనర్జిటిక్ కామెడీ ఎంటర్‌టైనర్ చిత్రమిది. కొత్త నిర్మాతలిద్దరూ ప్యాషన్‌తో ఉన్నారు. వాళ్ళకు మంచి పేరు తీసుకురావాలి' అని దర్శకుడు హర్షవర్ధన్ తెలిపారు. నిర్మాతలు చెబుతూ, 'ఈ నెలాఖరు నుంచి రెగ్యులర్ షూటింగ్‌కు ప్లాన్ చేస్తున్నాం. నిర్మాతలుగా మా నాన్న నట్టికుమార్ పేరు నిలబెడతాం' అని అన్నారు.

12 గంటలు... 5 లక్షల వ్యూస్


'మేడ మీద అబ్బాయి' చిత్రంలో అల్లరి నరేష్

అల్లరి నరేష్, నిఖిల విమల్ జంటగా జి.ప్రజిత్ దర్శకత్వంలో నీలిమ సమర్పణలో జాహ్నవి ఫిల్మ్స్ పతాకంపై బొప్పన చంద్రశేఖర్ నిర్మిస్తున్న చిత్రం 'మేడ మీద అబ్బాయి'. ఈ చిత్ర టీజర్‌ను అల్లరి నరేష్ ట్వీట్ ద్వారా విడుదల చేశారు. ఈ సందర్భంగా అల్లరి నరేష్ మాట్లాడుతూ, 'కొత్తదనంతో కూడిన కథతో చేస్తున్న విభిన్న కథా చిత్రమిది. చాలా రోజుల తర్వాత ఓ మంచి సినిమా చేశాననే భావన కలిగింది. తప్పకుండా సినిమా అన్ని వర్గాల ఆదరణ పొందుతుందనే నమ్మకం ఉంది. ఈ 'మేడమీద అబ్బాయి'ని అందరూ మీ ఇంటి అబ్బాయిగా ఆదరించాలని కోరుకుంటున్నా' అని అన్నారు. 'అల్లరి నరేష్ విడుదల చేసిన టీజర్‌కు 12 గంటల్లోనే 5లక్షలకుపైగా వ్యూస్ సాధించడం విశేషం. నవ్య కథ, కథనాలతో దర్శకుడు ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. 'గమ్యం', 'శంభో శివ శంభో' తర్వాత ఆ తరహా సున్నితమైన కథతో అల్లరి నరేష్ నటిస్తున్న చిత్రమిది. రొమాంటిక్ కామెడీ థ్రిల్లర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో స్క్రీన్‌ప్లే హైలైట్‌గా ఉంటుంది. సహజమైన అంశాలతో థ్రిల్లింగ్ ఉంటూనే నరేష్ శైలి వినోదం ఉంటుంది. ఈ నెలలోనే పాటలను విడుదల చేసి, సెప్టెంబర్ మొదటి వారంలో సినిమాను రిలీజ్ చేస్తాం' అని నిర్మాత చెప్పారు.

సీఎం వ్యాఖ్యలు...ప్రజాస్వామ్య ప్రమాదఘంటికలు

అడ్డుకొని తీరతాం

- మూడేండ్లలో ఏ హామీలు నెరవేర్చలేదు
- 7న రాష్ట్రవ్యాప్త అందోళనలు: రౌండ్‌టేబుల్‌లో కార్మిక సంఘాలు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

కార్మిక సంఘాలు, ప్రతిపక్షాలు, మీడియాపై సీఎం కేసీఆర్ చేసిన దిగజారుడు వ్యాఖ్యలు ప్రజాస్వామ్య ప్రమాద ఘంటికలను మోగిస్తున్నాయని పలు కార్మిక సంఘాలు ఆందోళన వ్యక్తం చేశాయి. ఈ చర్యల్ని సంఘటితంగా అడ్డుకొని, ప్రజాస్వామ్య విలువల్ని కాపాడతామని స్పష్టం చేశాయి. సీఐటీయు రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో శనివారంనాడిక్కడి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. సీఐటీయు రాష్ట్ర ఉపాధ్యక్షులు వీఎస్ రావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎమ్ సాయిబాబు, తెలంగాణ రాష్ట్ర గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్మానాయక్, వృత్తిదార్ల సంఘం ప్రధాన కార్యదర్శి నాగరాజు, సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి మధు, తెలంగాణ రాష్ట్రప్రభుత్వ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు జె వెంకటేష్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు బి ప్రసాద్, రాష్ట్ర రోడ్ ట్రాన్స్‌పోర్ట్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, రక్షణ రంగ ఉద్యోగుల సంఘం నాయకులు జీటీ గోపాలరావు, ఏఐఎఫ్‌టియు రాష్ట్ర నాయకులు శివబాబు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గడచిన మూడేండ్లలో ప్రభుత్వం ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని విమర్శించారు. ఈకాలంలో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల నియామకాలు, వారికి డిపార్ట్‌మెంటల్ పరీక్షల నిర్వహణ, రెగ్యులరైజేషన్‌కు ఉన్న ఇతర మార్గాలపై కనీసం సమీక్ష కూడా చేయలేదని స్పష్టం చేశారు. రెండేండ్ల క్రితమే రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఏ శాఖలో ఎంతమంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఏఏ విధులు నిర్వహిస్తున్నారు...వారికి ఇస్తున్న వేతనాలు ఎంత...కనీస వేతనాల చట్టం ఏం చెప్తుంది అనే అనేక అంశాలతో కూడిన సవివరణ పత్రాలను అందచేశామని, ఇప్పుడు సీఎం కేసీఆర్ ఏ శాఖలో ఎంతమంది ఉన్నారో లెక్కలు చెప్పండంటూ అధికారుల్ని ఆదేశించడం విడ్డూరంగా ఉందన్నారు. కార్మికసంఘాలు, నవతెలంగాణ దినపత్రిక, ప్రతిపక్షాలపై సీఎం దిగజారుడు మాటల్ని ఎంతమాత్రం సహించేది లేదన్నారు. సీఎం కేసీఆర్ వ్యాఖ్యలకు నిరసనగా ఈనెల 7వ తేదీ రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలు, మండల కేంద్రాల్లో ఆందోళనా కార్యక్రమాల్ని నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ ఆందోళనల్లో అన్ని కార్మిక, ప్రజా, ఉద్యోగ సంఘాలను భాగస్వామ్యం చేస్తామని చెప్పారు. 'దొర' అహంకారం నుంచి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకొని తీరతామని స్పష్టం చేశారు. ప్రజల సొమ్ముతో ప్రగతి భవన్‌ను నిర్మించుకొని, బాధలు చెప్పుకొనేందుకు ప్రజలు అక్కడికొస్తే పోలీసుల్తో కుళ్ళబొడిపించి, కేసులు పెట్టడం ఏ విలువలకు సంకేతమని ప్రశ్నించారు. గతంలో జరిగిన మున్సిపల్ పారిశుధ్య కార్మికులు, ఆర్టీసీ కార్మికుల సమ్మెలో టీఆర్ఎస్ అనుబంధ కార్మిక సంఘాలు పాల్గొన్న విషయాన్ని మర్చిపోయారా అని ప్రశ్నించారు. ఎవరూ అడక్కుండానే జీతాలు పెంచామని డాంబికాలు పోవడాన్ని మానుకోవాలని హితవు చెప్పారు. ఇప్పటికైనా సీఎం కేసీఆర్ అన్ని కార్మిక సంఘాలతో కలిసి సమీక్షా సమావేశాన్ని నిర్వహించాలని, ఆ సమావేశంలో తమ ప్రతిపాదనలు, వాటిని ఎలా పరిష్కరించుకోవాలో చెప్తామని అన్నారు. పరిపాలనలో సీఎం కేసీఆర్ తన అసమర్ధతను కప్పిపుచ్చుకోవడానికి నెపాన్ని కోర్టులపైకి, ప్రతిపక్షాలపైకి నెడితే సహించేది లేదని తేల్చిచెప్పారు. 7వ తేదీ జరిగే ఆందోళనా కార్యక్రమాల్లో అన్ని కార్మిక, ఉద్యోగ, ప్రజాసంఘాలు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. 2016 అక్టోబర్ 26న సమాన పనికి సమాన వేతనం అంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయాలని డిమాండ్ చేశారు.



సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రౌండ్‌టేబుల్ సమావేశంమాట్లాడుతున్న సాయిబాబు



మాట్లాడుతున్న హైకోర్టు మాజీ జడ్జి జి. యతిరాజులు

అమలుకు నోచని లైంగిక వేధింపుల నిరోధక చట్టం

- జాతీయ మహిళా ఉపాధ్యాయుల ఫోరం ఆందోళన
- రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌కు వినతి పత్రం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పని ప్రదేశాల్లో మహిళల పట్ల వివక్ష, లైంగిక వేధింపులు కొనసాగుతూనే ఉన్నాయని జాతీయ మహిళా ఉపాధ్యాయుల ఫోరమ్ అఖిల భారత కన్వీనర్ ఎం.సంయుక్త, రాష్ట్ర కన్వీనర్ సీహెచ్ దుర్గాభవానీ ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం బేగంపేటలోని హరితప్లాజాలో రాష్ట్ర మహిళా కమిషన్ నిర్వహించిన సమావేశం అనంతరం కమిషన్ చైర్‌పర్సన్ త్రిపురనేని వెంకటరత్నంకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడాతూ కేంద్ర ప్రభుత్వం 2013 డిసెంబరు 9న లైంగిక వేధింపుల నిరోధక చట్టం-2013ను తెచ్చినా సంబంధిత కమిటీల ఏర్పాటుపై ఏ స్థాయిలోనూ అవసరమైన కదలికలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళా ఉద్యమాల ఒత్తిడి, పోరాటాల ఫలితంగా వచ్చిన చట్టాన్ని ప్రభుత్వాలు నీరుగారుస్తున్నాయని విమర్శించారు. 'చట్టం చేస్తాం..అమలు చేయం' అన్నట్టుగా వ్యవహరిస్తున్నాయని దుయ్యబట్టారు. చట్టాలను అమలు పరిచి మహిళలకు భరోసా కల్పించాల్సిన అవసరం ప్రభుత్వాలపై ఉందన్నారు.

'2013లో వచ్చిన చట్టానికి 16 ఏండ్ల క్రితమే విశాఖ గైడ్‌లైన్సు పేరుతో సుప్రీంకోర్టు 1999లో లైంగిక వేధింపుల నిరోధానికి కొన్ని మార్గదర్శకాలను జారీ చేసింది. అయినా అమలుకు నోచుకోలేదు' అని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వ, ప్రయివేటు యాజమాన్యాలను సంబంధిత కమిటీలను ఏర్పాటు చేయాల్సిందిగా కేంద్రం ఆదేశాలు జారీ చేయాలన్నారు. రాష్ట్రంలోని అన్ని వ్యవస్థల్లో కమిటీల ఏర్పాటు జరిగే విధంగా కమిషన్ చర్యలు తీసుకోవాలన్నారు. విద్యారంగానికి సంబంధించి విశ్వవిద్యాలయాలు, కళాశాలలు, పాఠశాల విద్య డైరెక్టరేట్లు, జిల్లాల్లోని డీఈఓ, ఎంఈఓ వంటి కార్యాలయాల్లో లైంగిక వేధింపుల నిరోధక కమిటీలను వెంటనే ఏర్పాటు చేసేలా చొరవ చూపాలని మహిళా ఉపాధ్యాయుల కో-కన్వీనర్లు ఎన్.సరళ, ఆర్.శారద ఛైర్‌పర్సన్‌కు సూచించారు.

లైంగిక వేధింపుల్లో ఫిర్యాదులకు దూరం

- జాతీయ మహిళా కమిషన్ సభ్య కార్యదర్శి సత్బీర్‌బేడీ

హైదరాబాద్: పని ప్రాంతాల్లో లైంగిక వేధింపులకు గురవుతున్న మహిళల్లో 70 శాతం మంది ఫిర్యాదులే చేయడంలేదని జాతీయ మహిళా కమిషన్(ఎన్‌సీడబ్ల్యు) సభ్య కార్యదర్శి సత్బీర్‌బేడీ తెలిపారు. పని ప్రాంతాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టం-2013పై తెలంగాణ మహిళా కమిషన్ ఏర్పాటు చేసిన అవగాహనా సదస్సులో సత్బీర్‌బేడీ పాల్గొని ప్రసంగించారు. బాధితుల్లో కొందరు ఫిర్యాదులే చేయకపోతుండగా, మరికొందరు చట్టాన్ని దుర్వినియోగం చేస్తూ బ్లాక్‌మెయిలింగ్‌కు పాల్పడుతున్నారని ఆమె అన్నారు. మహి ళలపై లైంగిక వేధింపులు, దోపిడీ నిరోధానికి చట్టాలు, పథకాలు చాలా ఉన్నా, వాటిని సరిగ్గా ఉపయో గించుకోలేకపోతున్నారని ఆమె అన్నారు. సదస్సులో పాల్గొన్న హైకోర్టు మాజీ జడ్జి జి. యతిరాజులు మాట్లాడుతూ..లైంగిక వేధింపులపై మహిళా ఉద్యోగులు ఐక్యంగా పోరాడాలని సూచించారు. చట్టానికి మరింత పదును పెట్టేందుకు వీలుగా కేంద్రానికి సిఫారసులు పంపేందుకే ఈ సదస్సును ఏర్పాటు చేసినట్టు తెలంగాణ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ టి. వెంకటరత్నం తెలిపారు. పని ప్రాంతాల్లో మహిళలపై వేధింపుల నిరోధానికి చర్యలు చేపట్టడంలో కొన్ని సంస్థలు శ్రద్ధ చూపడంలేదని ఆమె అన్నారు.

నేడు హైదరాబాద్‌లో పీఆర్ఎస్ఐ సదస్సు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ పబ్లిక్ రిలేషన్స్ రెండో కాన్ఫరెన్స్ ఆదివారం జరగనుందని పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా (పీఆర్ఎస్ఐ) హైదరాబాద్ చాప్టర్ ఛైర్మెన్ డాక్టర్ పీ.వేణుగోపాల్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 'చిన్న రాష్ట్రాల్లో సమర్ధ ప్రజాపాలన, పటిష్టంగా ప్రసారం తెలంగాణ-దృక్కోణం' ప్రధానాంశంగా జాతీయ ప్రజా సంబంధాల విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకొని సదస్సు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. హైదరాబాద్, అమీర్‌పేట్ గ్రీన్‌పార్క్‌లో జరిగే సదస్సును హోంమంత్రి నాయినీ నర్సింహ్మారెడ్డి ప్రారంభిస్తారని తెలిపారు. విశిష్ట అతిథిగా మేయర్ బొంతు రామ్మోహన్, అధ్యక్షునిగా ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కేవీ రమణాచారి, పీఆర్ఎస్ఐ జాతీయ అధ్యక్షుడు అజిత్‌పాఠక్, పీఆర్ వాయిస్ సంపాదకులు సీవీ నరసింహారెడ్డి, అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు కే.సీతారామారావు, ప్రభుత్వ పాలన నిపుణులు డీ.రవీంద్రప్రసాద్, వై.పార్థసారథి, ఢిల్లీలోని ఐఐఎంసీ డీజీ కేజీ సురేష్, టీ శాట్ సాఫ్ట్‌నెట్ సీఈఓ ఆర్.శైలేష్ రెడ్డి, జీహెచ్ఎంసీ కమిషనర్ జనార్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొననున్నారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజా సంబంధాల వృత్తి నిపుణులు సదస్సుకు హాజరవుతారని వేణుగోవార్‌రెడ్డి తెలిపారు.

మొక్కల పేర దళితుల భూములకు ఎసరు

అప్పగించాలంటూ రెవెన్యూ అధికారుల నోటీసులు

- 30 ఏండ్లుగా సాగుచేసుకుంటున్న రైతులు
- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన ఎక్లాస్‌పూర్ వాసులు



నవతెలంగాణ-పెద్దపల్లి ప్రతినిధి

పెద్దపల్లి జిల్లా ఎక్లాస్‌పూర్‌లో 30 ఏండ్ల నుంచి 52 మంది రైతులు ఆ భూమిని సాగుచేసుకుంటున్నారు. అందులో తొమ్మిది మందికి సర్కారు పట్టాలు కూడా ఇచ్చింది. ఇప్పుడు అదే భూమిలో హరితహారం కింద మొక్కలు నాటాలని సర్కారు నిర్ణయించింది. 'పంట చేనులో కలుపు తీయొద్దు. పురుగుల మందు కొట్టొద్దు' అంటూ రెవెన్యూ శాఖ ఉన్న ఫలానా నోటీసులు జారీ చేసింది. దీంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు.

పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం ఎక్లాస్‌పూర్‌లో పోడు వ్యవసాయం అధికంగానే ఉన్నది. గ్రామ సమీపంలో 369, 116, 117 సర్వేనెంబర్లలో 80 నుంచి వందెకరాల భూముంది. ఊరిలో అస్సలు భూమిలేని 32 బీసీ కుటుంబాలు, 21 దళిత కుటుంబాలు 30 ఏండ్ల సంది ఆ భూముల్లో ఉన్న చెట్లను నరుకుతూ సాగు చేసుకుంటున్నారు. పత్తి, మొక్కజొన్న, పెసర పండించుకుని జీవిస్తున్నారు. తమకు పట్టాలివ్వాలని అనేకమార్లు అధికారులను, ప్రజాప్రతినిధులకు విన్నవించారు. ఈ నేపథ్యంలో 1991లో అప్పటి ప్రభుత్వ హయాంలో అధికారులు కేవలం తొమ్మిది మంది రైతులకు మాత్రమే ఎకరం 18 గుంటల చొప్పున పట్టాలు చేసిచ్చారు. మిగతా రైతులు పట్టాలు లేకున్నా పంటలు పండించుకుంటున్నారు. పదిరోజుల కిందనే రెవెన్యూ అధికారులు ఆ భూములను స్వాధీనం చేసుకుంటామని నోటీసులు జారీ చేశారు. దీంతో రైతులు అయోమయంలో పడ్డారు.

పంట భూములకు నష్టం

అంతర్గాం మండలంలో వేలాది ఎకరాల ప్రభుత్వ భూములు, స్పిన్నింగ్ మిల్లుకు చెందిన భూములు పడావుగా ఉన్నాయి. అందులో వందలాది ఎకరాలు కబ్జాకు గురయ్యాయి. వాటిని స్వాధీనం చేసుకోకుండా ఎక్లాస్‌పూర్ గ్రామంలో పోడు వ్యవసాయం చేసుకుంటున్న దళిత రైతుల భూములకే ఎసరు పెట్టారు. పచ్చని పంట చేలల్లో మొక్కలు నాటాలని నిర్ణయించుకున్నారు. ఇటీవలే తహసీల్దార్, ఆర్ఐ, వీఆర్వో గ్రామాన్ని సందర్శించి రైతులకు నోటీసులు అందజేశారు. ఇక నుంచి పంటలు సాగుచేయొద్దని, ప్రస్తుతం ఆ పంటల్లో కలుపు తీయటం, మందులు వేయటం ఆపాలని నోటీసుల్లో పేర్కొన్నారు. ఈ విషయంపై గతవారం ప్రజావాణిలో ఇన్‌చార్జి కలెక్టర్‌కు ఫిర్యాదు అందింది. మూడు దశాబ్దాల నుంచి భూములనే నమ్ముకున్నామని, తమకు న్యాయం చేయాలని వేడుకుంటున్నారు.

పట్టా భూమినెట్ల తీసుకుంటరు: అయ్యాడపు చంద్రయ్య, ఎక్లాస్‌పూర్

1991లో నాకు ఎకరం 18 గుంటలకు అప్పటి అధికారులు పట్టా ఇచ్చారు. ఆ భూమిని ఇప్పటి అధికారులు మొక్కలు నాటేందుకు తీసుకుంటామని చెప్పారు. పట్టా భూమిని ఎట్ల తీసుకుంటరు. ఇది అన్యాయం.

భూముల్ని వదులుకోం : కట్కూరి శంకర్, ఎక్లాస్‌పూర్

30 ఏండ్ల నుంచి సాగు చేసుకుంటున్నం. మండలంలో వేల ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జాపాలైంది. పెద్దపెద్దళ్లోను వదిలి మా మీద పడ్డరు. మా భూముల్ని గుంజుకుంటే ఊరుకోం. భూమిని అస్సలు వదులుకోం.

ప్రభుత్వ భూముల స్వాధీనం : హన్మంతరావు, తహసీల్దార్, అంతర్గాం

ప్రభుత్వ భూముల్లో మొక్కలు నాటాలని పై నుంచి ఆదేశాలొచ్చాయి. ఎక్లాస్‌పూర్‌లో రైతులు సాగు చేసుకుంటున్న భూములు ప్రభుత్వానివే. ఆ భూముల్లో మొక్కలు నాటాలని నిర్ణయించాం. రైతులకు ఇప్పటికే తెలియజేశాం. ఆర్ఐతో సర్వే చేయించి 72 ఎకరాలు గుర్తించాం. కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపిస్తాం.

పస్తులుంచారు

(మొదటిపేజీ తరువాయి)

మధ్యాహ్న భోజన కార్మికులు వంటగదులకు తాళాలు తీయలేదు. దీంతో విద్యార్థులు రోజంతా పస్తులున్నారు. స్కూల్ దగ్గర ఉన్న విద్యార్థులు ఇండ్లకు వెళ్లి తినొచ్చారు. మిగతా విద్యార్థులు కాలే కడుపులతోనే క్లాసులు విన్నారు. ఉపాధ్యాయులను భోజనంపై గట్టిగా నిలదీస్తే 'ఈ ఒక్క రోజు ఓర్చుకోండి. రేపటి నుంచి ఎక్కడైనా అడ్జెస్ట్ చేసి భోజనం పెట్టేలా చూస్తాం' అని చెప్పారని నార్సింగ్ పాఠశాలలోని విద్యార్థులు చెప్పారు. మండలంలోని కోకాపేట్, మంచిరేవుల, హైదర్షాకోట్, మణికొండ, పుప్పాల్‌గూడ, నేక్నాంపూర్, బండ్లగూడ, ఫిరంచెరువు గ్రామాల్లోని పాఠశాలల్లో కూడా మధ్యాహ్న భోజనం పెట్టలేదు. అక్కడ కూడా విద్యార్థులు ఆకలితో అలమటించారు. మిగతా పాఠశాలల్లో కూడా రెండు, మూడు రోజుల్లో ఇదే పరిస్థితి తలెత్తే అవకాశముంది. రాష్ట్ర వ్యాప్తంగా మధ్యాహ్న భోజనానికి ఎసరు పెట్టడంలో భాగంగానే సర్కారు ఇలా చేస్తోందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. మధ్యాహ్న భోజనాన్ని యథావిధిగా నడిపించాలని కోరుతున్నారు. విద్యార్థులకు సన్నబియ్యం అన్నం పెడుతున్నామని సర్కారు ప్రచారం చేసుకుంటూనే...నెమ్మదిగా మధ్యాహ్న భోజన పథకాన్ని ఏజెన్సీలకు అప్పగించే కుట్ర చేస్తోందని పలువురు విమర్శిస్తున్నారు.

పిల్లలకు అన్నంపెట్టనిది వాస్తవమే : ఎస్.భూపతిరావు, ఎంఈఓ

కొన్ని రోజులుగా అన్ని పాఠశాలకు బియ్యం సరఫరాని ప్రభుత్వం నిలిపేసింది. పలు పాఠశాలల్లో శనివారం మధ్యాహ్న భోజనం పెట్టనిది వాస్తవమే. బియ్యం సమస్యపై డీఈఓకు కూడా విన్నవించాం. ఈ విషయంపై కలెక్టర్, డీఈఓలతో మరోసారి మాట్లాడుతాం. బియ్యం సరఫరాను పునరుద్ధరించాలని కోరుతాం.

భీంరెడ్డి, యూటీఎఫ్ మండలాధ్యక్షులు

ప్రతి నెలా పదో తేదీ వరకు బియ్యం రావట్లేదు. అప్పటిదాకా సర్పంచుల సహకారంతో నెట్టుకొస్తున్నాం. ఇది సరిగాదు. ప్రతి నెలా ఒకటో తేదీనే పాఠశాలలకు బియ్యం సరఫరా జరిగేలా చూడాలి.

జయమ్మ, మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం అధ్యక్షులు

మమ్మల్ని తొలగించే కుట్రలో భాగంగానే ప్రతి నెలా పదో తేదీ వరకు బియ్యం ఇవ్వట్లేదు. ఏజెన్సీలకు మధ్యాహ్న భోజనం నిర్వహణను ఇస్తే ఊరుకోబోం. దీనిపై ఎంతవరకైనా పోరాడుతాం. బియ్యం సరఫరా నిలిపివేతపై మండల వ్యాప్తంగా ఆందోళన చేస్తాం.

ఉద్యోగాల్లో తగ్గుతున్న మహిళలు

(మొదటిపేజీ తరువాయి)

తగ్గిపోయిందని ఆ నివేదిక ద్వారా తెలుస్తోంది. 2004 నుంచి 2012 వరకు ప్రభుత్వమిచ్చిన డేటాను ప్రపంచ బ్యాంక్ విశ్లేషించి తన నివేదికను రూపొందించింది. అయితే, మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పని చేస్తున్నవారిలో మహిళలే అధికంగా(2014లో51శాతం) ఉండటం గమనార్హం. ఈ పథకం కింద ఎక్కువభాగం సొంత గ్రామాల్లో పని చేస్తూ సాయంత్రానికల్లా తమ ఇండ్లకు చేరుకుంటారు. దాంతో, కుటుంబాల్లోనూ మహిళలకు అభ్యంతరాలు తక్కువ. అదే ఇతర చోట్లకు వెళ్లి పని చేయాలంటే మాత్రం తండ్రులు, భర్తలు, సోదరుల నుంచి తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతాయి. మహిళలకు సామాజిక భద్రత లేకపోవడం వల్లే కుటుంబ పెద్దలు వారిని పనిలో చేరకుండా అడ్డుకుంటున్నారు. ఔరంగాబాద్ మురికివాడలోని ఓ ట్రక్కు డ్రైవర్ తన 19 ఏండ్ల కూతురికి రెస్టారెంట్‌లో ఉద్యోగం రాగా, నిరాకరించారు. ఆమె ఆ పని కోసం శిక్షణ పొందిన యువతి. అభ్యంతరమెందుకని ఆయన్ని అడిగితే.. 'ఆమెను ఉద్యోగానికి పంపిస్తే, ఆ తర్వాత ప్రేమ పెండ్లి అంటూ వెళ్లిపోతుంది, నేను నా పొరుగువారికి ముఖం చూపించలేను' అంటూ సమాధానమిచ్చారు. ఆ యువతి తల్లి మాత్రం ఏమీ చెప్పకుండా మౌనంగా ఉండిపోయారు. మహిళలను బాధించే అంశం ఉద్యోగ సమస్యేనని సీఎంఐఈ మేనేజింగ్ డైరెక్టర్ మహేశ్‌వ్యాస్ అన్నారు. మహిళలకు ఉద్యోగాలు చేయాలన్న కోరిక ఉన్నప్పటికీ ఇంటికి దూరంగా పంపేందుకు కుటుంబం ఇష్టపడని పరిస్థితి.

దేశంలో ఉదార ఆర్థిక విధానాలు అమలులోకి వచ్చిన తర్వాతే మహిళల భాగస్వామ్యం తగ్గటం గమనార్హం. ఇదే కాలంలో పురుషుల నుంచి 2 కోట్ల 43 లక్షలమంది ఉద్యోగాల్లో అదనంగా చేరినట్టు ప్రపంచ బ్యాంక్ నివేదిక-2017 వెల్లడించింది. మరోవైపు పాఠశాలల్లో మాత్రం బాలికల చేరిక అధికమైంది. ప్రాథమిక పాఠశాలల్లో 100 శాతం పెరిగింది. ఉన్నత విద్యలో మహిళలు 2002-2003లో 7.5 శాతం ఉండగా, 2012-13లో వారి భాగస్వామ్యం 20 శాతానికి పెరిగింది. ఇంటి పనికే పరిమితమైన మహిళల్లో పట్టణ ప్రాంతాల్లో మూడో వంతు(33 శాతం)మంది, గ్రామీణ ప్రాంతాల్లో సగం(50 శాతం)మంది వేతన ఉద్యోగాలను కోరుకుంటున్నట్టు 2011 నేషనల్ శాంపిల్ సర్వేలో వెల్లడైంది. భారత ఆర్థిక వ్యవస్థలో పురుషులతో సమానంగా మహిళల భాగస్వామ్యం ఉంటే 2025 కల్లా దేశ జీడీపీ 60 శాతం వృద్ధి చెంది 2 లక్షల 90 వేల కోట్ల డాలర్లకు(రూ.185 లక్షల 60 వేల కోట్లు) చేరుకుంటుందని ప్రముఖ మేధోమథన సంస్థ మెకిన్సీ గ్లోబల్ ఇనిస్టిట్యూట్ అంచనా(2015 నివేదికలో) వేసింది. ప్రస్తుతం మన దేశ జీడీపీలో మహిళల వాటా 17 శాతం మాత్రమే. ఇది ప్రపంచ సగటు 37 శాతంతో పోలిస్తే చాలా తక్కువేనని అర్థమవుతోంది.



తెలంగాణాలో మావోయిస్టుల కదలికలు

- ఎస్పీలను అప్రమత్తం చేసిన రీజియన్ ఐజీ

నవ తెలంగాణ, ప్రత్యేక ప్రతినిధి

ఉత్తర తెలంగాణ జిల్లాల్లో మావోయిస్టుల కదలికలు సాగుతున్నాయని , అప్రమత్తంగా మెలగాలని నార్త్ రీజియన్ ఐజీ వై.నాగిరెడి ఆయా జిల్లాల ఎస్పీలను అప్రమత్తం చేశారు. గత కొంత కాలంగా స్తబ్దుగా ఉన్న మావోయిస్టుల కార్యకలాపాలు ఈ మధ్య కాలంలో కొంత చురుకైనట్టు ఇంటెలిజెన్స్ విభాగం నుంచి పోలీసు ఉన్నతాధికారులకు సమాచారం అందినట్టు తెలిసింది. ప్రధానంగా ఇటీవల మావోయిస్టులు జరుపుకున్న అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో ఉత్తర తెలంగాణాలోని కొన్ని మారుమూల ప్రాంతాలలో మావోయిస్టులు గ్రామసభలను నిర్వహించినట్టుగా నిఘా వర్గాలకు సమాచారం అందినట్టు తెలిసింది. అలాగే వాల్‌పోస్టర్లు వేయడం వంటి చర్యలకు మావోయిస్టులు పాల్పడటాన్ని పోలీసు ఉన్నతాధికారులు కూడా సీరియస్‌గా తీసుకున్నట్టు తెలిసింది. ఈ నేపథ్యంలోనే సిరిసిల్లా జిల్లా లో దళితులపై పోలీసులు రిపిన లాఠీ చార్జి ఘటనలను ఖండిస్తు ప్రకటన చేసిన ఆ పార్టీ తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి జగన్ తొలి సారిగా సీఎం కేసీఆర్, ఆయన కుమారుడు మంత్రి కేటీఆర్‌లను ప్రజలు శిక్షిస్తారంటూ చేసిన ప్రకటనను కూడా నిఘా విభాగం తీవ్రంగా పరిగణించినట్టు తెలిసింది. ఈ పరిస్థితిలో తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతమే గాక ఉత్తర తెలంగాణా జిల్లాల్లో కొత్తగా మావోయిస్టులు కేడర్ ఏమైనా పెంచుకున్నారా అనే కోణంలోను అధికారులు ఆరా తీస్తున్నారు. వీటన్నింటిని పరిగణలోకి తీసుకుని నార్త్ రీజియన్ ఐజీ నాగిరెడ్డి తమ ప్లోఈసు యంత్రాంగాన్ని అప్రమత్తం చేసినట్టు సమాచారం.

నిర్మాణ దశలోనే...

(మొదటిపేజీ తరువాయి)

ఉపయోగించాల్సి ఉండగా, బీమ్‌లకు 20కట్టలు, స్లాబ్‌లకు 20కట్టల సిమెంట్‌తోనే సరిపెట్టారు. ఒక్కో సిమెంట్ కట్టకు 7తట్టల కంకర, 7తట్టల ఇసుక కలపాల్సి ఉండగా 10తట్టల ఇసుక, 10తట్టల కంకర కలిపి నిర్మాణాలు చేపడుతున్నట్టు తెలిసింది. పిల్లర్‌కు, స్లాబ్‌కు 12-18మిల్లీ మీటర్ల ఇనుము ఉపయోగించాల్సి ఉండగా 6-12మిల్లీమీటర్ల క్వాలిటీ లేని ఇనుమును వినియోగిస్తున్నారు.

పర్యవేక్షించని అధికారులు...

ఇండ్ల నిర్మాణంలో సంబంధిత అధికారుల పర్యవేక్షణ లేకుండా పోయింది. ఓ సూపర్‌వైజర్, కూలీలు తప్పా మరో అధికారే లేరు. పర్యవేక్షణకు పనుల వద్దకు ఎవ్వరూ రారని అక్కడి కూలీలే చెబుతున్నారు. అధికార పార్టీకి చెందిన కాంట్రాక్టర్ కావడం వల్లే అధికారులెవరూ పట్టించుకోవడం లేదని వారు ఆరోపిస్తున్నారు.

అధికారులు పర్యవేక్షించాలి : ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య

నాణ్యత లేని ఇటుక, సిమెంట్, ఇసుక ఉపయోగిస్తున్నా అధికారులు ఎందుకు పర్యవేక్షించడం లేదని సత్తుపల్లి శాసన సభ్యులు సండ్ర వెంకటవీరయ్య ప్రశ్నించారు. శనివారం చిన్నకోరుకొండి గ్రామంలో చేపడుతున్న నిర్మాణాలను ఆయన పరిశీలించారు. డబుల్ బెడ్‌రూం పథకం మరో కందుకూరు కావద్దని హెచ్చరిక చేసినా ఎవరూ పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తానే స్వయంగా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినా ఎవరూ పర్యవేక్షించలేదని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పున:నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు.

ఇండ్లు నాణ్యతతో నిర్మించి ఇవ్వాలి : తన్నీరు కృష్ణార్జున్‌రావు, సీపీఐ(ఎం) నాయకులు

ఇండ్లు నాణ్యతతో నిర్మించి ఇవ్వాలని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి తన్నీరు కృష్ణార్జున్‌రావు డిమాండ్ చేశారు. నాసిరకంగా నిర్మిస్తున్న డబుల్ బెడ్ రూం ఇండ్లను ఆయన శనివారం పరిశీలించిన అనంతరం విలేకరులతో మాట్లాడుతూ మట్టితో కూడిన ఇసుక ఉపయోగిస్తున్నారన్నారు. నిర్మాణ దశలోనే ఇండ్లు కూలేలా ఉన్నాయని తెలిపారు. పునాది కనీసం 10అడుగులు తీయాల్సి ఉండగా కేవలం ఐదు అడుగులు మాత్రమే తీసి నిర్మిస్తున్నారన్నారు.

నాసిరకం ఇసుకతో నిర్మిస్తున్నారు : ఉబ్బన వెంకటమ్మ

పూర్తిస్థాయిలో మట్టి ఉన్న ఇసుక ఉపయోగించడం వల్ల పిల్లర్లు, మెట్లు కూలిపోయాయి. ఇలాంటి ఇండ్లు కట్టిచ్చి మా ప్రాణాలతో చెలగాటం ఆడొద్దు.

పర్యవేక్షణ లేదు : జిల్లెళ్ల నాగభూషణం

ఇండ్ల నిర్మాణాలను అధికారులు గానీ, కాంట్రాక్టర్లుగానీ పర్యవేక్షించడం లేదు. ప్రభుత్వం ఇచ్చే డబ్బులు మాకే ఇస్తే నాణ్యతతో నిర్మించుకుంటాం. ఇలా కాంట్రాక్టర్‌కిచ్చి మా ప్రాణాలు తీయొద్దు.

జీఎస్టీపై న్యాయపోరాటం

(మొదటిపేజీ తరువాయి)

రాయాలని నిర్ణయించారు. నీటి పారుదల, మంచినీటి పథకాలు, గృహ నిర్మాణం, రహదారుల నిర్మాణం లాంటి కార్యక్రమాలకు జీఎస్టీని ఎత్తివేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఆన్ గోయింగ్ ప్రాజెక్టులకు జీఎస్టీని 12 శాతం వర్తింపజేయాలని కేంద్రం నిర్ణయించడం అన్యాయమన్నారు. జులై ఒకటికి ముందు ప్రారంభించిన ప్రాజెక్టులకు జీఎస్టీ వర్తింపజేయడం వల్ల తెలంగాణకు రూ.19వేల కోట్ల నష్టం జరుగుతుందని సీఎం అన్నారు. దీన్ని జాతీయ సమస్యగా ఆయన పేర్కొన్నారు. బడ్జెట్ ప్రవేశపెట్టిన తరువాత తీసుకున్న నిర్ణయం కావడం వల్ల అమలు చేయలేమని పేర్కొన్నారు. కేంద్రం తన నిర్ణయాన్ని మార్చుకోవాలని, లేకుంటే న్యాయపోరాటం చేస్తామని కేసీఆర్ స్పష్టంచేశారు.

సర్కారంటే మంత్రులే కాదు

(మొదటిపేజీ తరువాయి)

ఇక్కడే చదివామని కొందరు అధికారులు అంటున్నారని చెప్పారు. సచివాలయం, వివిధ శాఖల్లో తెలంగాణ అధికారులుండాలని ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. కానీ ఆంధ్ర అధికారులు పెత్తనం సాగిస్తున్నారని చెప్పారు. మహబూబాబాద్ కలెక్టర్‌పై ఎమ్మెల్యే దురుసుగా ప్రవర్తించడాన్ని ఖండించామన్నారు. ఏపీకి చెందిన ఓ ఐఏఎస్ అధికారి, మహబూబ్‌నగర్ కలెక్టర్ ఇటీవలే జాయింట్ కలెక్టర్‌గా పనిచేస్తున్న రెవెన్యూ అధికారిపై చేయి చేసుకోవడాన్ని ఖండిస్తున్నామని చెప్పారు. ఇలాంటివి భవిష్యత్తులో జరిగితే తీవ్ర పరిణామాలుంటాయని అన్నారు. ఆంధ్ర అధికారులను ప్రాధాన్యత లేని పోస్టుల్లో నియమించాలని కోరారు. ఉమ్మడి ఏపీలో వేధింపులకు గురైన తెలంగాణ అధికారులను గుర్తించి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రస్తుతం పనిచేస్తున్న ఉద్యోగులకు పదోన్నతులు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. జోనల్ వ్యవస్థను రద్దు చేసి, రెండంచెల విధానం తేవడాన్ని స్వాగతిస్తున్నామని చెప్పారు. రాష్ట్ర, జిల్లా క్యాడర్ ఉంటాయన్నారు. రాష్ట్రక్యాడర్ పోస్టులకు ఇతర రాష్ట్రాల నుంచి అభ్యర్థులు వచ్చే అవకాశమున్నందున 90 శాతం పోస్టులు స్థానికులకు, 10 శాతం ఓపెన్‌మెరిట్ ఆధారంగా ఇవ్వాలని కోరారు. అన్ని శాఖల్లోని ఉద్యోగులకూ ఐఏఎస్‌లుగా పదోన్నతులు కల్పించాలని సూచించారు. టీజీవో అధ్యక్షురాలు వి మమత మాట్లాడుతూ 31 జిల్లాలుగా విడిపోయినా సిబ్బందిని విభజించలేదన్నారు. పనిఒత్తిడి పెరిగిందని చెప్పారు. 31 జిల్లా కేంద్రాల్లోని ఉద్యోగులకు 20 శాతం హెచ్‌ఆర్‌ఏ ఇవ్వాలని కోరారు. 2018, జూన్ 30తో పదో పీఆర్సీ ముగుస్తుందని, 11 పీఆర్సీని నియమించాలని డిమాండ్ చేశారు. సీపీఎస్‌ను రద్దు చేయాలని, పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. ఆంధ్రలో పనిచేస్తున్న తెలంగాణ ఉద్యోగులను వెంటనే ఇక్కడికి రప్పించాలని అన్నారు. వెల్‌నెస్ కేంద్రాలు అన్ని జిల్లాల్లోనూ ప్రారంభించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీజీవో నాయకులు జి విష్ణువర్ధన్‌రావు, కె పురుషోత్తంరెడ్డి, ఎస్ సహదేవ్, టి రవీందర్‌రావు, మధుసూదన్‌గౌడ్, మిర్జాఅలీబేగ్, డి అరుణ్‌కుమార్, వి సుజాత, బి వెంకటయ్య, ఎంబి కృష్ణాయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బిడ్డపై బెంగ

(మొదటిపేజీ తరువాయి)

మున్సిపాలిటీల ప్రగతి సాధించలేదు. ఎన్ని సమీక్షలు చేసినా గ్రేటర్ హైదరాబాద్‌లో ఎక్కడి వేసిన గొంగళి అక్కడే అన్నట్టుగా ఉందన్న విమర్శలు ఉన్నాయి. ప్రతీ శాఖలోనూ విమర్శలు రావడంతో ముఖ్యమంత్రి తలపట్టుకుం టున్నారని ప్రభుత్వ వర్గాలు అంటున్నాయి. చివరికి మైనింగ్ శాఖలోనూ ఆరోపణలు వస్తున్నాయి. తాజాగా ఇసుక వ్యవహారం ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేసింది. గతంలో ఉన్న కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వాలు వల్ల ఇసుక ఆదాయం రాలేదని, తమ వల్ల ఇసుక ఆదాయం పెరిగిందని ఘనంగా చెప్పుకోవడం గమనార్హం. ఇష్టానురీతిన అనుమతులు ఇవ్వడంతో ఇప్పుడు ఇసుక మాఫియా ఆగడాలను అడ్డుకట్టవేయాల్సిన పరిస్థితి ప్రభుత్వానికి ఏర్పడింది. ఇసుక మాఫియాకు పోలీసుల భద్రత కల్పించడం మరిన్ని విమర్శలకు దారితీసినట్లయింది. కేటీఆర్ నియోజకవర్గమైన సిరిసిల్లలోనే ఆయన రాజకీయ భవిష్యత్తు ఆందోళనకరంగా ఉంది. ఇది సాగుతుండగానే పోలీసుల వాహనాల కొనుగోలు వ్యవహారంలో కేటిఆర్ స్పందించిన తీరుపైనా ముఖ్యమంత్రి కేసీఆర్ ఆగ్రహంగా ఉన్నారని తెలిసింది. అసెంబ్లీ సీటు మార్చినా తన కుమారుడు భవిష్యత్తు అంధకారంగా మారే ప్రమాదముందనేది కేసీఆర్ ఆలోచనగా ఉంది. దీంతో తనయుడు భవిష్యత్తును చక్కదిద్దేందుకు ప్రభుత్వపరంగా ముఖ్యమంత్రి కేసీఆర్ చక్రం తిప్పుతున్నారని తెలిసింది. కేంద్రంతో మంచి సంబంధాలు కొనసాగేందుకు సిద్ధమవుతున్నారు. రాష్ట్రంలో కేటీఆర్‌ను భవిష్యత్తు నేతగా ఉంచాలన్నదే కేసీఆర్ ప్లాన్‌గా ఉందని విశ్లేషకులు పేర్కొన్నారు. ఎప్పటికైన కేసీఆర్ కేంద్రానికి వెళ్లడం ఖాయమని, అప్పటివరకు కేటీఆర్‌ను భావినేతగా తీర్చిదిద్దాలన్నది ఆయన వ్యూహమని అంటున్నారు.

నిటి ఆయోగ్ వైస్ చైర్మెన్‌గా రాజీవ్‌కుమార్

(మొదటిపేజీ తరువాయి)

పాలసీ రీసెర్చ్(సీపీఆర్)లో సీనియర్ అధికారిగా ఉన్నారు. ఇంతకుముందు ఎఫ్ఐసీసీఐ సెక్రెటరీ జనరల్‌గా, ఇండియన్ కౌన్సిల్ ఫర్ రీసెర్చ్ ఆన్ ఇంటర్నేషనల్ ఎకానమిక్ రిలేషన్స్(ఐసీఆర్ఐఈఆర్)కు డైరెక్టర్ అండ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్‌గా, నేషనల్ సెక్యూరిటీ అడ్వైసరీ బోర్డు సభ్యుడిగా(2006-08) పని చేశారు. కేంద్ర ఆర్థిక, పరిశ్రమల మంత్రిత్వ శాఖల్లోనూ ఉన్నతాధికారిగా సేవలందించారు. నిటి ఆయోగ్ వైస్ చైర్మెన్‌గా పని చేస్తున్న అరవింద్ పనగారియా ఈనెల 1న తన పదవికి రాజీనామా చేస్తున్న సంగతి తెలిసిందే.

వెనిజులా అధ్యక్షుడికి మద్దతుగా ర్యాలీ

కరాకస్ : వెనిజులా అధ్య క్షుడు నికోలస్ మదురోకు మద్దతుగా పార్టీ కార్యకర్తలు, మద్దతుదారులు రాజధాని కరాకస్ నగరంలో భారీ ర్యాలీ తీశారు. వేలాది మందిగా జాతీయ అసెంబ్లీకి తరలివెళ్లారు. ప్లకార్డులు చేబూని మదురోకు మద్దతుగా నినాదాలు చేశారు. రాజ్యాంగ పరిషత్తు సభ్యుల ప్రమాణ స్వీకారాన్ని తిలకించారు. ఈ ర్యాలీలో ప్రతిపక్ష సభ్యులు సైతం పాల్గొనడం గమనార్హం. కాగా, వెనిజులా రాజ్యాంగం పట్ల విమ ర్శలు వినిపిస్తున్నాయి. ఈనేప థ్యంలో ఆ రాజ్యాంగాన్ని రద్దు చేసి దాని స్థానంలో కొత్త రాజ్యాంగాన్ని తీసుకొస్తామని అధికార సోషలిస్ట్ పార్టీ ప్రకటించింది.మదురో నిర్ణ యాన్ని అక్కడి ప్రతిపక్ష పార్టీలు తీవ్రంగా వ్యతిరేకించాయి. తాజా గా, నూతన రాజ్యాంగాన్ని రూపొందించనున్నట్టు మదురో వెల్లడించారు.

సెన్సెక్స్ ▲ 88
32,325

నిఫ్టీ ▲ 53
10,066

శుక్రవారం మార్కెట్లు ముగిసినా సమయానికి

డాలరుకు రూపాయి విలువ
63.58



బంగారం(10.గ్రా)
రూ. 29,005



వెండి (కేజీ)
రూ. 40,800



కోడిగుడ్లు

హైదరాబాద్	320	విజయవాడ	320
ఒక్కగుడ్డుకు	3.80	చెన్నై	355
వరంగల్	322	ముంబయి	365




సిండికేట్ బ్యాంకు నష్టం రూ.263 కోట్లు



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ సంస్థ సిండికేట్ బ్యాంక్ జూన్‌తో ముగిసిన మూడు నెలల కాలానికి రూ.263.19 కోట్ల నికర నష్టాన్ని వెల్లడించింది. మొండి బాకీలకు కేటాయింపులు పెరిగిన కారణంగా బ్యాంకు ఏప్రిల్-జూన్ మధ్య కాలంలో ఈ నష్టాల్ని నమోదు చేసింది. అంతకు ముందు ఏడాది ఇదే త్రైమాసిక కాలంలో బ్యాంకు రూ.79.13 కోట్ల మేర లాభాన్ని ప్రకటించింది. ఈ ఆర్థిక సంవత్సరం మొదటి మూడు నెలల కాలంలో (జూన్ త్రైమాసికంలో) బ్యాంకు మొత్తం ఆదాయం కూడా రూ.6,419.12 కోట్ల నుంచి రూ.6,171.49 కోట్లకు జారింది. ఇదే కాలంలో బ్యాంకు మొండి బాకీల నిమిత్తం బ్యాంకు కేటాయింపులు 79 శాతం మేర పెరిగి రూ.774.41 కోట్ల నుంచి రూ.1,385.66 కోట్లకు చేరాయి. కార్పొరేట్, హోల్‌సేల్ బ్యాంకింగ్ కార్యకలాపాల ద్వారా బ్యాంకు ఆదాయం రూ.2,562.28 కోట్ల నుంచి రూ.2,088.98 కోట్లకు తగ్గింది. రిటైల్ బ్యాంక్ కార్యకలాపాల ద్వారా బ్యాంకుకు లభించిన ఆదాయం మాత్రం స్వల్పంగా పెరిగి రూ.1,973.66 కోట్ల నుంచి రూ.1,984.67 కోట్లకు చేరింది. జూన్ త్రైమాసికానికి బ్యాంకు స్థూల నిరర్థక ఆస్తుల విలువ మొత్తం రుణ వితరణలో 7.53 శాతం నుంచి 9.96 శాతానికి చేరాయి. నికర నిరర్థక ఆస్తుల విలువ కూడా 5.04 శాతం నుంచి 6.27 శాతానికి చేరాయి.

పతాంజలిలో సేవ పేరుతో శ్రమ దోపిడీ!

- మాజీ సీఈవో తీవ్ర ఆరోపణలు



న్యూఢిల్లీ: యోగా గురు, కార్పొరేట్ స్థాయి వ్యాపారాలు కలిగిన రాందేవ్ బాబా సేవ పేరుతో ఉద్యోగుల శ్రమ దోపిడీకి పాల్పడుతున్నారని పతాంజలి మాజీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈవో) ఎన్.కె. పాత్ర తీవ్ర విమర్శలు చేశారు. ఎఫ్ఎంసీజీ రంగంలో రూ. 10,561 కోట్ల పైగా రెవెన్యూతో భారీ లాభాలను ఆర్జిస్తున్న రాందేవ్ సంస్థలు ఉద్యోగులకు తగిన స్థాయిలో వేతనాలను చెల్లించడం లేదని తెలిపారు. పైగా సిబ్బంది చేస్తున్న పనిని సేవగా భావించాలని పేర్కొనడం దారుణమన్నారు. సంస్థలోని ఉద్యోగులకు కంపెనీ చాలా తక్కువ మొత్తంలో వేతనాలు చెల్లిస్తోందని నిజాలు బయటపెట్టారు. తనకు కూడా చాలా తక్కువ జీతం చెల్లించే వారని గుర్తు చేశారు. ముఖ్యంగా తనను కూడా కంపెనీ ఉచితంగా సేవ చేయాలని కోరుకున్నారని వెల్లడించారు. చెప్పే మాటలకీ, చేసే పనులకు అస్సలు పొంతన ఉండదని తెలిపారు. ఈ నేపథ్యంలోనే తాను పతాంజలిని వదిలేశానని అన్నారు. తాను సీఈవో గా ఉన్నప్పుడు పతాంజలి ఆయుర్వేద, పతంజలి ఫుడ్‌పార్క్‌కు సంబంధించిన రెండు విధులు ఒకే సారి నిర్వర్తించానని అన్నారు. ఈ రెండు విధులకు వేరువేరుగా వేతనం చెల్లిస్తానని రాందేవ్ హామీ ఇచ్చి అనంతరం ఎగ్గొట్టారని గుర్తు చేశారు. తనకు, ఉద్యోగులకు ఇచ్చిన అనేక హామీలను ఉల్లంఘించారని ఒక మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పాత్ర ఆరోపించారు.

సరిహద్దుల్లో చెక్‌పోస్టులకు మంగళం

జీఎస్టీ ఈ-వే బిల్లు విధానానికి కౌన్సిల్ సూత్రప్రాయంగా సమ్మతి

- రూ.50,000 దాటిన సరుకులకు'కొత్త' బిల్లులు
- ఎలక్ట్రానిక్ రూపంలోనే పన్ను చెల్లింపుల సమీక్ష
- 19 రకాల సేవలపై కరుణ చూపిన కౌన్సిల్
- పన్ను శ్లాబ్‌లను హేతుబద్ధీకరిస్తూ నిర్ణయం
- జీఎస్టీ ఫలాలు ప్రజలకందించాలి: అరుణ్ జైట్లీ
- సమీక్షకు గాను ప్రత్యేకంగా రాష్ట్రాల్లో కమిటీలు
- వచ్చే నెల 9న హైదరాబాద్‌లో తదుపరి మీట్



న్యూఢిల్లీ: దేశ వ్యాప్తంగా అమలులోకి వచ్చిన 'వస్తు సేవల పన్ను' (జీఎస్టీ) అమలు తీరును సమీక్షించేందుకుగాను జీఎస్టీ కౌన్సిల్ శనివారం ఇక్కడ సమావేశమైంది. ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ సారథ్యంలో అన్ని రాష్ట్రాలకు చెందిన ఆర్థిక మంత్రులు సభ్యులుగా సాగిన 20వ కౌన్సిల్ సమావేశంలో పలు కీలక నిర్ణయాలను తీసుకున్నారు. ఈ-వే బిల్లు విధివిధానాలకు కౌన్సిల్ ఈ సమావేశంలో సమ్మతి తెలిపింది. ఈ విషయాన్ని ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ వెల్లడించారు. రూ.50వేల కంటే ఎక్కువ విలువైన వస్తువులను సరఫరాకు పంపేందుకు ముందుగానే ఉత్పత్తిదారు లేదా సరఫరాదారు ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసి ఈ-వే బిల్లును పొందాల్సి ఉంటుందని అరుణ్‌జైట్లీ స్పష్టంచేశారు. వీటిని ఎలక్ట్రానిక్ రూపంలో తీసుకురానున్నట్లుగా చెప్పారు. అయితే మినహాయించిన గూడ్స్‌కు ఈ-వే బిల్లు అవసరం లేదని తెలిపారు. త్వరలోనే ఈ-వే బిల్లు విధివిధానాలను నోటిఫై చేయనున్నట్టుగా తెలిపారు. అందుబాటులో ఉన్న సమాచారం మేరకు అక్టోబరు 1 నుంచి దీనిని అమలులోకి తీసుకు వచ్చేందుకు కౌన్సిల్ సూత్రప్రాయంగా అంగీకారం తెలిపినట్టు సమాచారం. ఈ-వే బిల్లు విధానం తనిఖీనకు ఎలాంటి చెక్‌పోస్టులు అవసరం లేదని, కేవలం టెక్నాలజీతోనే వీటి పర్యవేక్షణను అమలు చేయనున్నట్టు జైట్లీ తెలిపారు. దీంతో రాష్ట్ర సరిహద్దులో ఉన్న చెక్‌పోస్టులను ఎత్తివేసేందుకు మార్గం సుగమకానుంది. ల

పలు రకాల సేవలపై పన్ను తగ్గింపు..

జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో పలు రకాల సేవలపై పన్ను భారాన్ని తగ్గిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఇందులో వస్త్రాల జాబ్‌వర్క్, ప్రభుత్వ కాంట్రాక్టులతో పాటు ట్రాక్టర్ విడిభాగాలపై పన్నును తగ్గించారు. ట్రాక్టర్ విడిభాగాలు, 20 అంగుళాల కంప్యూటర్ మానిటర్లపై ఉన్న 28 శాతం జీఎస్టీ పన్నురేట్లను 18 శాతానికి.. వర్క్ కాంట్రాక్ట్స్‌లపై జీఎస్టీని 18 శాతం నుంచి 12 శాతానికి తగ్గించినట్టు అరుణ్‌జైట్లీ పేర్కొన్నారు. వస్త్రాల జాబ్‌వర్క్‌పై పన్ను భారాన్ని 18 శాతం నుంచి 5 శాతానికి కుదిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ప్రచురణ సంస్థ తమ సొంత న్యూస్‌పేపర్లు, పుస్తకాలను ముద్రించుకుంటే 5 శాతం జీఎస్టీ, ఇతర సంస్థల ప్రచురణలను ప్రచురిస్తే 12 శాతం పన్నును చెల్లించాలని కౌన్సిల్‌లో తీర్మానించారు. పంట చేతికొచ్చాక చేపట్టే వ్యవసాయాధారిత సేవలపై కూడా కౌన్సిల్ కరుణ చూపింది. ధాన్యం నిల్వ చేయడంతో పాటుల పలు సేవలపై ఉన్న 18 శాతం పన్ను భారాన్ని 12 శాతానికి తగ్గించారు. దీనికి తోడు క్యాబ్ సేవలు, ప్లానిటోరియం ప్రవేశ రుసుములపై ఉన్న పన్ను భారాన్ని కూడా ఈ సమావేశంలో తగ్గిస్తూ నిర్ణయం తీసుకున్నారు.

కఠిన చర్యలు తప్పవు

దేశంలో కొత్త అందుబాటులోకి వచ్చిన వస్తుసేవల పన్ను వల్ల వివిధ రూపాల్లో కలిగే ప్రయోజనాల్ని దేశ ప్రజలకు బదిలీ చేయాలని జైట్లీ రాష్ట్రాలను కోరారు. ఇందుకోసం ప్రత్యేక యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. ఇలా చేయని సంస్థలపై త్వరలోనే చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్టుగా ఆయన హెచ్చరించారు. ఇప్పటి వరకు 71 లక్షలకు పైగా పన్ను చెల్లింపుదారులు జీఎస్టీలోకి మరలారని, కొత్తగా 15.67 లక్షల దరఖాస్తులు అందినట్టు తెలిపారు. కానీ వాటిలో 12 లక్షలకు మాత్రమే ఆమోదం తెలిపినట్టు చెప్పారు. జీఎస్టీ కౌన్సిల్ తదుపరి సమావేశం వచ్చే నెల 9న హైదరాబాద్‌లో జరగనున్నట్లుగా జైట్లీ తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రం తరపున పాల్గొన్న ఐటీ మంత్రి తారకరామారావు పలు అంశాలను చర్చకు తీసుకు వచ్చారు. తమకు న్యాయం జరగపోతే కోర్టును ఆశ్రయించడానకి వెనకాడబోమని ఆయన తెలిపినట్టుగా సమాచారం.

ఇక రాష్ట్రంలో గ్రామీణ డిజిటల్ అక్షరాస్యత కేంద్రం

- కుటుంబంలో కనీసం ఒకరికి డిజిటల్ అవగాహనే లక్ష్యం
- నాస్కామ్-ఆర్సిసియమ్‌ల తోడ్పాటుతో ఏర్పాటు



నవతెలంగాణ, హైదరాబాద్: రాష్ట్రంలో తొలి గ్రామీణ డిజిటల్ అక్షరాస్యత కేంద్రం ప్రారంభమైంది. 'ప్రధాన మంత్రి గ్రామీణ్ డిజిటల్ సాక్షరత అభియాన్' కార్యక్రమంలో భాగంగా పెద్దషాపూర్ గ్రామంలో ఈ డిజిటల్ అక్షరాస్యత కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. నాస్కామ్-ఆర్సిసియమ్ సంస్థలు ఈ కేంద్రం ఏర్పాటునకు గాను ఉమ్మడిగా ముందుకు వచ్చాయి. ఈ కేంద్రం ద్వారా మొబైల్ ఫోన్లు, కంప్యూటర్ల వాడకంపై శిక్షణను ఇవ్వనున్నారు. కుటుంబంలో కనీసం ఒక్కరైనా డిజిటల్ అక్షరాస్యతను కలిగి తమ మొబైల్‌ఫోన్ లేదా కంప్యూటర్ వాడకం ద్వారా ఆధార్, రేషన్, పాన్ కార్డులకు ఆన్‌లైన్‌లో ధరఖాస్తు చేసుకోవడం, బిల్లులు చెల్లించడం, ఈ-మెయిల్స్ పంపడంతో పాటు ఇతరు ఆన్‌లైన్ సౌకర్యాలను వినియోగించుకోనేలా ఈ కేంద్రం ద్వారా శిక్షణనివ్వనున్నారు. నాస్కామ్ ప్రాంతీయ డైరెక్టర్ శ్రీకాంత్ శ్రీనివాసన్ ఈ సందర్భంగా మాట్లాడతూ దేశ వ్యాప్తంగా ఇలాంటి 170 కేంద్రాలను ఏర్పాటు చేయగా అందులో 9 తెలంగాణ రాష్ట్రంలోనే ఉన్నట్టుగా తెలిపారు. ఇప్పటి వరకు ఈ కేంద్రాల ద్వారా దాదాపు 7,000 మంది యువతకు డిజిటల్ టెక్నాలజీలపై ప్రాథమిక అవగాహన అంశంపై శిక్షణనిచ్చినట్టుగా తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్సెసియమ్ సంస్థ భారత విభాగం అధినేత రన్‌విజయ్ లాంబా మాట్లాడుతూ నాస్కామ్ వారి సౌజన్యంతో మరిన్ని గ్రామీణ ప్రాంతాలకు డిజిటల్ నైపుణ్యత పెంపు కార్యక్రమాలను ముందుకు తీసుకుపోనున్నట్టుగా వివరించారు.

విలీనంతో చిన్న సంస్థలకు పెద్ద కష్టమే..!



న్యూఢిల్లీ: బ్యాంకుల విలీన ప్రక్రియ దేశ ఆర్థిక వ్యవస్థపై పెను ప్రభావం చూపనుందని తాజాగా మరో అధ్యయనం వెల్లడించింది. చిన్న బ్యాంకులను పెద్ద బ్యాంకుల్లో విలీనం చేయడం వల్ల సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు (ఎంఎస్ఎంఈ) రుణ లభ్యత భారీగా తగ్గిపోయే అవకాశం ఉందిన రిసర్జెంట్ ఇండియా సంస్థ తన అధ్యయనంలో తెలిపింది. చిన్న బ్యాంకుల స్థానంలో పెద్ద బ్యాంకుల రావడం వల్ల చిన్నచిన్న వ్యాపారాల వారికి రుణాలు లభించడం గగనంగా మారుతుందని ఆ సంస్థ తెలిపింది. ఎంఎస్ఎంఈలకు తక్కువ మొత్తంలోనే రుణాలు కావాల్సి వస్తుందని వీటిని ఇచ్చేందుకు పెద్ద బ్యాంకులు అంత పెద్దగా ఆసక్తి కనబరచకపోవచ్చని ఈ అధ్యయనం తెలిపింది. దీనికి తోడు పెద్ద బ్యాంకుల రుణ వితరణ చార్జీలు కూడా అధికంగానే ఉండనున్నందున చిన్న సంస్థల వారు రుణాలు తీసుకోవడం మరింత భారంగా మారొచ్చని రెసర్జెంట్ తన అధ్యయనంలో అభిప్రాయపడింది. దీంతో ఈ పరిశ్రమలు కుంటుపడొచ్చని తెలిపింది. దీంతో దేశీయ తయారీ రంగంలో దాదాపు 45 శాతం వాటాను, ఎగుమతుల్లో 40 శాతం వాటాను కలిగి.. దేశ ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్న ఎంఎస్ఎంఈ సంస్థలకు ఆర్థికం గడ్డుపరిస్థితులు ఎదరయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ప్రపంచ గిరిజన దినోత్సవాన్ని ప్రభుత్వాలు పాటించవా..?

- టీఎస్ఎఫ్ పోస్టర్ ఆవిష్కరణలో విమలక్క



నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

ప్రపంచ గిరిజన దినోత్సవాన్ని ప్రభుత్వాలు ఎందుకు పాటించడం లేదని అరుణోదయ సంస్కృతిక సమాఖ్య అధ్యక్షురాలు విమలక్క ప్రశ్నించారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శనివారం ట్రైబల్ స్టూడెంట్స్ ఫెడరేషన్(టీఎస్ఎఫ్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోస్టర్లను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విమలక్క మాట్లాడుతూ... గిరిజనులు తమ హక్కుల కోసం నినదించిన మహత్తరమైన రోజుగా ఐక్యరాజ్యసమితి గుర్తించి, ఆరోజు ప్రపంచ గిరిజన దినోత్సవంగా పాటించాలని తీర్మానించిందని గుర్తుచేశారు. అయినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాత్రం ఆగష్టు 9న అంతర్జాతీయ గిరిజన దినోత్సవాన్ని జరపకపోవడం విచారకరమని చెప్పారు. అనేక పోరాటాల అనంతరం గిరిజన తెగలకు అటవీ భూములపై హక్కులు కల్పిస్తూ 2006లో చట్టం వచ్చిందనీ, కానీ చట్టం సక్రమంగా అమలు కావడం లేదని అన్నారు. చట్టం ప్రకారం అటవీ భూమిపై ఆధారపడి జీవిస్తున్న ప్రతి గిరిజన కుటుంబానికీ 10 ఎకరాల వరకూ పట్టా ఇవ్వొచ్చని తెలిపారు. గిరిజనుల సాంప్రదాయక భూములు గిరిజన తెగలకే దక్కాలని అన్నారు. గిరిజన విద్య పేరుతో ప్రైవేటు, కార్పొరేట్ సంస్థలకు ఐటీడీఏలు దోచిపెడుతున్నాయని విమర్శించారు. షెడ్యూల్డ్ ప్రాంతంలో జీవో నెంబర్ 3 ప్రకారం అన్ని ప్రభుత్వ శాఖలలో ఉద్యోగాలన్నింటినీ స్థానిక గిరిజన అభ్యర్థులతో భర్తీ చేయాలని ఉన్నా, అది అమలుకు నోచుకోవడం లేదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్కీంవర్కర్లలో ఎక్కువ మంది గిరిజనేతరులనే నియమిస్తున్నదని తెలిపారు. లక్షలమంది మాట్లా డుతున్న గిరిజన భాషలకు లిపి కనిపెట్టకపోవడం సరికాదని అన్నారు.టీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు చందునాయక్, శోభన నాయక్, నాయకులు రమేశ్, రాజేందర్, జగన్, రాందాస్, మల్సూర్, విజరు, సతీశ్, వెంకటేశ్, సురేశ్, రాజు, కుమార్, స్వామి పాల్గొన్నారు.

'బంగారు' తెలంగాణల..
ఇసుక సొమ్ము లేకుంటే సర్కారు బత్కదా?

ఈ రీచ్‌లను రద్దు చేస్తే దివాలా తీస్తుందా!

- ఇంతకీ మానేరుతో గల్లాపెట్టెలో పడిందెంతో!
- కనీసం లారీల సంఖ్యయినా కంట్రోల్ చేయాలి

రక్తాన్నీ కల్తీ చేస్తున్నారని మొన్నామధ్య కేసీఆర్ ఢిల్లీలో వాపోయారు. పైసల కోసం మనుషుల ప్రాణాలు తీస్తారయ్యా? అంటూ చాలా విచారపడ్డారు. మరి..అదే పైసల యావతో పదుల సంఖ్యలో అమాయకులను బలిగొంటూ, వందల్లో కాళ్లు రెక్కలు విరగ్గొడుతూ లెక్కకందని అనర్థాల బాపతు ఇసుక లారీల అంశంలో ఆ రకంగా సీఎం ఎందుకు చలించడంలేదూ?



ఇల్లెందుల దుర్గాప్రసాద్

బేసిగ్గా మనది మిగులు బడ్జెట్ రాష్ట్రం. అందాద లక్షన్నర కోట్ల పద్దుల కలబోత. ఆదాయానికి ఢోకా లేదు. 'బంగారు' తెలంగాణకు అదే భరోసా. ఇది పాలకుల ప్రకటిత ధీమా. మరి అట్లాంటప్పుడు ఇసుకపై ఆఫ్టాల్ 600 కోట్లు వస్తే ఎంత..రాకుంటే ఎంత? ఈమాత్రం సొమ్ము బందైతే సర్కారు బత్కదా? పోనీ, అత్యంత వివాదాస్పద రీచ్‌లను రద్దు చేస్తే ప్రభుత్వ కోశాగారం దివాలా తీస్తుందా? కాదంటే కనీసం లారీల సంఖ్యనైనా కంట్రోల్ చేస్తే కొంప కొల్లేరవుతుందా? మరీ ముఖ్యంగా నేరెళ్ల నిలువెల్లా గాయపడిన నేపథ్యంలో ఈ ప్రశ్నలు ఉదయిస్తున్నాయి. నిజానికి ఈడ ఆడ అని కాదు..తెలంగాణలో ఇసుక, గుట్టలు వంటి పుష్కలమైన ప్రకృతి వనరులున్న చోటల్లా లెక్కకందని అనర్థాలు తాండవిస్తున్నాయి. పూర్వ కరీంనగర్, వరంగల్, ఖమ్మం, నిజామాబాద్ వంటి జిల్లాల్లో సహజ, సామాజిక సంపదను దురాశాపరులు పబ్లిగ్గా లూటీ చేస్తున్నారు. కొండ కోనల్నీ కొవ్వొత్తులకంటే బిరాన కరగదీస్తున్నారు. భూగర్భ జలాలతో దోస్తీ కట్టే ఇసుకను బాజాప్తా తస్కరిస్తున్నారు. తరాల తరబడి తరగనన్ని స్థిర చరాస్తుల కోసం గణాంకాలకు చిక్కనన్ని పాపాలకు ఒడిగడుతున్నారు. పర్యావరణానికి తీరని ద్రోహం తలపెడుతున్నారు. మానవాళి, సమస్త జీవరాశుల శ్రేయస్సు ధ్వంసానికి పూనుకొంటున్నారు. మరో వంక మాత్రం మొక్కలు నాటాలని నీతులు చెబుతున్నారు.

ఎంత శపించినా ఇసుమంతైనా మారరు

ఒక వొడ్డెర కార్మికుడు, ఒక రైతు కూలీ, ఒక లేబరు 10 గంటలపాటు రెక్కలన్నీ పుండు పుండయ్యేలా చెమటోడ్చినా పూట గడవడం గగనం. కానీ, కొండలు, గుట్టలు, ఇసుక దందాలు చేసేటోళ్లకు అదే గంటకు లక్ష చొప్పున వచ్చి పడతాయి. యాడాది తిరక్కుండానే యాడ బెట్టుకోవాల్నో సమజ్ గానంత దండిగా ధనం అర్రల్లోకి చేరుతోంది. అదే రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన ఓ నాయకుడు కాని నాయకుడు, పాత కరీంనగర్ జిల్లా వాస్తవ్యుడైన మరో నేత వంటి వ్యక్తులు ఇక్కడ మచ్చుకు గుర్తుకు వస్తున్నారు. వెరీ షార్టు టైములో అట్లాంటి శాల్తీలు కొండలకంటే ఎత్తుగా కోట్లకు ఎదిగిన వైనంపై కథలు కథలుగా చెప్పుకొంటున్నారు. ఈడీ, ఐటీ, సీబీఐ వంటి జాతీయ సంస్థల మూకుమ్మడి దాడులకు ఈపాటికే అర్హత సాధించారనే అంచనాలున్నాయి. ఇదంతా ప్రకృతి వనరుల నిలువు దోపిడీ మహిమే. ఇట్లా రుచి మరిగినప్పుడు ఎన్ని శాపనార్థాలు పెట్టినా, ఎంతలా ఉసురు తగులుతుందన్నా, ఎంత ఆక్రోశించినా, మరెంత ఆగ్రహించినా ఇసుమంతైనా వాళ్లు ఎందుకు మారతారు?

ప్రమాదాలు..పలు రూపాలు..

ఈ అమానవీయ దందాల్లో పొర్లుతున్న వ్యక్తులు, శక్తులు, మేక వన్నె పులులు మనుషులను మనుషులుగా చూడరు. కనుచూపునకు అందనంత విశాల భవంతుల్లో దుమ్మూ ధూళీ చొరబడని ఎయిర్ కండీషన్డ్ గదుల్లో, తళతళలాడే 'కారు'ల్లో జీవిస్తారు. ఇహ..ఆ లారీలు దారెంట ఎట్లా పోతున్నాయ్, ఎదురయ్యే పబ్లిక్ గుండెల్లో గంటలు ఎలా మోగిస్తున్నాయ్, చక్రాల కింద పడేసి ఇంకెట్లా నలగ్గొడుతున్నాయ్, పల్లెల్లోని దారులను ఏ విధంగా తుక్కు తుక్కు చేస్తున్నాయ్, దమ్ము తీయరానంత దుమ్మును ఏ రేంజ్‌లో రేపుతున్నాయ్, ఆరోగ్యాలను, ఇండ్లను ఎంతలా వేపుకొని తింటున్నాయ్ వంటివి వాళ్లకు అక్కెర లేదు. ఇవాల్టి ట్రిప్పుల సంఖ్య ఎంత, నిన్నటికంటే ఎక్కువ ఎంత రాబడి రాబట్టింది మాత్రమే కావాలి.

క్వారీలను క్లోజ్ చేయొచ్చు కదా!

మౌత్ టు మౌత్ ప్లస్ వివిధ మాధ్యమాల ద్వారా చక్కర్లు కొడుతున్నట్టుగా సర్కారులోని 'ముఖ్య'మైన వ్యక్తులకు ఈ పాపపు వ్యాపక వ్యక్తులపట్ల మమకారం లేకపోతే మంచిదే. మరి ఎలాంటి సంబంధం, అను'బంధం' లేకుంటే కమ్‌సేకమ్ రాజన్న సిరిసిల్ల జిల్లాలోని కొదురుపాక, చింతల్‌ఠాణా ఇసుక క్వారీలకు కాస్త విశ్రాంతి ఇవ్వొచ్చు కదా. ముఖ్యమంత్రి కేసీఆర్, సంబంధిత శాఖ మంత్రి కేటీఆర్ రిపీటెడ్‌గా చెబుతోన్న 400/600/1000 కోట్ల ఇసుక ఇన్‌కమ్‌లో నిజానికి ఈ రెండు రీచ్‌ల ద్వారా ఇప్పటిదాకా సర్కారు గల్లాపెట్టెకు వచ్చిన పడిన ఆందాని ఎంతో వెల్లడించాలి.

కాంట్రాక్ట్ కార్మికులా.. ఆర్టిజన్స్ ఉద్యోగులా...!?

- ఏ హాజరు పట్టికలోనూ వారి పేర్లు లేవు
- అయోమయంలో విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు

నవతెలంగాణ - హైదరాబాద్ సిటీబ్యూరో

సరిగ్గా వారం కింద క్రమబద్ధీకరించిన విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల ఆర్టిజన్స్ ఆర్డర్స్‌పై హైకోర్టు స్టే విధించింది. దీంతో వీరంతా కాంట్రాక్ట్ కార్మికులా..? ప్రభుత్వం చెప్పినట్టుగా ఆర్టిజన్స్ ఉద్యోగులా..? అనేది సందేహంగా మారింది. ఆగస్టు హాజరు పట్టికలో కార్మికుల పేర్లను ఇటు కాంట్రాక్ట్ కార్మికుల జాబితాలోనూ, అటు రెగ్యులర్‌గా ప్రభుత్వ ఉద్యోగుల హాజరు పట్టికలోనూ ప్రభుత్వం చేర్చకపోవడంతో రెంటికి చెడ్డ రేవడిలా వారి పరిస్థితి తయారైంది.

ఏ హాజరు పట్టికలోనూ నమోదు లేదు ...

ఏ ప్రాతిపదికన కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేశారో ప్రభుత్వం నెలరోజుల్లో కోర్టుకు సమాధానం చెప్పాలి. అందుకు సంబంధించిన కసరత్తు జరుగుతున్నట్టు ఎక్కడా కనిపించట్లేదు. ఇదిలా ఉండగా, కాంట్రాక్ట్ కార్మికులను ఆర్టిజన్ ఉద్యోగులుగా పరిగణిస్తున్నట్టు జులై 29వ తేదీ శనివారం ప్రకటించిన అనంతరం ఇప్పటివరకూ కాంట్రాక్ట్ కార్మికుల హాజరు పట్టికలో నమోదు కావాల్సిన పేర్లను ఆగస్టు ప్రారంభం నుంచి నమోదు చేయలేదు. కాగా ప్రభుత్వం ఆర్టిజన్స్ ఉద్యోగులుగా పరిగణించిన అనంతరం కోర్టులో వేసిన పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన కోర్టు ఆర్టిజన్స్ ఆర్డర్స్‌పై స్టే ఇచ్చిన కారణంగా రెగ్యులర్ ఉద్యోగులకు కేటాయించే హాజరు పట్టికలోనూ కాంట్రాక్ట్ కార్మికుల పేర్లను ఎక్కించలేదు.

కాంట్రాక్ట్ కార్మికులా.. ఆర్టిజన్స్ ఉద్యోగులా ...?

ప్రభుత్వం క్రమబద్ధీకరణ చేశామని చెప్పుకుంటున్న ఆ కార్మికులు ప్రస్తుతం కాంట్రాక్ట్ కార్మికులా..? లేదా ఆర్టిజన్స్ ఉద్యోగులా అనేది ప్రస్తుతం విద్యుత్‌శాఖలో ప్రశ్నార్థకంగా మారింది. ఆర్టిజన్స్ ఉద్యోగులైతే రెగ్యులర్ ఉద్యోగుల హాజరు పట్టికలో జులై 31 నుంచి లేదంటే ఆగస్టు 1వ తేదీ నుంచి వీరి పేర్లను అధికారులు నమోదు చేయాలి. ఆర్టిజన్స్‌పై కోర్టు స్టే ఇచ్చిన కారణంగా ఈ నెల రోజులపాటు వీరంతా కాంట్రాక్ట్ కార్మికులు అవుతారనుకుంటే, గతంలో కాంట్రాక్ట్ కార్మికులకు హాజరు నమోదు చేసే ప్రత్యేక రిజిస్ట్రార్‌లో వీళ్ల పేర్లను రాయాలి. రెండు హాజరు పట్టికల్లోనూ వీరి పేర్లను చేర్చకపోవటం గమనార్హం.

అయోమయంలో కాంట్రాక్ట్ కార్మికులు ...!

దశాబ్దాలుగా కాంట్రాక్ట్ కార్మికులుగా చాలీచాలని వేతనాలతో రెక్కలు ముక్కలు చేసుకున్న కార్మికులకు ప్రభుత్వం నిర్ణయంతో, వారి మొఖంలో చిరునవ్వులు విరిశాయి. కాంట్రాక్ట్ కార్మికుల నుంచి ప్రభుత్వ ఉద్యోగులుగా మారబోతున్నామనే సంబరపడే ముచ్చట కూడా తీరలేదు. అంతలోనే ఓ నిరుద్యోగి కోర్టులో వేసిన పిటిషన్ కారణంగా ఆర్టిజన్స్ ఆర్డర్స్‌పై స్టే వచ్చింది. దీంతో విద్యుత్ కార్మికులు అయోమయంలో పడ్డారు.

రాహుల్‌పై దాడి మోడీ మార్కు: పొంగులేటి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఏఐసీసీ ఉపాధ్యక్షులు రాహుల్‌గాంధీపై మతోన్మాదుల దాడి పట్ల ప్రధాని నరేంద్రమోడీ పార్లమెంటులో స్పందించకపోవడం దారుణమని ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకరరెడ్డి అన్నారు. మోడీ మార్కు పాలనకు ఇది నిదర్శనమన్నారు. దేశ నాయకులపై మతతత్వవాదులు దాడులు చేస్తుండడంతో మోడీ మాట్లాడకుండా దేశ ప్రజలకు ఏం సంకేతాలు ఇస్తున్నారని ప్రశ్నించారు. శనివారం సీఎల్పీలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గుజరాత్ ఘటనపై సీబీఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో మోడీ రాష్ట్రంలో కేసీఆర్ పాలన రాజ్యాంగానికి విరుద్ధంగా ఉందన్నారు. కరీంనగర్ జిల్లాకు మెడికల్ కళాశాలను ఏర్పాటు చేయాలని కోరుతూ మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ తలపెట్టిన నిరాహారదీక్షకు పోలీసులు అనుమతి ఇవ్వవకపోవడం దారుణమన్నారు.

తెలంగాణలో అమిత్‌షాను అడ్డుకుంటాం : కొనగాల

గుజరాత్‌లో రాహుల్‌గాంధీపై జరిగిన దాడి అమనుషమని టీపీసీసీ అధికార ప్రతినిధి కొనగాల మహేష్ అన్నారు. రాహుల్‌పై దాడి చేయడం మతోన్మాదుల పిరికిపందల చర్య అన్నారు. అమిత్‌షా అండతోనే రాహుల్‌పై మతతత్వవాదులు దాడులకు పాల్పడ్డారన్నారు. వెంటనే రాహుల్ గాంధీకి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తెలంగాణలో అమిత్‌షాను తిరగన్వీమని, ఎక్కడిక్కడ అడ్డుకుంటామని ఒక ప్రకటనలో హెచ్చరించారు. రాహుల్‌గాంధీ మానవత్వంతో వరద బాధితులను పరామర్శించడానికి వెళ్తే అక్కడ అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ఆయనపై దాడులను ప్రోత్సహించిందన్నారు. గుజరాత్‌లో రాహుల్ పర్యటన ద్వారా బీజేపీ ప్రభుత్వ లోపాలు, అసమర్థత దేశానికి తెలుస్తాయన్న భయంతోనే బీజేపీ, ఆర్ఎస్ఎస్ గుండాలు దాడి తెగబడ్డారని ఆయన విమర్శించారు.

రూ.56 లక్షల గంజాయి పట్టివేత

- 18 మంది స్మగ్లర్లను అరెస్ట్ చేసిన ఆర్‌పీఎస్ టీమ్‌లు

నవ తెలంగాణ, ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్రంలో మరో సారి రైల్వే పోలీసు స్పెషల్ టీమ్‌లు భారీ ఎత్తున గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 56 లక్షల రూపాయల విలువైన గంజాయిని స్మగ్లర్లు రైళ్లలో ఇతర ప్రాంతాలకు రవాణా చేస్తుండగా పట్టుకున్నారు. రాష్ట్రంలో డ్రగ్ మాఫియా కార్యకలాపాలు వెలుగు చూశాక రాష్ట్రంలో మాదక పదార్థాల రవాణాను కఠినంగా అణిచి వేసే లక్ష్యంతో రైల్వ పోలీసు విభాగాన్ని కూడా ఆ శాఖ డైరెక్టర్ జనరల్ టీ.కృష్ణప్రసాద్ అప్రమత్తం చేశారు. ఈ మేరకు సికింద్రాబాద్ రైల్వే ఎస్పీ రాజేంద్రప్రసాద్ నేతృత్వంలో స్పెషల్ టీమ్‌లను ఏర్పాటు చేసి రైల్వే పోలీసు శాఖ పరిధిలోని అనుమానిత ప్రాంతాలు, రైళ్లలో ఆకస్మిక తనికీలు, దాడులను ముమ్మరం చేశారు. ఈ మేరకు గత వారం రోజులుగా జరిగిన దాడులలో రైళ్లలో రవాణా అవుతున్న 392 కిలోల గంజాయిని పట్టుకున్నారు. ఈ సందర్భంగా మొత్తం 18 మంది స్మగ్లర్లను రైల్వే స్పెషల్ టీమ్ పోలీసులు అరెస్టు చేశారు. వారిచ్చిన మసాచారం ఆధారంగా మరి కొన్ని ప్రాంతాల్లోను ప్రత్యేక టీమ్‌లు దాడులకు రంగం సిద్ధం చేశాయి.



నేడు ఫ్రెండ్‌షిప్ డే

విడదీయని బంధం

బాల్యం నుంచి వృద్ధాప్యం వరకు

స్నేహం అద్భుతమైనది. నిజమైన మిత్రులకు మించిన ఆస్తి లేదు. స్నేహానికి ఎల్లలు లేవు. అది సరిహద్దుల్ని చెరిపేస్తుంది. వికాసానికి బాటలు వేస్తుంది. మంచి మిత్రుడు తోడుంటే ఆయుధం ధరించినంత ధైర్యం ఉంటుంది. కన్నవారితో, కట్టుకున్నవారితో, తోడబుట్టిన వారితో చెప్పుకోలేని విషయాలను మిత్రులతో చెప్పుకోవడం మిత్రుత్వం గొప్పదనం. కష్టసుఖాల్లో అండగా ఉండేవారు.. నిస్వార్థంగా సాయం అందించేవారు నిజమైన దోస్తులు. స్నేహం ఓ మధురమైన అనుభూతి. దీనికి వయసుతో నిమిత్తం లేదు. బాల్యం నుంచి వృద్ధాప్యం వరకు అందరిలో స్నేహ భావం ఉంటుంది. అటువంటి అనుభూతిని అనుభవిస్తేనే తెలుస్తుంది. సృష్టిలో నా అనేవారు, బంధువులు లేని వారైనా ఉంటారేమే గానీ స్నేహితులు లేని వారుండరు. ఇంట్లో చెప్పలేని సమస్యలు, బాధలు సైతం వీరితో ఎటువంటి దాపరికం లేకుండా చెప్పుకొని ఓదార్పు పొందుతాం. అదే స్నేహం. స్నేహితులతో కలిసి ఉంటే ఎంతో ఆనందం మనతోనే ఉంటుంది.

– లహరి



స్నేహం.. పదం చిన్నదే. అక్షరాలు రెండే. దీని అర్థమే గొప్పది. స్నేహం విలువ అమూల్యం. వెలగట్టలేనిది. అన్ని బంధాలకన్నా ఇది పవిత్రమైనది.. పటిష్టమైనది. జీవితాంతం తోడుండేది. అందకే... దీన్నందరూ ఇష్టపడతారు. ఎన్ని ఆటంకాలు ఎదురైనా దీన్ని వీడేందుకు సిద్ధంకారు. స్నేహమంటే ఒకరినొకరు అర్థం చేసుకోవడం... ఇచ్చిపుచ్చుకోవడం. ఈ బంధానికి ఎలాంటి పక్షపాతం ఉండదు. కులం, మతం, భాషాబేధం లాంటివేమీ ఇది ఎరుగదు. ప్రతిఫలాన్ని ఆశించని ఆ బంధం మొగ్గలా ప్రారంభమై.. మహావృక్షంగా ఎదుగుతుంది. జీవితాంతం తోడునిస్తుంది. తరతరాలకు తన మాధుర్యాన్ని పంచుతుంది. స్నేహం ప్రకృతి వంటిది. అది ఆహ్లాదంతో పాటు ఎంతో హాయినిస్తుంది.

స్నేహాలకు వయస్సుతో నిమిత్తం లేదు. చిన్నవారితో పెద్దవారికి స్నేహం ఏర్పడొచ్చు. ఇద్దరు చిన్నారుల మధ్య, ఇద్దరు పెద్దల మధ్య జనించొచ్చు. స్నేహానికి లింగభేదం ఏమాత్రం ఉండదు. అబ్బాయిలు–అమ్మాయిల మధ్య, అమ్మాయిలు–అమ్మాయిల మధ్య, అబ్బాయిలు–అబ్బాయిల మధ్య ఏర్పడొచ్చు. రెండేళ్ల పసిప్రాయం నుంచి మొదలవుతుంది స్నేహం. స్కూళ్లో చేరేలోగా కొన్ని స్నేహాలవుతాయి. స్కూళ్లో చేరిన తర్వాత కొన్ని పెరుగుతాయి. చిన్ననాటి స్నేహాలు జీవిత దశలను, వ్యక్తిత్వాలను, లక్ష్యాలను నిర్దేశిస్తాయి. ఎన్ని ఆర్థిక, సాంఘిక హొదాలు మారినా చిన్ననాటి స్నేహాల మధ్య ఆత్మీయత ఏమాత్రం దెబ్బతినదు. హొదాలను అనుసరించి చిన్న నాటి స్నేహాలను వదులుకునే వారూ ఉంటారు. ఇలాంటి వారికి నిజమైన స్నేహితులు దొరకడం కష్టం. ఒకవేళ దొరికినా జీవితాంతం కొనసాగలేరు.

జీవితానికి దిక్సూచి

మన దారి మనకే తెలియనప్పుడు చేయి పట్టి ముందుకు నడిపించేదే స్నేహం. అడుగులు ఎలా వేయాలో నేర్పిస్తుంది. సంకట స్థితి నుంచి ఎలా దాటాలో చూపెడుతుంది. మన క్షేమాన్ని కాంక్షించేది ఒక్క స్నేహం మాత్రమే. మన గెలుపును ఆకాంక్షించేది అదే. మనం విజయం సాధిస్తే ఉత్సాహంతో గంతులేస్తుంది. ఓడిపోతే ఓదార్చుతుంది. నిరాశ నిస్పృహల నుంచి బయటకు లాగుతుంది. మన పొరపాటును తన భుజాల మీద వేసుకుని బాధ్యతను మోస్తుంది. ఆహార్యంలేని నాట్యం, ధైర్యంలేని దేహదారుఢ్యం, స్నేహం లేని



జీవితం ఒక్కటే. చెట్టాపట్టాలు వేసుకుని తిరగడాన్నే స్నేహం అనరు. జీవితంలో పైకి ఎదగడానికి ఇది దోహదడపాలి. కాలక్షేపానికి రోజూ కబుర్లు చెప్పుకోవడంకాదు స్నేహమంటే. గుండెలపై చేయివేసుకుంటే హాయిని కలిగించే అనుభూతినివ్వాలి. ప్రాణ స్నేహితులమని చెప్పుకోవడానికి మాత్రమే కాదు.. అవసరమైనప్పుడు చేతనైన ఆసరా కూడా ఇవ్వగలిగేలా ఉండాలి స్నేహం.

తేడా ఏమిటి?

పరిచయస్తులకు, మిత్రులకు చాలా తేడా ఉంది. సహోద్యోగులు, ఇరుగు, పొరుగు వారికి ఆప్తులు, ఆత్మీయులకు చాలా తేడా ఉంటుంది. ఉభయలూ ఒకరే అయితే మంచిదే. కానీ.. చాలా సార్లు ఆ అవకాశం ఉండదు. చిన్నప్పటి సంబంధాలు, అనుబంధం తోనేమీ, అభివృద్ధికి తోడ్పడ్డం వల్లనేమీ కొంతమంది మనకు స్నేహి తులవుతారు. వారితో కలిసి ఉండటం మనకు సంతోషదాయకమే అవుతుంది. వారితో గడిపే అవకాశం కోసం ఎదురుచూస్తుంటాం. అయితే జీవన వ్యాపకాలు, అవసరాలు ఇలాంటి అనుబంధాల పరిధికి అతీతంగా విస్తరిస్తాయి. ఎక్కడెక్కడికో విసరివేయబడతాం. వృత్తి జీవితంలోనూ, నిత్య జీవితంలోనూ కొత్త వారు ఎవరెవరో దగ్గర వుతారు. కొన్ని సంవత్సరాలు గడిస్తేకాని వారి గురించి పూర్తిగా అవగాహనకు రాలేం. అయితే.. జీవితావస రాలనుబట్టి సన్నిహితంగా వ్యవహరించాల్సి వస్తుంది.

ఇది తప్పనిసరి

మనకు జీవితంలో అనేక మంది పరిచయమవు తుంటారు. వారిని చిరునవ్వుతో పలకరించడం, మర్యాదగా వ్యవహరించడం చాలా అవసరం. చేతనైన సహాయం చేయాలి. కానీ.. క్షణంలో ఆప్తుల జాబితాలో చేర్చుకోవడం మాత్రం సరికాదు. సన్నిహితులు–హితులు మధ్య వ్యత్యాసం ఉంటుందనేది మరవొద్దు. సంవత్సరాల తరబడి సన్నిహితులుగా మసులుతూనే మిమ్మల్ని దెబ్బతీయాలనుకునే వారు ఉండొచ్చు. దూరందూరంగా ఉంటున్నా మీ మేలు కోరుకునే వారూ ఉండొచ్చు. ఇలాంటి వారినే శ్రేయోభిలాషులు అం టారు. రోజూ సన్నిహితంగా ఉండకపోయినా మన హితవుకోరే వారి జోక్యాన్ని మనం ఆహ్వానించాలి. అలాగే రోజూ కలిసి ఉండే వారైనా అనవసర జోక్యాన్ని వారించాలి.

–పీఆర్

స్నే'హితుడు'



రెండు కళ్లు
ఒక మనసుని
ప్రతిబింబిస్తుంటే
రెండు మనసులు
నాలుగు కళ్ల
కలల సాఫల్యంలో
ఒకే మనసుగా
సాగే క్రమంలో
రెటీనాపై
కేంద్రీకరించబడిన
ఆకర్షణలన్నీ
క్రోడీకరించబడి
ఎగురుతూ ఊరడిస్తుంటే
దొర్లే కాలగమనంలో
కాలానికే కన్ను కుట్టేలా
నాలుగు కళ్ల
ఒకే ఒక మనసై
భావాల సేద్యంలో
పండించుకునే పంట
ప్రేమై ప్రవహిస్తుంటే
సాక్ష్యంగా నాలుగు కళ్లు
విప్పారి చూస్తున్నాయి
మనసులేమో ఒకే మనసై
ఏకాంతం కోరుకుంటున్నాయి

– అశోక్ అవారి,
9000576581

అస్లీ దోస్తానా

కుటుంబం
రక్తబంధమైతే
స్నేహం
హృదయం
హార్దికం
రక్షాబంధనం
శరీరాలువేరైనా
మనస్సు...

ఆత్మీయంగా
తలుపుతట్టి
మిత్రమా అని
పలుకరించి
లోపాలను
నిరంతరం
ఎత్తిచూపి
సరిచేసే
సాన్నిహిత్యం..



ఆత్మన్యూనతను
ఆత్మవిశ్వాసంగా
ఆశావహ దృక్పథంగా
మార్చే చెలిమె
చెలిమి..

ఓటమిలో
వెన్నుతట్టిన
ఓదార్పు
విజయంలో
ఆనందమైన
అనుభూతి..

బాల్యంగామొదలై
వందసంవత్సరాలుగా
ఎదిగే
ఓ నమ్మకం..

– మడిపల్లి హరిహరనాథ్ ,
9603577655

పెద్దలు ఏమన్నారంటే...



- స్నేహం పాతబడిన కొద్దీ పటిష్టమవుతుంది: **చింగ్‌చౌ**
- విశ్వాసం లేకుండా స్నేహం ఉండదు : **గౌతమబుద్ధుడు**
- అహంకారికి మిత్రులుండరు: **ఆస్కార్‌వైల్డ్**
- ఇచ్చింది మరిచిపోవడం, పుచ్చుకున్నది జ్ఞాపకం ఉంచుకోవడమే స్నేహం : **గాంధీ**
- ఎవరితోనైనా స్నేహం చేయడం సులభమే. ఎక్కువ కాలం నిలుపుకోగలగడమే కష్టం: **కార్డినల్‌న్యూమాన్**
- నీ తప్పును, నీ తెలివి తక్కువ పనులను నీ ముందుంచువాడే నీ నిజమైన స్నేహితుడు : **బెంజిమన్ ఫ్రాంక్లిన్**
- మనిషినిబట్టే అతని స్నేహితులు ఉంటారు : **స్వీడెన్ బర్గ్**
- మాటలకే పరిమితమయ్యే మిత్రుడెప్పుడు మిత్రుడుగా ఉండలేడు : **లియోటాల్‌స్టాయ్**
- మిత్రున్ని మించిన అద్దం లేదు. మిత్రుడు లేకుండా ఏ మనిషి సర్వసంపూర్ణుడు కాలేడు : **సెయింట్ బెర్నార్డ్**
- బంధువులు బలవంతంగా ఏర్పడుతారు. స్నేహితులు స్వేచ్ఛగా ఏర్పడుతారు: **వాట్సమన్ ఫోర్డ్**
- జీవన క్రమంలో కొత్త స్నేహాలు చేయని మనిషి కొంత కాలానికి ఒంటరి వాడవుతాడు : **శామ్యూల్ జాన్సన్**
- స్నేహమనేది రెండు దేహాల్లో ఉండే ఒక ఆత్మ: **అరిస్టాటిల్**
- ప్రతి ఒక్కరూ మంచి మిత్రుల మధ్య గడపాలి: **షేక్‌స్పియర్**
- తెలివైన, నమ్మకమైన మిత్రుడి కంటే మంచి సంబంధం మరొకటి లేదు : **టాల్‌స్టాయ్**

మధు'రా'నుభూతి



రైలు ప్లాట్‌ఫారం మీదకు వచ్చి ఆగింది. అది ప్యాసెంజర్ ట్రెయిన్. మామూలుగా అయితే సీటు దొరికే ఛాన్సే లేదు. ఎందుకోగానీ అవాళ చాలా బోగీలు ఖాళీగా దర్శనమిస్తూ స్వాగతం పలుకుతున్నాయి.

ప్రముఖ రచయిత (చాలామంది అతనిని అలాగే సంబోధిస్తుంటారు. అతను కూడా తన గురించి తాను అప్పుడప్పుడు అలాగే అనుకుంటూ సంతోషంతో కూడిన గర్వానికి లోనవుతుంటాడు) సగానికి పైగా ఖాళీగా ఉన్న ఒక బోగీలోకి ఎక్కాడు. చాలామందిలాగే అతనికీ కిటికీ పక్కన కూర్చుని ప్రయాణం చేయడమంటే చాలా ఇష్టం. ఎన్నో కిటికీ సీట్లు రారమ్మని పిలుస్తుండగా తనకు నచ్చిన ఓ చోట విశాలంగా, విలాసంగా సేద తీరాడు. రైలు కదిలింది. చల్లని గాలి శరీరాన్ని తాకుతున్నప్పటికీ బహుశా ఆ ఆస్వాదనను మరిచిపోయి కాబోలు జేబులోంచి సెల్ ఫోన్ బయటకు తీశాడు. అందులోని సామాజిక మాధ్యమాలన్నీ వీక్షిస్తూ చాలాసేపు సమా జాన్ని మరిచిపోయాడు. అప్పుడప్పుడు రైలు ఆగినచోట స్టేషన్లను గమనించేందుకు తలెత్తి అటూఇటూ చూస్తున్నాడు. మళ్లీ తన పనిలో నిమగ్నమవుతున్నాడు. రైలు కూడా వేగంగా తన పని తాను చేసుకుపోతుంది.

రచయిత తన ప్రపంచంలో మునిగి ఉండగా బోగీలో దూరంగా 'వేడి వేడి పులిహోర!' అన్న కేకలు చిన్నగా వినిపించసాగాయి. ఆ కేకలు రాను రాను పెద్దవవుతూ రచయిత చెవులకు దగ్గరవసాగాయి. 'ఏరా బావున్నావా? ఎక్కడికెళుతున్నావు?' అన్న మాటలు తనకు సమీపం నుంచి వినిపించేసరికి రచయిత ఉలిక్కిపడ్డట్టయి తలెత్తి చూశాడు. పులిహోర అమ్ముతున్న వ్యక్తి! ఓ చేతిలో ప్యాకెట్ల ట్రే పట్టుకుని మరో చేతిని నడుముకు ఆనించుకుని నిలబడి చిరునవ్వులు చిందిస్తున్నాడు. వినకూడని మాటేదో విన్నట్టు రచయిత మనసు, శరీరం కాసేపు స్తంభించిపోయాయి. తనను అలా పిలిచే ధైర్యం ఎవరికుందని! తాను చేస్తున్న వృత్తి వల్ల కావొచ్చు, తాను కొనసాగిస్తున్న ప్రవృత్తి మూలంగా కావొచ్చు, అందరూ తనను గౌరవంగా సంబోధించేవారే! ఆఖరికి కన్న తల్లిదండ్రులు కూడా తనకు వయసు పెరిగి పెద్దరికం వస్తున్న క్రమంలో తనను అరేయ్ ఒరేయ్ అనకుండా పేరు పెట్టి పిలవడం రచయితకు అనుభవంలో ఉన్న విషయమే! అసలు అలాంటి పిలుపును ఎవరి నోటనైనా విని ఎంత కాలమైందో!


'నేనురా సతీశ్‌ను!' అంటూ ఆ వ్యక్తి రచయితకు ఎదురుగా ఉన్న సీట్లో కూర్చున్నాడు. ట్రేని పక్కన పెట్టి ముందుకు వంగాడు. ఎక్కువ సేపు ఆలోచించనవసరం లేకుండానే రచయిత అతడిని గుర్తు పట్టేశాడు. ఔను సతీశే! తన బాల్యమిత్రుడు! తనతో కలసి ఓనమాలు దిద్దినవాడు! తన ఆటపాటల్లో భాగస్వామి అయినవాడు! అన్నింటికీ మించి బాల్యంలో తనతో ఆత్మీయంగా మెలిగినవాడు! ఏనాడో దూరమై ఎన్నో ఏళ్లుగా కనీసం స్మృతిపథంలోకి కూడా రాని అలనాటి మిత్రుడు ఈరోజు ఇలా తన ముందు! రచయిత ఆశ్చర్యానికి అంతులేదు. ఆనందానికి హద్దులు లేవు. అప్రయత్నంగానే అతని చేతులు ఆ వ్యక్తిని బలంగా స్పృశించాయి. నవ్వుల పువ్వులు వికసించాయి. కరచాలనాలు, ఆలింగనాలు కొనసాగాయి.

ఇక వాళ్ల మధ్య సంభాషణల పర్వం మొదలైంది. ఒకరి వివరాలు ఒకరికి చెప్పుకున్నారు. మధ్యలో చదువు మానేయవలసి వచ్చిన తాను ఇలా రైళ్లలో ఆహార పొట్లాలు అమ్మే పనిలోకి దిగానని, పెద్దగా ఇబ్బంది లేమీ లేకుండానే కుటుంబం గడిచిపోతుందని చెప్పాడా వ్యక్తి. తాను చాలా కష్టపడి చదివి ప్రభుత్వ ఉద్యోగం తెచ్చుకున్నాననీ, ఆ వృత్తితో పాటు ప్రవృత్తిగా కథలు, కవితలూ రాస్తూ చాలా పుస్తకాలు ప్రచురించాననీ, ఇప్పుడు తన ప్రతిభను గుర్తించి ఒక సంస్థవారు ఇస్తున్న పురస్కారాన్ని అందుకోవడానికి వెళుతున్నాననీ రచయిత తన సాహితీవ్యాసంగం గురించి మిత్రుడికి అర్థమయ్యేలా చెప్పే ప్రయత్నం చేశాడు.

అటు తర్వాత వాళ్లిద్దరూ వాడేం చేస్తున్నాడు? వీడేం చేస్తున్నాడు? అంటూ తమ చిన్ననాటి మిత్రుల గురించి ఒకరినొకరు వాకబు చేసుకున్నారు. అడిగే ప్రశ్న చివర, చెప్పే జవాబు చివర 'రా' అనే మాటను మరిచిపోకుండా ఇద్దరూ మనసునిండా మాట్లాడుకున్నారు. ఆ సమయంలో రచయిత మనసు చెప్పలేనంతగా ఆనంద డోలికల్లో తేలియాడిపోయింది.

స్టేషన్ రాబోతుందన్నదానికి సూచికగా రైలు గమనం మందగించింది. 'ఇక నే వెళ్తారా! పక్క బోగీలోకి వెళ్లాలి' అంటూ లేచి నిలబడ్డాడు మిత్రుడు. రచయిత కూడా లేచి అతడిని ఆత్మీయంగా మరోమారు కౌగిలించు కున్నాడు. అంతలో తన మిత్రుడి దగ్గర ఆహార పొట్లాలు కొందామన్న ఆలోచన వచ్చి జేబులో చేయి పెట్టాడు. కానీ మిత్రుడు అంతకు ముందే అనుకున్నట్టున్నాడు. రెండు పొట్లాలు తీసి రచయిత చేతిలో పెట్టాడు. డబ్బులు ఇవ్వబోయిన రచయిత చేత బలవంతంగా ఆ పని మాన్పించి 'ఏయ్ డబ్బులేంట్రా? ఊరుకో!' అంటూ మరోమారు గట్టిగా హత్తుకున్నాడు.

రైలు ఆగింది. రచయితకు వీడ్కోలు చెప్పి బోగీ మారిపోయాడు మిత్రుడు. రైలు తన పని మొదలుపెట్టింది. రచయిత నింపాదిగా కూర్చున్నాడు. మనసునిండా మిత్రుడి ఆలోచనలు గింగిరాలు కొడుతున్నాయి. 'రా' అన్న పిలుపు అతనిలో ఎన్నో అనుభూతులను కలిగించింది. ఎన్నో ఆలోచనలను రేకెత్తించింది.



ఎంతో ఆనందాన్ని కలిగించింది. ఇన్నాళ్లూ 'బిజీ'విత పోరాటంలో పడి తననలా పిలిచేవాళ్లకు దూరమై చాలా కోల్పోయానని పశ్చాత్తాపపడ్డాడు. తాను ఎవరైతేనేం? తన గొప్పతనం ఎంతుంటేనేం? తనను 'రా' అని పిలిచే దమ్మూ, ధైర్యం ఒక్క బాల్యమిత్రుడికి తప్ప ఇంకెవరికున్నాయి? ఇకపై తన చిన్ననాటి నేస్తాలందరిని వెతుక్కోవాలనీ, వాళ్ల పిలుపులోని ఆనందాలను అనుభవించాలనీ బలంగా నిర్ణయించుకున్నాడు రచయిత. అనేక ఆలోచనలతో సతమతమవుతూ పొట్లంలోని పులిహోరను రుచి చూశాడు. అది చిన్నప్పుడు తన మిత్రుడు బడిలో తనకు పంచిపెట్టిన తినుబండారాల రుచిని గుర్తుకు తెచ్చింది.

– పెండెం జగదీశ్వర్, 9989116877

రీ డయల్



ఫ్రెండ్‌తో అన్నాడు సురేష్
'నీ మొబైల్ ఇస్తావా?'
'ఎందుకు?' అనడిగాడు ఫ్రెండ్.
'నా గర్ల్‌ఫ్రెండ్‌కి కాల్ చేయాలి' చెప్పాడు సురేష్.
'ఇదిగో తీసుకో.. రీ డయల్ బటన్ నొక్కితే చాలు'
అని చెప్పి నాలుక్కర్చుకున్నాడు ఫ్రెండ్.

జీవితాంతం తోడుండేది



లవ్–పోస్ట్‌కార్డ్ లాంటిది.
లైఫ్– విజిటింగ్ కార్డ్ లాంటిది.
వైఫ్– మెమరీకార్డ్ లాంటిది.
లవర్–ఇన్విటేషన్‌కార్డ్ లాంటిది.
ఫ్రెండ్‌షిప్– ఆధార్‌కార్డ్ లాంటిది.
జీవితాంతం పనికొస్తుంది.

స్నేహమంటే...



→ విడదీయని బంధం
→ మనసులో గాయానికి మందు
→ ఆవేదనలో ఓదార్పు
→ ఆశలో శ్వాస
→ నిట్టూర్పులో ఓర్పు
→ మనస్సులో తియ్యటి అనుభూతి
→ వసంతంలో చిరుజల్లు
→ మదిలో రేగే భావాలకు ఓ రాగం
→ మనస్సుకు ఉల్లాసం
→ జీవితాంతం తోడుంటుందనే ధీమా


చైనా బాక్సర్ జుల్ఫీకర్‌పై విజేందర్ సింగ్ పంచ్‌ల వర్షం

అజేయుడు విజేందర్

- 3-0తో ఏకపక్ష విజయం
- రెండు టైటిల్స్ సింగ్ సొంతం
- బాటిల్‌గ్రౌండ్ ఆసియా పోరు

జుల్ఫీకర్ మైమైటయాలి చిత్తు

నవతెలంగాణ-ముంబయి

ప్రొ బాక్సర్ విజేందర్ సింగ్ అజేయ రికార్డును నిలుపుకున్నాడు. కఠిన ప్రత్యర్థి, చైనా స్టార్ ప్రొ బాక్సర్ జుల్ఫీకర్ మైమైటయాలిని మట్టికరిపించిన విజేందర్ సింగ్ వరుసగా తొమ్మిదో ఫైట్‌లో విజయం సాధించాడు. నాకౌట్ల బాక్సర్‌గా పేరొందిన విజేందర్‌కు చైనా చిన్నోడు మైమైటయాలి గట్టి పోటీని చ్చాడు. పది రౌండ్లలోనూ సింగ్‌కు దీటుగా పంచ్‌లు విసిరాడు. పది రౌండ్ల ఫైట్ నువ్వా నేనా అన్నట్టు సాగినా.. ముగ్గురు న్యాయనిర్ణేతలు విజేందర్ సింగ్‌ను ఏకపక్ష విజేతగా ఎన్నుకున్నారు. 96, 93, 95-94, 95-94తో జుల్ఫీకర్ మైమైటయాలిపై విజేందర్ గెలుపొందాడు. ఈ విజయంతో డబ్లూబీవో ఆసియా ఫసిఫిక్ సూపర్ మిడిల్‌వెయిట్ బెల్టును నిలుపుకున్న విజేందర్ సింగ్.. చైనా బాక్సర్ జుల్ఫీకర్ నుంచి డబ్ల్యూబీవో ఒరియంటల్ సూపర్ మిడిల్‌వెయిట్ చాంపియన్‌షిప్ బెల్టును గెల్చుకున్నాడు. బాటిల్‌గ్రౌండ్ ఆసియా ఫైట్‌కు బాలీవుడ్ బిగ్‌బి అమితాబ్ బచ్చన్, అభిషేక్ బచ్చన్ సహా సోనూ సుధ్‌లు హాజరయ్యారు. హాకీ దిగ్గజం ధన్‌రాజ్ పిళ్లై సహా ప్రముఖ రాజకీయ నాయకుడు అమర్ సింగ్, యోగా గురువు రాందేవ్ బాబాలు హాజరయ్యారు. ఇక బాటిల్‌గ్రౌండ్ ఫైట్‌కు తొలి టికెట్ పాస్ అందుకున్న క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ స్టేడియానికి రాలేదు.

ఆద్యంతం హోరాహోరీ : రెండు దేశాల మధ్య సరిహద్దు ఉద్రిక్తల నేపథ్యంలో విజేందర్ సింగ్, జుల్ఫీకర్ మైమైటయాలి బాటిల్‌గ్రౌండ్ ఆసియా ఫైట్ సర్వత్రా ఆసక్తి రేకెత్తించింది. అసలు యుద్ధానికి ముందే మాటల యుద్ధంలో ఇద్దరు బాక్సర్లు పరస్పరం పంచ్‌లు విసురుకున్నారు. ఇక అసలు సమరంలోనూ ఇద్దరూ ఇద్దరే అన్నట్టు విరుచుకుపడ్డారు. వాస్తవానికి ప్రతి రౌండ్‌లోనూ విజేందర్, జుల్ఫీకర్‌లు సమాన స్థాయిలో పంచ్‌లు విసురుకున్నారు. తొలి ఐదు రౌండ్ల వరకూ ఆధిపత్యం ఎవరిదనేది స్పష్టత లేకపోయినా.. ఆఖరి రౌండ్లలో ఆధిపత్యం కనిపించింది. ఓ రౌండ్‌లో జుల్ఫీకర్ డిఫెన్స్‌లోకి వెళ్లగా.. మరో రౌండ్‌లో విజేందర్ వంతైంది. కానీ సొంత అభిమానుల నడుమ రెట్టించిన ఉత్సాహంతో కనిపించిన విజేందర్ సింగ్ జాబ్స్, పంచ్‌లు, హుక్ పంచ్‌లతో అదరగొట్టేశాడు. శనివారం బాటిల్‌గ్రౌండ్ ఆసియా ఫైట్‌కు ముందు వరకూ అజేయ రికార్డుతో ఉన్న జుల్ఫీకర్ కెరీర్‌లో తొలి ప్రొ ఫైట్‌ను విజేందర్‌కు కోల్పోయాడు.

శాంతి సందేశం

"ఈ టైటిల్స్ నాకొద్దు. నేను రింగ్‌లో పోరాడినది ఈ బెల్టుల కోసం కాదు. ఈ రెండు టైటిల్స్ తిరిగి జుల్ఫీకర్ మైమైటయాలికి తిరిగి ఇచ్చేస్తాను. ఈ ఫైట్ రెండు దేశాల మధ్య శాంతికి వారధిగా నిలవాలి. అందుకే ఈ టైటిల్స్ చైనా బాక్సర్‌కు తిరిగి ఇచ్చేస్తున్నాను. భారత్‌లో ప్రొ బాక్సింగ్‌కు మంచి భవిష్యత్ ఉందని ఆశిస్తున్నాను'

-విజేందర్ సింగ్

ప్రొ కబడ్డీలో నేడు

బెంగాల్X యూపీ యోధా
రాత్రి 8 గంటలకు
బెంగళూర్ x పట్నా పైరేట్స్
రాత్రి 9 గంటలకు
వేదిక : నాగ్‌పూర్ స్టేడియం
స్టార్‌స్పోర్ట్స్‌లో ప్రసారం



బీసీసీఐలో కొత్త వివాదం

కోశాధికారి సంతకం లేకుండానే నిధులు విడుదల

వివాదానికి చోటిచ్చిన పాలకుల కమిటీ నిర్ణయం

ముంబయి : సుప్రీంకోర్టు నియమిత పాలకుల కమిటీ (సీఓఏ) బీసీసీఐలో సరికొత్త వివాదానికి తెరదీసింది. కోశాధికారి సంతకం లేకుండానే నిధులు విడుదల చేసేందుకు సమాంతర వ్యవస్థను తయారు చేసింది. దీంతో భారత క్రికెట్ బోర్డులో ఇది వివాదస్పదంగా మారింది. 13 మంది క్రికెటర్లకు 'ఏకకాల సాయం' పేరిట ఒక్కొక్కరికి రూ. 35 లక్షలు ఇవ్వాలని పాలకుల కమిటీ నిర్ణయించింది. కానీ సర్వ సభ్య సమావేశం అనుమతి లేకుండా ఆర్థిక నిర్ణయాలు తీసుకోలేమని, జనరల్ బాడీలో నిర్ణయం తీసుకున్న తర్వాతే సంతకం చేస్తానని కోశాధికారి అనిరుధ్ చౌదరి స్పష్టం చేశారు. కానీ ఇందుకు అంగీకరించని పాలకుల కమిటీ బీసీసీఐ గేమ్ డెవలప్‌మెంట్ జనరల్ మేనేజర్ రత్నాకర్ శెట్టి, చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ సంతోష్‌లకు చెక్ పవర్ ఇచ్చింది. దీంతో ఈ ఇద్దరి సంతకాలతో 13 మంది క్రికెటర్లకు చెక్‌లు అందజేసింది. అతుల్ వాసన్, లాల్‌చంద్ రాజ్‌పుత్‌లు ఈ సాయం అందుకున్న జాబితాలో ఉన్నారు. ' ఏ సంస్థలోనైనా కోశాధికారి సంతకం లేకుండా నిధులు విడుదల చేసినట్టు ఎప్పుడైనా విన్నామా?. ఇదే విధానం కొనసాగించకూడదు. వ్యవస్థ లో దారుణ తప్పు జరుగుతోంది' అని బీసీసీఐ అధికారి ఒకరు వ్యాఖ్యానిం చారు. కోశాధికారి, జనరల్ బాడీని పక్కనపెట్టి పాలకుల కమిటీ ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవటం విమర్శలకు దారితీస్తోంది. పాలకుల కమిటీ తన విధులు మరిచి, పరిధి దాటి ప్రవర్తిస్తోందని కొందరు బీసీసీఐ అధికారులు విమర్శిస్తున్నారు.

సఫారీతో ఫుల్ సిరీస్!



న్యూఢిల్లీ : ఈ ఏడాది డిసెంబర్‌లో దక్షిణాఫ్రికా పర్యటనకు వెళ్లాల్సి ఉన్నా.. ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, శ్రీలంకలతో స్వదేశీ సీజన్ షెడ్యూల్ విడుదల చేసిన బీసీసీఐ దక్షిణాఫ్రికా క్రికెట్ బోర్డుకు ఝలక్ ఇచ్చింది. ప్రతిపాదిత షెడ్యూల్ ప్రకారం డిసెంబర్ 26న బాక్సింగ్ డే టెస్టుతో దక్షిణాఫ్రికా సిరీస్ ఆరంభం కావాల్సి ఉన్నది. కానీ శ్రీలంక క్రికెట్ బోర్డు అభ్యర్థన మేరకు బీసీసీఐ.. ద్వీప దేశంతో సిరీస్‌ను ఫిబ్రవరి-మార్చిలో కాకుండా ఈ ఏడాది ఆఖర్లోనే సర్దుబాటు చేసింది. దీంతో దక్షిణాఫ్రికా పర్యటనపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఓ దశలో దక్షిణాఫ్రికాతో కుదించిన సిరీస్‌ను మాత్రమే ఆడే వీలుందని సైతం బీసీసీఐ వర్గాలు వెల్లడించాయి. కానీ ప్రస్తుతం దక్షిణాఫ్రికాలో భారత్ పూర్తి సిరీస్ ఆడేందుకు సిద్ధమైందని తెలుస్తోంది. దక్షిణాఫ్రికాకు డిసెంబర్ 28న వెళ్లనున్న టీమ్ ఇండియా అక్కడ తొలి టెస్టును వచ్చే ఏడాది జనవరి 3న ఆడనున్నది. ఈ పర్యటనలో నాల్గు టెస్టులు, ఐదు వన్డేలు, మూడు టీ20ల సిరీస్ ఆడనున్నది. శ్రీలంకతో సిరీస్ డిసెంబర్ 23న ముగియనుండగా.. క్రిస్ట్‌మస్ తర్వాత కోహ్లిసేన సఫారీ సిరీస్‌కు వెళ్లనన్నట్టు ఓ బీసీసీఐ అధికారి వెల్లడించారు. అధికారికంగా ఇంకా ప్రకటన వెలువడాల్సి ఉన్నది.



యు ముంబా అదిరె

• దబంగ్ ఢిల్లీపై గెలుపు • ప్రొ కబడ్డీ లీగ్-5

నవతెలంగాణ-నాగ్‌పూర్

అనూప్ కుమార్ సారథ్యంలోని యు ముంబా దెబ్బకు దబంగ్ ఢిల్లీకి సీజన్‌లో హాట్రిక్ ఓటమి తప్పలేదు. ఆ జట్టు మాజీ సారథి, స్టార్ రైడర్ కాశీలింగ అడాకెను ఏకంగా నాల్గు సార్లు టాకిల్ చేసిన ఢిల్లీ.. షబ్బీర్ బపూ, అనూప్ కుమార్‌లను అడ్డుకోలేకపోయింది. 40 నిమిషాల ఆటలో పూర్తి ఆధిపత్యం ప్రదర్శించిన యు ముంబా 36-22తో 14 పాయింట్లతో ఢిల్లీపై ఘన విజయం సాధించింది. ఈ ఓటమి ఢిల్లీకి వరుసగా మూడో పరాజయం కావటం గమనార్హం. ఢిల్లీతో మ్యాచ్‌లో ముంబా ముందు నుంచే మెరిసింది. షబ్బీర్ బపూ ఏడు రైడ్ పాయింట్లకు తోడు డిఫెండర్ సురేశ్ కుమార్ నాల్గు మెరుపు టాకిల్స్‌తో ముంబా మురిసింది. కెప్టెన్ అనూప్ కుమార్ సైతం 6 పాయింట్లు తీసుకొచ్చాడు. దీంతో హాఫ్ టైమ్‌కు ముంబా 14-9తో ఐదు పాయింట్ల ఆధిక్యంలో కొనసాగింది. ఢిల్లీ తరపున డిఫెండర్ నిలేశ్ షిండే ఐదు టాకిల్స్‌తో అదరగొట్టినా.. ప్రయోజనం లేకపోయింది. ఆర్. శ్రీరామ్ మూడు పాయింట్లు సాధించాడు. మేరాజ్ షేక్ ఏడు రైడ్ పాయింట్లతో ఢిల్లీ పుంజుకునే అవకాశం ఇచ్చినా.. ఐనా ద్వితియార్థంలోనూ ఢిల్లీ గట్టి పోటీ ఇవ్వలేకపోయింది. రైడ్ పాయింట్లలో ఢిల్లీ (10) కంటే యు ముంబా (15) ఐదు పాయింట్లు ఎక్కువ సాధించగా.. టాకిల్స్‌లోనూ యు ముంబా (15)ను ఢిల్లీ (7)అందుకోలేదు. ఢిల్లీని రెండుసార్లు ఆలౌట్ చేసిన అనూప్ కుమార్ బృందం మరో నాల్గు పాయింట్లు ఖాతాలో వేసుకున్నది. **మరో మ్యాచ్‌లో బెంగళూర్‌బుల్స్ పై యుపీ యోధా 27-32 తేడాతో విజయం సాధించింది**



లంచ్‌లోపే లంకను మూసేశారు. అశ్విన్ ఐదు వికెట్ల మాయకు తోడు షమి, జడేజాలు మెరవటంతో తొలి ఇన్నింగ్స్‌లో శ్రీలంక 183 పరుగులకే కుప్పకూలింది. ఉదయం సెషన్‌లో 29.4 ఓవర్లలోనే 8 వికెట్లు కూల్చిన కోహ్లిసేన.. తొలి ఇన్నింగ్స్‌లో 439 పరుగుల భారీ ఆధిక్యం సాధించింది. లంకను ఫాలోఆన్ ఆడించిన కోహ్లి.. స్పిన్నర్ల జోరుతో మూడోరోజే ముగించేలా కనిపించాడు!. అంచనాలకు తగినట్టే ఆరంభంలోనే వికెట్ పడటంతో.. లంక పతనం లాంఛనమే అనిపించింది. కానీ కరుణరత్నె, కుశాల్ మెండిస్‌లు ఫాలోఆన్‌లో అసమాన పోరాటం కనబరిచారు. రెండో వికెట్‌కు 191 పరుగుల భాగస్వామ్యంతో భారత్ సహనానికి పరీక్షగా నిలిచారు. వీరిద్దరి ప్రతిఘటనతో కొలంబో టెస్టును లంకేయులు మరో రోజుకు తీసుకెళ్లారు. ఇంకా 230 పరుగుల వెనుకంజలో కొనసాగుతున్న శ్రీలంక నేడు భారత్‌ను మళ్లీ బ్యాటింగ్‌కు తీసుకురాగల్గితే అద్భుతం చేసినట్టే లెక్క.

ఫాలోఆన్ ప్రతిఘటన

• కరుణరత్నె, మెండిస్ ఎదురుదాడి • ప్రస్తుతం శ్రీలంక 209/2

- తొలి ఇన్నింగ్స్‌లో 183కే కుప్పకూలిన లంక
- ఐదు వికెట్లతో మెరిసిన అశ్విన్
- శ్రీలంకతో రెండో టెస్టు మూడో రోజు

నవతెలంగాణ-కొలంబో

రెండో టెస్టు రసవత్తరంగా సాగుతోంది. కొలంబోలో మూడో రోజు ఆట ఆసక్తిరేకెత్తిస్తోంది. తొలి సెషన్‌లోనే శ్రీలంకను కుప్పకూల్చిన భారత్ భారీ తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సొంతం చేసుకున్నది. స్పిన్నర్లు అశ్విన్ (5/69), జడేజా (2/84)లకు తోడు సీమర్లు మహ్మద్ షమి (2/13), ఉమేశ్ యాదవ్ (1/12) రెచ్చిపోయారు. 29.4 ఓవర్లలోనే శ్రీలంక ఆఖరి ఎనిమది వికెట్లను కూలగొట్టారు. 439 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సాధించిన టీమ్ ఇండియా.. లంచ్ తర్వాత శ్రీలంకను ఫాలోఆన్‌కు ఆహ్వానించింది. కానీ ఆ తర్వాత సీన్ రివర్స్ అయ్యింది. తొలి సెషన్లో కనిపించిన వికెట్ల జాతర.. పరుగుల ప్రవాహంలా రూపాంతరం చెందింది!. వరుసగా పెవిలియన్‌కు క్యూ కట్టిన లంకేయులు.. విచిత్రంగా బంతిని బౌండరీ లైన్‌కు దాటించేశారు. ఓపెనర్ కరుణరత్నె (92 నాటౌట్, 200 బంతుల్లో 12 ఫోర్లు), కుశాల్ మెండిస్ (110, 135 బంతుల్లో 17 ఫోర్లు) రెండో వికెట్‌కు 191 పరుగుల భాగస్వామ్యంతో టీమ్ ఇండియా బౌలర్లకు చెక్ పెట్టారు. దీంతో 60 ఓవర్లలో మనోళ్లు కేవలం రెండే వికెట్లు పడగొట్టగలిగారు. ప్రస్తుతం 209/2తో ఉన్న శ్రీలంక ఇంకా 230 పరుగుల వెనుకంజలో కొనసాగుతోంది. మెండిస్ నిష్క్రమించినా.. కరుణరత్నె పోరాటానికి తెరపడలేదు. రెండు సెషన్ల పాటు భారత బౌలర్లను నిలువరించిన శ్రీలంక.. నేడు మరో మూడు సెషన్ల పాటు నిలువరించటం ఆచరణ సాధ్యం కాదు!. దీంతో నాల్గోరోజే మరో టెస్టును నెగ్గి.. ద్వీపదేశంలో వరుసగా రెండో టెస్టు సిరీస్ విజయాన్ని సొంతం చేసుకునే దిశగా కోహ్లిసేన ఉరకలెస్తోంది.

మెండిస్, కరుణరత్నె అసమాన పోరాటం : భారీ తొలి ఇన్నింగ్స్ లోటుతో ఫాలోఆన్ ఆడుతున్న శ్రీలంక.. ఆరంభంలోనే ఓపెనర్ ఉపుల్ తరంగ (2)ను కోల్పోయింది. ఉమేశ్ యాదవ్ బంతికి తరంగ క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. దీంతో శ్రీలంక తొల ఇన్నింగ్స్ పతనానికి కొనసాగింపు మొదలైంది అనిపించింది. కానీ మరో ఓపెనర్ కరుణరత్నె (92), కుశాల్ మెండిస్ (110) భారత్ ఆనందాన్ని ఎంతోసేపు నిలువనీయలేదు. అశ్విన్ ఓవర్లో మెండిస్ ఎల్బీగా అవుటైనా.. రివ్యూకు వెళ్లి గట్టెక్కాడు. ఇక అక్కడ్నుంచి ఎదురుదాడి మొదలెట్టిన మెండిస్ వెనక్కి తగ్గలేదు. 120 బంతుల్లోనే శతకం సాధించాడు. ఫాలోఆన్ ఆడుతున్న ఒత్తిడి ఏమాత్రం కనిపించనీయని మెండిస్.. భారత బౌలర్లపై ఎదురుదాడి చేశాడు. మరో ఎండ్‌లో కరుణరత్నె డిఫెన్స్ మంత్రంతో చక్కని సహకారం అందించాడు. దీంతో ఈ జోడీ 191 పరుగులు జోడించి.. అనూహ్యంగా ప్రతిఘటించింది. లంచ్ తర్వాత 118 పరుగులు చేసిన శ్రీలంక.. మూడో సెషన్‌లో మరో 91 పరుగులు చేసింది. ప్రధానంగా స్పిన్నర్ల గుడ్ లెంగ్త్ బంతులకు స్వీప్ షాట్లతో దీటుగా బదులిచ్చిన కరుణరత్నె, మెండిస్ విశేషంగా ఆకట్టుకున్నారు. 17 ఫోర్లతో జోరుమీదున్న మెండిస్.. మూడో రోజు ఆట కొద్దిసేపట్లో ముగుస్తుందనగా వికెట్ పారేసుకున్నాడు. దీంతో నైట్ వాచ్‌మెన్ పుష్పకుమార (2) తోడుగా కరుణరత్నె క్రీజులో అజేయంగా నిలిచాడు. భారత బౌలర్లలో ఉమేశ్ యాదవ్, హార్దిక్ పాండ్యలు చెరో వికెట్ తీసుకున్నారు. స్పిన్నర్లు అశ్విన్, జడేజాలు వికెట్లేమీ తీసుకోలేకపోవటం గమనార్హం.

సెషన్ల వారీగా..

శ్రీలంక బ్యాటింగ్

తొలి సెషన్
పరుగులు : 133
వికెట్లు : 08
ఓవర్లు : 29.4


రెండో సెషన్
పరుగులు : 118
వికెట్లు : 01
ఓవర్లు : 29

మూడో సెషన్
పరుగులు : 91
వికెట్లు : 01
ఓవర్లు : 31


కరుణరత్నె 92 నాటౌట్ (200 బంతుల్లో 12 ఫోర్లు)

అశ్విన్ ఐదు వికెట్ల మాయ : ఓవర్‌నైట్ స్కోరు 50/2తో బరిలోకి దిగిన శ్రీలంక.. లంచ్ లోపే కుప్పకూలింది. స్టార్ స్పిన్నర్ అశ్విన్ మరో మూడు వికెట్లు కూల్చి కెరీర్ 26వ ఐదు వికెట్ల ప్రదర్శన నమోదు చేయగా.. జడేజా (3), షమి (2) రెచ్చిపోయారు. దీంతో శ్రీలంక 29.4 ఓవర్లలోనే ఆఖరి 8 వికెట్లు కోల్పోయింది. షమి ఆరు ఓవర్లలోనే రెండు వికెట్లు కూల్చగా.. ఉమేశ్ ఐదు ఓవర్లలోనే ఓ వికెట్ పడగొట్టాడు. వికెట్లు క్రమం తప్పకుండా కోల్పోయినా.. తొలి సెషన్‌లో శ్రీలంక 133 పరుగులు చేసింది. నిరోశన్ డిక్‌వాలా (51, 48 బంతుల్లో 7 ఫోర్లు, 1 సిక్స్) అర్ధసెంచరీకి తోడు దిల్‌రువన్ పెరీరా (26, 34 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్), మాథ్యూస్ (26, 33 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) కాసిన్ని పరుగులు చేశారు.

150



టెస్టుల్లో జడేజా తీసిన వికెట్లు. అత్యంత వేగంగా 150 వికెట్లు కూల్చిన లెఫ్టార్మ్ బౌలర్‌గా జడేజా (32 టెస్టులు)రికార్డు నెలకొల్పాడు. మిచెల్ జాన్సన్ (34)ను వెనక్కి నెట్టేశాడు.

2

భారత బౌలర్లలో 150 వికెట్ల క్లబ్‌లో జడేజా కంటే వేగంగా చేరుకున్న బౌలర్లలో అశ్విన్ ముందున్నాడు. అశ్విన్ 29 టెస్టుల్లో సాధించగా, జడేజా 32 టెస్టుల్లో కూల్చాడు.

26

టెస్టుల్లో అశ్విన్ ఐదు వికెట్ల ప్రదర్శనలు. భారత బౌలర్లలో హర్భజన్ (25)ను వెనక్కి నెట్టిన అశ్విన్.. కుంబ్లే (35) తర్వాతి స్థానంలో కొనసాగుతున్నాడు.



సికింద్రాబాద్‌లోని ఓ క్రికెట్ అకాడమీలో భారత మహిళల జట్టు సారథి మిథాలీరాజ్‌ను సన్మానిస్తున్న హెచ్‌సీఏ మాజీ అధ్యక్ష, కార్యదర్శులు అర్షద్ అయూబ్, జాన్ మనోజ్. పక్కన చాముండేశ్వరినాథ్.

స్కోరు వివరాలు

భారత్ తొలి ఇన్నింగ్స్ : 622/9 డిక్లేర్డ్

శ్రీలంక తొలి ఇన్నింగ్స్ : ఉపుల్ తరంగ (సి) రాహల్ (బి) అశ్విన్ 0, మెండిస్ (సి) కోహ్లి (బి) ఉమేశ్ యాదవ్ 24, చండిమాల్ (సి) పాండ్య (బి) జడేజా 10, మాథ్యూస్ (సి) పుజారా (బి) అశ్విన్ 26, డిక్‌వాలా (బి) మహ్మద్ షమి 51, ధనుంజయ డిసిల్వ (బి) జడేజా 0, దిల్‌రువన్ పెరీరా (బి) అశ్విన్ 25, రంగన హెరాత్ (బి) మహ్మద్ షమి 2, పుష్పకుమార నాటౌట్ 15, నువాన్ ప్రదీప్ (బి) అశ్విన్ 0, ఎక్స్‌ట్రాలు : 5, **మొత్తం :(49.4 ఓవర్లలో ఆలౌట్) 183.**

వికెట్ల పతనం : 1-0, 2-33, 3-60, 4-64, 5-117, 6-122, 7-150, 8-152, 9-171, 10-183.

బౌలింగ్ : మహ్మద్ షమి 6-1-13-2, అశ్విన్ 16.4-3-69-5, రవీంద్ర జడేజా 22-6-84-2, ఉమేశ్ యాదవ్ 5-1-12-1.

శ్రీలంక రెండో ఇన్నింగ్స్ (ఫాలోఆన్) : కరుణరత్నె బ్యాటింగ్ 92, ఉపుల్ తరంగ (బి) ఉమేశ్ యాదవ్ 2, కుశాల్ మెండిస్ (సి) సాహా (బి) పాండ్య 110, పుష్పకుమార బ్యాటింగ్ 2, ఎక్స్‌ట్రాలు : 3, మొత్తం : (60 ఓవర్లలో 2 వికెట్లకు) 209.

వికెట్ల పతనం : 1-7, 2-198.

బౌలింగ్ : ఉమేశ్ యాదవ్ 9-2-29-1, అశ్విన్ 24-6-79-0, మహ్మద్ షమి 6-2-13-0, జడేజా 16-2-76-0, హార్దిక్ పాండ్య 5-0-12-1.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State Editor : S.Veeraiah.Tel Tel/2014/59462.